



# విశ్వంవాయిస్

అవినీతిపై- అక్షరసమరం...

తెలుగు దినపత్రిక VISWAMVOICE TELUGU DAILY






SIMULTANEOUSLY PUBLISHED FROM EAST GODAVARI DISTRICT, CERCULATED AT IN WEST GODAVARI, VISAKHAPATNAM, SRIKAKULAM, VIJAYANAGARAM, VIJAYAWADA, HYDERABAD, BANGLORE, CHENNAI, DELHI, MUMBAI, TIRUPATHI, ANANTAPUR, GUNTUR, KADAPA, KHAMMAM, KARIMNAGAR, KURNOOL, NELLORE, NIZAMABAD, ONGOLE

సంపుటి : 9 | సంచిక : 20 | అమలాపురం | ఎడిటర్ : కె. సునీల్‌కుమార్ | ఆదివారం 12 అక్టోబర్ 2025 | పేజీలు : 12 | వెల : 2/-


# తప్పుడు ప్రచారం చేస్తే కఠిన చర్యలు



- నకిలీ మద్యం తయారు చేసినా, విక్రయించినా.. వారికి అదే చివరి రోజు
- తెదేపా వారున్నా వదిలిపెట్టం.. సీఎం చంద్రబాబు హెచ్చరిక
- నకిలీ మద్యం గుర్తింపునకు త్వరలో ప్రత్యేక యాప్
- వైకాపా శవ రాజకీయం చేస్తోందని మండిపాటు
- నెల్లూరులో స్మార్ట్ స్ట్రీట్ బజారును వర్చువల్‌గా ప్రారంభించిన సీఎం

**విజయవాడ, విశ్వం వాయిస్ న్యూస్ :**

రాష్ట్రంలో నకిలీ మద్యం ఎవరు తయారుచేసినా, విక్రయించినా వారికదే చివరి రోజవుతుందని ముఖ్యమంత్రి చంద్రబాబు హెచ్చరించారు. ములకలచెరువులో నకిలీ మద్యం తయారుచేసిన వారిని పట్టుకుని కేసులు పెట్టామని, ఈ వ్యవహారంలో తెదేపా వారున్నా ఉపేక్షించకుండా అరెస్టు చేసి, కఠినంగా వ్యవహరించామని ఆయన తెలిపారు. కొందరు దీంతో శవ రాజకీయాలు చేస్తున్నారని వైకాపా నాయకులపై మండిపడ్డారు. "వైకాపా ప్రభుత్వంలో మద్యం విధానంలో చాలా అక్రమాలు జరిగాయి. గంజాయి, డ్రగ్స్, నాసిరకం మద్యంతో 30 వేల మంది ప్రాణాలు తీశారు. కూటమి ప్రభుత్వంలో అలాంటి వాటిని ఉపేక్షించేది లేదు" అని ఆయన స్పష్టంచేశారు. నెల్లూరులో సాధారణ మరణం సంభవిస్తే... నకిలీ మద్యం తాగి చనిపోయినట్టు తప్పుడు ప్రచారం చేస్తున్నారని వైకాపా నాయకులు, ఆ పార్టీ అధ్యక్షుడు జగన్‌ను ఉద్దేశించి చంద్రబాబు నిప్పులు చెరిగారు. తప్పుడు ప్రచారం చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. నకిలీ మద్యాన్ని గుర్తించేందుకు త్వరలోనే ప్రభుత్వం ఓ యాప్ తీసుకువస్తుందని, మద్యం సీసాపై ఉన్న క్యూఆర్ కోడ్ స్కాన్ చేసి.. వివరాలు తెలుసుకునేలా యాప్ రూపొందిస్తున్నట్లు వివరించారు. నెల్లూరు నగరంలోని మైపాడు గేటు సమీపంలో రాష్ట్రంలోనే పైలట్ ప్రాజెక్టుగా ఏర్పాటుచేసిన మొదటి స్మార్ట్ స్ట్రీట్‌బజారును ముఖ్యమంత్రి చంద్రబాబు అమరావతి నుంచి వర్చువల్‌గా ప్రారంభించారు. ప్రభుత్వ ప్రైవేటు భాగస్వామ్యంలో (పీపీపీ) వైద్య కళాశాలలను నిర్మించి పేదలకు ఉచితంగా నాణ్యమైన వైద్యం అందిస్తామంటే వైకాపా నాయకులకు వచ్చిన బాధేంటని ముఖ్యమంత్రి ధ్వజమెత్తారు. ఈ విధానాన్ని వ్యతిరేకిస్తున్న వ్యక్తులు.. వారికి అనారోగ్యం కలిగితే కార్పొరేట్ ఆసుపత్రులకు వెళుతున్నారని.. పేదలకు మాత్రం ఉచితంగా నాణ్యమైన వైద్యం వద్దా అని నిలదీశారు. తాను ఏ పని చేసినా పేదలను దృష్టిలో ఉంచుకునే - మిగతా 2లో



# అన్నదాతకు అభయం

- ప్రధానమంత్రి ధన్ ధాన్య కృషి యోజన, తృణధాన్యాల మిషన్ ప్రారంభం
- ఆహార దిగుమతులు తగ్గించుకోవాలి, ఎగుమతులు పెంచుకోవాలి
- వికసిత్ భారత్ సాధనలో రైతన్నలదే కీలకపాత్ర
- ప్రజలకు ప్రోటీన్ భద్రత కోసం తృణధాన్యాల సాగును పెంచాలి
- ప్రధాని నరేంద్ర మోదీ పిలుపు
- పలు వ్యవసాయ ప్రాజెక్టులు ప్రారంభం.. మరికొన్నింటికి శంకుస్థాపన

6



## మూడో తరగతి నుంచే ఏఐ

- వచ్చే ఏడాది నుంచి అమలు.. కేంద్ర ప్రభుత్వం ప్రణాళిక
- ఈ ఫ్రేమ్‌వర్క్‌ను సెంట్రల్ బోర్డ్ ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్ (సీబీఎస్ఈ) సిద్ధం

# సూత్రధారి జనార్ధనే



- ఇంజనీరింగ్ చదివి.. కిరాణా కొట్టుతో మొదలై
- మద్యం వ్యాపారంలోకి జనార్ధన్‌రావు అడుగులు.. బెంగళూరు, ముంబై, ఢిల్లీల నుంచి స్పిరిట్
- హైదరాబాద్ నుంచి ఆర్టీసీ ద్వారా ఏపీకి సరఫరా.. ఫినాయిల్ సరఫరా పేరిట ఇన్వాయిసలు
- అద్దేపల్లి రిమాండ్ రిపోర్టులో కీలక విషయాలు.. రిమాండ్ విధించిన విజయవాడ కోర్టు

2



# కల్తీ మద్యం నివారణకు ప్రత్యేక యాక్షన్ ప్లాన్ సిద్ధం

- కాసుల కక్కుర్తితో కల్తీకి తెరలేపిందే జగన్ రెడ్డి
- అంతర్జాతీయ బ్రాండ్లు రద్దు చేసి కల్తీ బ్రాండ్లు తీసుకొచ్చింది జగనే
- ఎన్ఫోర్స్మెంట్ సరైన పనితీరుతోనే కల్తీ మద్యం పట్టుకున్నాం
- శవ రాజకీయం కోసమే కల్తీ మద్యం ఆరోపణలు
- ప్రజలే బాటిల్ స్టేటస్ తెలుసుకునేలా ఏపీటీఏటీఎస్ యాప్ తీసుకొస్తున్నాం
- కల్తీ మద్యం కేసులో ఎవరున్నా, ఎంతటి వారున్నా వదిలిపెట్టం
- రాష్ట్ర గనులు, భూగర్భ వనరులు, ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర

2

# పకడ్బందీగా కాలుష్య నియంత్రణ



- మత్స్యకారుల సమస్యల పరిష్కారానికి 100 రోజుల ప్రణాళిక
- కాకినాడ తీరంలో తీసుకొనే చర్యలు దేశానికే మోడల్ కావాలి
- పీసీబీ సమీక్షలో ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఆదేశాలు

**విజయవాడ, విశ్వం వాయిస్ న్యూస్ :**

పిఠాపురం నియోజకవర్గ పరిధిలోని తీర ప్రాంతంతో పాటు కాకినాడ జిల్లాలో పారిశ్రామిక కాలుష్య నియంత్రణకు పకడ్బందీ ప్రణాళిక రూపొందించాలని ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఆదేశించారు. తీరప్రాంత కాలుష్యంపై రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి అధికారులతో శనివారం ఆయన మంగళగిరి క్యాంపు కార్యాలయంలో సమీక్షించారు. పారిశ్రామిక వ్యర్థాల నిర్వహణ, కాలుష్య నియంత్రణ మండలిలో సిబ్బంది కొరత, కాకినాడలో మత్స్యకారులతో 'మాటామంతి'లో వారు ప్రస్తావించిన సమస్యలు, ఇతర అంశాలపై చర్చించారు. ఉప్పాడ తీరంలో కాలుష్యంపై మత్స్యకారులు - మిగతా 2లో



# సింగపూర్‌కు ఇండిగో నూతన విమాన సర్వీసు

- కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు
- విజయవాడ అభివృద్ధికి హద్దులు చెరిపేసిన రామ్మోహన్ నాయుడు.. త్వరలో మరిన్ని గ్లోబల్ సిటీలకు కనెక్టివిటీ
- రామ్మోహన్ నాయుడు కృషికి కృతజ్ఞతలు తెలుపుతున్న ప్రజలు

**విజయవాడ, విశ్వం వాయిస్ న్యూస్ :**

విజయవాడ అంతర్జాతీయ విమానాశ్రయం, సింగపూర్ మధ్య నూతన విమాన సర్వీస్‌ను ఇండిగో సంస్థ ప్రారంభించనుంది. ఈ సేవను నగర ప్రజలకు అందుబాటులోకి తీసుకురావడంలో కేంద్ర పౌర విమానయాన శాఖామంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు కీలకమైన పాత్ర పోషించారు. తాజాగా ఈ సర్వీసుకు సంబంధించి వివరాలను రామ్మోహన్ నాయుడు మీడియాకు వెల్లడించారు. విజయవాడ నుండి వారానికి మూడు సార్లు మంగళ, గురు, శనివారాల్లో ఈ సర్వీసు ఉండనుందని.. ఈ నవంబర్ 15 నుండి ఈ ఇండిగో విమాన సర్వీసు ప్రారంభం కానుందని రామ్మోహన్ నాయుడు - మిగతా 2లో

# మోదీని ట్రంప్ సన్నిహితుడిగా భావిస్తారు



- ప్రధాని మోదీతో అమెరికా రాయబారి భేటీ
- రక్షణ, వాణిజ్యం, సాంకేతికత వంటి ద్వైపాక్షిక అంశాలతోపాటు కీలక ఖనిజాల ప్రాముఖ్యతపైనా చర్చించాం
- గోర్ హయాంలో భారత్-అమెరికాల మధ్య వ్యూహాత్మక భాగస్వామ్యం మరింత బలోపేతమవుతుందని విశ్వాసం

6

# కల్తీ మద్యం నివారణకు ప్రత్యేక యాక్షన్ ప్లాన్ సిద్ధం

విజయవాడ, మహానగర్

రాష్ట్రంలో కల్తీ మద్యం గురించి వైసీపీ నేతలు మాట్లాడుతుంటే దెయ్యాలు వేదాలు వల్లించినట్లుగా ఉందని రాష్ట్ర గనులు, భూగర్భ వనరులు, ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర ఎద్దేవా చేశారు. నగరంలోని ఆర్ అండ్ బీ గెస్ట్ హౌస్‌లో శనివారం ఆయన పత్రికా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో మంత్రి కొల్లు రవీంద్ర మాట్లాడుతూ.. అన్నమయ్య జిల్లా మొకలకలచెరువులో కల్తీ మద్యం దొరకడం వాస్తవం. ఆ కేసును క్షుణ్ణంగా విచారిస్తున్నాం. 23 మంది నిందితులుగా గుర్తించాం. 14 మందిని ఇప్పటికే అరెస్టు చేశాం. ప్రధాన సూత్రధారి జనార్ధన్ రావును కూడా గన్నవరం విమానాశ్రయంలో అరెస్టు చేశాం. భవానీపురంలో మరో కేసును గుర్తించాం. అక్కడ 12 మందిని నిందితులుగా గుర్తించి 5 గురిని అరెస్ట్ చేశాం. నలుగురికి పీటీ వారెంట్ ఇచ్చాం. జయచంద్రారెడ్డి పాత్ర కూడా ఉందని తేలింది. అందుకే అతని కోసం గాలిస్తున్నాం. ఈ స్కాం మొత్తాన్ని నాలుగు టీములుగా విడిపోయి కేసు విచారణ చేస్తున్నాం. హైదరాబాద్, బెంగళూరు సహా పలు ప్రాంతాల్లో ఆయా బృందాలు తిరిగి నిందితులను గుర్తించే పనిలో ఉన్నాయి. జయచంద్రారెడ్డి కల్తీ మద్యం కేసులో ఉన్నాడని తెలియగానే తెలుగుదేశం పార్టీ నుండి సస్పెండ్ చేశాం. తెనాలికి చెందిన వైసీపీ బూత్ కన్వీనర్ ఇదే స్కాంలో ఉంటే ఎందుకు సస్పెండ్ చేయలేదో జగన్ రెడ్డి సమాధానం చెప్పాలి. కాకాణి గోవర్ధన్ రెడ్డి, మల్లాది విష్ణు లాంటి వారు తమ కల్తీ మద్యంతో ఎంతో మంది ప్రాణాలు తీశారు. వారిని సస్పెండ్ చేయకపోగా పదవులివ్వడమే జగన్ రెడ్డి నైతికతా అని ప్రశ్నించారు. కల్తీ మద్యాన్ని ప్రజలెవరైనా గుర్తించే విధంగా ఏపీటీఏటీఎస్ యాప్ రూపొందించాం. బాటిల్ పై ఉండే క్యూ ఆర్ కోడ్ స్కాన్ చేస్తే ఆ బాటిల్‌కు చెందిన ప్రతి సమాచారం తెలుసుకోవచ్చు. తయారైన చోటు, బ్యాచ్, డిపో, ఏ షాపుకు చేరింది అనే ప్రతి వివరాలు తెలుసుకునే వెసులుబాటు కల్పించాం. కల్తీ వ్యాపారం చేస్తే ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించబోం. ఒక బాటిల్ వస్తే అది ఎక్కడ తయారైంది, ఏ షాపుకు చేరిందనే ప్రతి వివరాలు ట్రాక్ చేస్తున్నాం. గత ఐదేళ్ల ట్రాక్ అండ్ ట్రేస్ విధానాన్ని జగన్ రెడ్డి నాశనం చేశారు. కూటమి వచ్చాక ఎక్సైజ్ వ్యవస్థ మొత్తాన్ని ప్రక్షాళన చేశాం.

ఎక్సైజ్ శాఖ మెరుగైన పనితీరు కారణంగానే ఈ రెండు చోట్ల కల్తీ మద్యాన్ని గుర్తించాం. సేల్స్ ఎప్పటికప్పుడు మానిటర్ చేయడం కారణంగానే ఈ రోజు ఈ స్కాం బయటపడింది. గత ఐదేళ్లు.. సరిహద్దుల్లో అక్రమ మద్యం రవాణా చాలా ఎక్కువగా ఉండేది. పొరుగు రాష్ట్రాల కంటే ఇక్కడ ఎక్కువ ధరలు ఉండడంతో.. అక్రమంగా రవాణా చేశారు. నేడు ధరలు సమానం చేయడంతో పాటుగా, క్వాలిటీ మద్యాన్ని అందించడంతో అక్రమ రవాణా దాదాపు నిర్మూలించాం. ఇప్పటికీ చాలా రాష్ట్రాల్లో ఈఎన్ఏ, రెక్టిఫైడ్ స్పిరిట్ అమల్లో ఉంది. కానీ, మన రాష్ట్రంలో ఇలాంటి కల్తీ లేకుండా చూస్తున్నాం. నవోదయం 2.0 ద్వారా నాటు సారాను పూర్తిగా నిర్మూలించాం. 21 జిల్లాలను ఇప్పటికే సారా రహిత జిల్లాలుగా మార్చాం. రాష్ట్రంలో ఉత్పత్తి అయ్యే ప్రతి బాటిల్‌ను 13 సార్లు పరీక్షిస్తున్నాం. డిపోల నుండి షాపులకు చేరిన తర్వాత కూడా పరీక్షిస్తున్నాం. అత్యంత పారదర్శకంగా మద్యం విధానాన్ని అమలు చేస్తూ, ప్రజల కోసం పని చేస్తుంటే.. జగన్ రెడ్డి ప్రభుత్వంపై బురద జల్లడమే పనిగా పెట్టుకున్నాడు. గత ఐదేళ్ల ప్రభుత్వ మద్యం షాపుల ద్వారా పారదర్శకంగా మద్యం అమ్మామని చెబుతున్నారు. అప్పటి వరకు ఉన్న మల్టీ నేషనల్ బ్రాండ్లు 2019 తర్వాత రాష్ట్రంలో ఎందుకు లేకుండా పోయాయి.? ప్రపంచంలో ఎక్కడా కనీ వినీ ఎరుగని బ్రాండ్లు ఎలా వచ్చాయి? ప్రభుత్వ షాపుల పేరుతో తన వారికి ప్రభుత్వ ఖజానాను దోచిపెట్టారు. రవాణా మొత్తాన్ని తమ వారి చేతుల్లో పెట్టారు. రాష్ట్రంలోని మద్యం వ్యాపారం మొత్తాన్ని సిండికేట్ చేసిన జగన్ రెడ్డి మద్యం గురించి మాట్లాడడం హాస్యాస్పదం. కల్తీ మద్యంతో ప్రజల ప్రాణాలు హరించి, జైలుకు వెళ్లి వచ్చినోళ్లు ఇప్పుడు ఏదో జరిగిపోయిందని రాద్ధాంతం చేస్తున్నారు. చేయాల్సిన అరాచకాలు, అకృత్యాలు చేసి సుద్దపూసల్లా మాట్లాడుతున్నారు. జంగారెడ్డిగూడెంలో కల్తీ మద్యం కారణంగా 27 మందిని చంపేశారు. పోయినోళ్లు పోయారు అని అవహేళన చేశారు. అలాంటి వాళ్లు కూడా ఇప్పుడు నీతులు చెబుతుంటే నవ్వొస్తోంది. ప్రతి నాలుగు బాటిళ్లలో ఒకటి కల్తీ అని చెప్పే జగన్ రెడ్డి ఆరోపణలు చేయడం కాదు.. నిరూపించాలి. సాధారణ మరణాలను సైతం మద్యానికి లింక్ చేస్తున్నారు. చనిపోయిన ప్రతి కేసులోనూ ఎఫ్ఐఆర్ నమోదు చేసి పోస్టు మార్టం చేస్తున్నాం. ఎవరు ఎక్కడ ఎలా చనిపోయినా మద్యానికి లింక్ చేయమని జగన్ రెడ్డి వైసీపీ నేతలకు చెప్పడం సిగ్గుచేటు. శవ రాజకీయాలు జగన్ రెడ్డికి అలవాటుగా మారిపోయింది. తండ్రి శవాన్ని పక్కన పెట్టుకుని సంతకాలు సేకరించాడు. బాబాయిని చంపి ముఖ్యమంత్రి అయ్యాడు. మీ అరాచకాలను చూసి ప్రజలు మిమ్మల్ని 11 సీట్లకు పరిమితం చేశారు. అయినా తప్పుడు ప్రచారాలు మానుకోవడం లేదు. తప్పుడు ప్రచారం చేస్తే ఎవరినీ ఉపేక్షించబోం. కేసులో ఎవరు భాగస్వాములున్నా వదిలిపెట్టబోం. ప్రజల్ని భయాందోళనలకు గురి చేయాలనుకుంటే మాత్రం వదిలిపెట్టబోం. ఏదైనా సమాచారం ఉంటే ముందుకొచ్చి అందించండి. చర్యలు తీసుకోవడానికి మేము సిద్ధంగా ఉన్నాం. అంతేకానీ గుడ్డకాల్చి మొహాన వేసి పారిపోతామంటే వదిలిపెట్టం. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ప్రతి షాపులోనూ త్వరలోనే మూకుమ్మడి సోదాలు నిర్వహిస్తాం. అక్రమాలు బయటపడితే షాపు లైసెన్సుని పూర్తిగా రద్దు చేస్తాం. ఉద్దేశ్యపూర్వకంగా వైసీపీ నాయకులు రాద్ధాంతం చేస్తున్నారని ఇప్పటికే పలు ఘటనల్లో అర్థమైంది. తప్పుడు ఆరోపణలు చేస్తే వదిలి పెట్టేది లేదు. కల్తీ మద్యాన్ని ప్రజలెవరైనా గుర్తించే విధంగా యాప్ రూపొందించాం. బాటిల్ పై ఉండే క్యూ ఆర్ కోడ్ స్కాన్ చేస్తే ఆ బాటిల్‌కు చెందిన ప్రతి సమాచారం తెలుసుకోవచ్చు. తయారైన చోటు, బ్యాచ్, డిపో, ఏ షాపుకు చేరింది అనే ప్రతి వివరాలు తెలుసుకునే వెసులుబాటు కల్పించాం. ప్రజలు ఛీ కొట్టినా పేర్ని నానికి బుద్ధి రాలేదు. పోలీసులపైనే తిరుగుబాటు చేయడం దుర్మార్గం. కులాలు, మతాల మధ్య చిచ్చు పెట్టాలనే లక్ష్యంతోనే పేర్నినాని వ్యవహరిస్తున్నాడు. చట్టాన్ని గౌరవించాల్సిన ప్రజాప్రతినిధులు.. పోలీసులపై దాడి చేయాలనుకోవడం సిగ్గుచేటు. ఇష్టానుసారం మాట్లాడుతామంటే వదిలిపెట్టం. కనుసైగ చేస్తే లేపేయాలి అంటున్న పేర్ని నాని.. మేము కన్ను కొడితే మావాళ్లను నువ్వు తట్టుకోగలవా? మాది ధర్మబద్ధంగా నడుచుకునే పార్టీ కాబట్టే మేము సంయమనం పాటిస్తున్నాం. 2014లో కల్తీ మద్యం కేసులో బాటిల్ స్వాధీనం చేసుకుంటే.. ఆ బాటిళ్లను పేర్ని నాని పగలగొట్టినందుకే గతంలో జైలుకు వెళ్లొచ్చాడు. ఆ విషయం చెప్పకుండా.. తానేదో స్వతంత్ర సమరయోధుడు అన్నట్లు మాట్లాడుతున్నాడని మంత్రి కొల్లు రవీంద్ర ఎద్దేవా చేశారు.

# అసలు మద్యంలో కలిసిపోయిన నకిలీ

ప్రొద్దుటూరు

"మూతలు, లేబుళ్లు ఒకే రకంగా ఉంటుండడంతో రాష్ట్రంలో అసలు మద్యం, నకిలీకి తేడా కనుక్కోలేని పరిస్థితి నెలకొంది. పేద, మధ్య తరగతి ప్రజలు తాగే క్వార్టర్ ధర రూ.99–రూ.130 మధ్య ఉన్న మద్యాన్ని నకిలీ చేస్తున్నారు. దీంతో వారి ప్రాణాలు ప్రమాదంలో ఉన్నట్లే. పేదలను టార్గెట్‌గా చేసుకుని వంద శాతం స్పిరిట్ ఉండే ఎన్ బ్రాండ్ మద్యాన్ని అన్ని షాపుల్లో అమ్ముతున్నారు. మద్యం నకిలీదా? కాదా? అని నిర్ధారిస్తే రూ.10 లక్షలు బహుమతిస్తా" అని మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి రాచమల్లు శివప్రసాదరెడ్డి తెలిపారు. వైఎస్సార్ కడప జిల్లా ప్రొద్దుటూరులోని స్వగృహంలో శనివారం ఆయన మాట్లాడారు. "రోజంతా కష్టం చేసేవారు సాయంత్రం బడలిక తీర్చుకునేందుకు తాగే మద్యం కూడా కూటమి నేతలు నకిలీది అమ్ముతున్నారు. ఇది విషంతో సమానం. ఏడాదిన్నరగా రోజూ పదుల సంఖ్యలో పేదలు చనిపోతున్నారు. ఇవేమీ ప్రభుత్వ రికార్డుల్లోకి



చేరడం లేదు. కొందరి మానసిక పరిస్థితి దెబ్బతింటోంది. కిడ్నీ, లివర్ చెడిపోతున్నాయి. రాత్రి నకిలీ మద్యం తాగినవారు పొద్దున కూలీ పనులకు వెళ్లలేకపోతున్నారు" అని పేర్కొన్నారు. పూర్ టు రిచ్ అన్న చంద్రబాబు నినాదం పూర్ టు శ్మశానం అయిందా? అని ఎద్దేవా చేశారు. సీఎం చంద్రబాబు ఇప్పుడు ఏం సమాధానం చెబుతారని ప్రశ్నించారు. పంటలకు యూరియా అధికంగా వాడితే క్యాన్సర్ వస్తుందని చంద్రబాబు చెబుతున్నారని ములకలచెరువు నకిలీ మద్యం తాగితే ఆరోగ్యం వస్తుందా? అని నిలదీశారు.

**గ్రామాల్లో లక్ష బెల్టు షాపులు**

టీడీపీ నాయకులు గ్రామాల్లో దాదాపు లక్ష బెల్టుషాపులు ఏర్పాటు చేశారని రాచమల్లు తెలిపారు. నకిలీ మద్యం కేసులో స్పిరిట్ సరఫరా చేసిన బెంగళూరుకు చెందిన బాలాజీని ఎందుకు అరెస్టు చేయలేదని ప్రశ్నించారు. జయచంద్రారెడ్డి వెనుక కరకట్ట పెద్దలున్నారని, నకిలీ మద్యాన్ని చెక్‌పోస్టుల్లో పట్టుకోకపోవడానికి ఇదే కారణమని, కేసును తారుమారు చేసేందుకు ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. నకిలీ మద్యంపై రాష్ట్రవ్యాప్తంగా సోమవారం ర్యాలీలు నిర్వహించి ఎక్సైజ్ అధికారులకు వినతిపత్రాలు సమర్పించాలని పార్టీ ఆదేశించినట్లు రాచమల్లు తెలిపారు. మహిళలతో కలిసి సోమవారం నిరసన ర్యాలీ నిర్వహిస్తామని పేర్కొన్నారు.

# సూత్రధారి జనార్దనే

విజయవాడ

రాష్ట్రంలో సంచలనం సృష్టించిన నకిలీ మద్యం కేసులో సంచలన విషయాలు వెలుగులోకి వచ్చాయి. కేసులో ప్రధాన నిందితుడు అద్దేపల్లి జనార్దన్‌రావే నకిలీ మద్యం తయారీ, విక్రయాలకు సూత్రధారి అని ఎక్సైజ్ పోలీసులు స్పష్టం చేశారు. అంతేకాదు.. వైసీపీ హయాం నుంచే నకిలీ మద్యం తయారీకి శ్రీకారం చుట్టినట్టు పేర్కొన్నారు. హైదరాబాద్‌లోని నిజాంపేటలో ఒక గదిని అద్దెకు తీసుకుని అక్కడ నకిలీ మద్యం తయారు చేసి, దానికి ఫినాయిల్ కలరింగ్ ఇచ్చి.. సరఫరా చేసినట్టు తెలిపారు. ఇన్వాయిసలు సైతం ఫినాయిల్ సరఫరా కోసమేనని తీసుకుని ఆర్టీసీ కార్గోలో ఇబ్రహీంపట్నంలో ఉన్న బార్‌కు పంపేవారు. నిజాంపేటలో ఏర్పాటు చేసిన నకిలీ మద్యం డిస్టలరీని తర్వాత అన్నమయ్య జిల్లాలోని మొలకలచెరువు, ఎన్టీఆర్ జిల్లాలోని ఇబ్రహీంపట్నానికి విస్తరించారు. జనార్దన్‌రావును ఎక్సైజ్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు గన్నవరం విమానాశ్రయంలో అరెస్ట్ చేసిన విషయం తెలిసిందే. శనివారం సాయంత్రం విజయవాడలోని ఆరో అదనపు జిల్లా జడ్జి కోర్టు న్యాయాధికారి లెనిన్‌బాబు.. జనార్దన్‌రావుకు రిమాండ్ విధించారు. కాగా.. రిమాండ్ రిపోర్టులో కీలక విషయాలను పేర్కొన్నారు.

**ఇంజనీరింగ్ చదివి..**

జానర్దన్‌రావు నెల్లూరు జిల్లాలోని వాకాడు కాలేజీలో ఇంజినీరింగ్‌ను పూర్తిచేశారు. తర్వాత కిరాణా వ్యాపారం చేసి, 2012లో మద్యం వ్యాపారంలోకి దిగారు. ఇబ్రహీంపట్నంలో ఏఎన్నాఆర్ బార్ అండ్ రెస్టారెంట్‌ను ఏర్పాటు చేసి, భారీ లాభాలను చవి చూశారు. అయితే, జాతీయ రహదారులకు పక్కన మద్యం షాపులు ఉండరాదని సుప్రీంకోర్టు ఇచ్చిన ఆదేశాలతో బార్‌ను మరోచోటకు మార్చుకోవాల్సి వచ్చింది. దీంతో వ్యాపారం దెబ్బతింది. ఈ నేపథ్యంలో నకిలీ మద్యాన్ని విక్రయించడం మొదలు పెట్టారు. హైదరాబాద్‌లోని నిజాంపేటలో ఒక గదిని అద్దెకు తీసుకుని, సమీపంలో ఉన్న మద్యం దుకాణం నుంచి హెచ్‌డీ విస్కీ కేసులను కొనుగోలు చేశారు. వాటి ద్వారా నకిలీ మద్యం తయారు చేసేవారు. వాటిని కేసులుగా పార్శిల్ చేసి అందులో ఫినాయిల్ ఉన్నట్టుగా అట్టపెట్టెలపై లేబుల్స్ అతికించి వాటిని ఆర్టీసీ కొరియర్ ద్వారా ఇబ్రహీంపట్నం పంపారు. బార్‌లో పనిచేసే ఉద్యోగి హాజీ ఆ పార్శిళ్లను తీసుకుని, వాటిని బార్‌లో అమ్మేవారు. 2022లో తుంగల సుధాకర్, చింతమనేని కృష్ణమోహన్, మహంకాళి పూర్ణచంద్రరావు, బొర్రా కిరణ్‌తో పాటు జనార్దన్‌రావు సోదరి సుబా భారతి, షరీఫ్ అనే వారిని వ్యాపార భాగస్వాములుగా చేసుకుని హైదరాబాద్‌లో ఈ–7 పేరుతో బార్‌ను నిర్వహించారు. అక్కడి నుంచి 35 లీటర్ల క్యానుల్లో చీప్ లిక్కర్‌ను సరఫరా చేసి విక్రయించేవారు. 2023లో జనార్దన్‌రావు గోవా వెళ్లారు. అక్కడ ఈ కేసులో నిందితుడిగా ఉన్న బాలాజీని కలిసి, మరిన్ని వ్యాపార అవకాశాల కోసం చర్చించారు. ఈ క్రమంలో 'నకిలీ ఫార్ములా'ను ఉయోగించి లిక్కర్ తయారీ చేయాలని నిర్ణయించుకున్నారు. స్పిరిట్, చక్కెర, ఇతరత్రా ముడిపదార్థాలతో 2023, ఏప్రిల్‌లో ఏఎన్నాఆర్ బార్ ఏర్పాటుచేసి, తొలగించిన ప్రదేశంలో నకిలీ మద్యం తయారీ మొదలుపెట్టారు. బెంగుళూరు, ముంబై, ఢిల్లీ ప్రాంతాల నుంచి స్పిరిట్, ఇతర ముడిపదార్థాలను బాలాజీ కొనుగోలు చేసి ఇబ్రహీంపట్నం పంపేవారు. తయారైన నకిలీ మద్యాన్ని జనార్దన్‌రావు సోదరుడు జగన్ మోహనరావు, మరికొందరు ఉద్యోగులు సీసాల్లో నింపి, వాటిపై కేరళ మార్ట్ విస్కీ, మంజీరా విస్కీ, ఓల్డ్ అడ్మిరల్ బ్రాందీ, క్లాసిక్ బ్లూ విస్కీ వంటి లేబుళ్లు అంటించేవారు. దీనికిగాను బాలాజీకి అడ్వాన్స్‌గా రూ.20 లక్షలను జనార్దన్‌రావు చెల్లించారు. లీటర్ బాటిల్‌కు రూ.350–450 బాలాజీ వసూలు చేసేవారు. వాటిని జనార్దన్‌రావు 180 ఎంఎల్ సీసాల్లోకి మార్చి ఒక్కోదానిపై రూ.30 నుంచి 40 లాభాన్ని ఆర్జించారు. 2024 ఎన్నికల సమయంలో నిఘా పెరగడంతో బాలాజీ స్పిరిట్‌ను సరఫరా చేయలేకపోయారు. దీంతో జనార్దన్‌రావు నకిలీ మద్యం తయారీ కార్యకలాపాలను తాత్కాలికంగా నిలుపుదల చేశారు. గత ఏడాది ఎన్నికల అనంతరం.. ఇంజనీరింగ్‌లో స్నేహితుడైన టీడీపీ తంబళ్లపల్లె నియోజకవర్గ ఇన్‌చార్జి జయచంద్రారెడ్డితో పాటు మరికొంతమంది స్నేహితులను కలిశారు. ప్రభుత్వం ప్రకటించిన మద్యం విధానంలో జయచంద్రారెడ్డి అనుచరుడు సురేంద్రనాయుడు, అతని పీఏ రాజేశ్ మద్యం షాపులను దక్కించుకున్నారు. వాటి ద్వారా నకిలీ మద్యం విక్రయించారు. ఇంతకుముందు మాదిరిగానే బాలాజీ ముడిసరుకును సరఫరా చేశారు.

**పని పంచుకున్నారు!**

నకిలీ మద్యం వ్యవహారంలో ఒక్కొక్కరు ఒక్కొక్క పనిని పంచుకున్నారు. శ్రీనివాసరెడ్డి అనే వ్యక్తి ఖాళీ ప్లాస్టిక్ సీసాలను సరఫరా చేయగా వాటిపై అతికించే లేబుళ్లు, బ్రాండ్ స్టిక్కర్లను రవి సమకూర్చారు. నకిలీ మద్యాన్ని విజయవాడ పరిధిలోని విద్యాధరపురంలోని ఉన్న శ్రీనివాస వైన్స్‌లో మేనేజర్ కల్యాణ్ ద్వారా విక్రయించారు. బాట్లింగ్, లేబుల్ ఫిక్సింగ్, ప్యాకింగ్‌లను సయ్యద్ హాజీ, కట్టా రాజు, బాదల్‌దాస్, ప్రదీప్ దాస్ మిథున్ దాస్, అంతా దాస్ చేసేవారు. జయచంద్రారెడ్డి ఆఫ్రికాలో ఉండడంతో జనార్దన్‌రావు గత నెల 25న ఆఫ్రికాలోని రువాండాకు వెళ్లారు. ఈ నకిలీ మద్యం తయారీలో ఇంకా అధునాతన పద్ధతులను పరిశీలించడానికి ఆఫ్రికా వెళ్లినట్టు ఎక్సైజ్ పోలీసులు రిమాండ్ రిపోర్టులో పేర్కొన్నారు.

## సింగపూర్‌కు ఇండిగో నూతన విమాన సర్వీసు

-మొదటిపేజీ తరువాయి

తెలిపారు. విజయవాడ నుండి సింగపూర్ లోని ఛాంగీ విమానాశ్రయాల మధ్య నేరుగా వారానికి మూడు సార్లు ఈ విమాన సర్వీసు స్థానికులకు సేవలందించనుంది. కాగా, ఇదే సర్వీసు విషయమై ఈ సంవత్సరం జులై 28వ తేదీన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సింగపూర్ పర్యటన సమయంలో ప్రస్తావన వచ్చినట్టు రామ్మోహన్ నాయుడు గుర్తు చేశారు. ప్రవాసాంధ్రుల సమావేశంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఇచ్చిన హామీ మేరకు.. వందరోజులోనే సర్వీసును ఏర్పాటు చేశామని స్పష్టం చేశారు. స్వర్ణాంధ్ర 2047లో ప్రవాసాంధ్రుల పాత్ర అత్యంత కీలకమైనదని రామ్మోహన్ నాయుడు తెలిపారు. చంద్రబాబు నాయుడు.. తన విజన్ ను స్పష్టంగా అమలుచేస్తున్న నేపథ్యంలో విమానయాన అవసరాలు పెరగనున్నాయనీ.. భవిష్యత్ లో కోటికి పైగా ప్రవాసాంధ్రులు ప్రయాణాలు జరిపే అవకాశం ఉండటంతో ఇంటర్నేషనల్ కనెక్టివిటీని మరింత విస్తృతం చేస్తామని రామ్మోహన్ నాయుడు స్పష్టం చేశారు. ప్రజలు, వ్యాపారవేత్తలు, విద్యార్థుల అవసరాలను పరిగణనలోకి తీసుకుని ఈ విమాన సర్వీసును అందుబాటులోకి తీసుకువచ్చారు. పౌర విమానయాన అభివృద్ధిలో విప్లవాత్మక ముందడుగుగా విజయవాడ ప్రాంతవాసులు, ప్రజా ప్రతినిధులు, పారిశ్రామిక వేత్తలు, విద్యార్థి సంఘాలు.. ఈ సర్వీసు పట్ల ఆసక్తిగా ఉన్నారు. ఈ నేపథ్యంలో స్థానికుల అభ్యర్థన, ఆలోచన మేరకు కేంద్రం సానుకూలంగా స్పందించడంతో నూతన విమాన సర్వీసు ఏర్పాటుకు రామ్మోహన్ నాయుడు మరింత చొరవ తీసుకున్నారు. ఇది కేవలం విజయవాడకే కాకుండా, తూర్పు ఆంధ్ర ప్రజలకు కూడా వరంగా మారనుంది. సింగపూర్ వంటి అంతర్జాతీయ నగరానికి ప్రత్యక్ష కనెక్షన్ లభించడంతో విజయవాడ %–% గుంటూరు ప్రాంతాల విద్యార్థులకు, పరిశ్రమలకు, పారిశ్రామికవేత్తలకు, పర్యాటకులకు నూతన అవకాశాలు ఏర్పడతాయని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. సన్ రైజ్ స్టేట్ ఆంధ్రప్రదేశ్ లో అంతర్జాతీయ నగరం అమరావతి రూపుదిద్దుకుంటున్న నేపథ్యంలో ఈ ఇంటర్నేషనల్ కనెక్టివి మరింత లాభిస్తుందని స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఉద్యోగావకాశాల కోసం, ఉన్నత విద్య కోసం అంతర్జాతీయంగా ప్రయాణించే యువతకి ఇది గొప్ప వారధిగా మారనుంది. నూతన విమాన సర్వీస్ అందుబాటులోకి తెచ్చినందుకు స్థానికులు కేంద్ర ప్రభుత్వానికి, ముఖ్యంగా కింజరాపు రామ్మోహన్ నాయుడుకు హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు. విజయవాడ నుండి మల్టిపుల్ టైమింగ్స్‌తో ప్రయోజనం పొందేలా ఇండిగో సంస్థ ప్రత్యేక చర్యలు తీసుకుంది. ప్రజా విజ్ఞప్తులను దృష్టిలో ఉంచుకుని ఫ్లైట్ టైమింగ్స్‌ను రూపొందించడంపై అభినందనలు వ్యక్తమవుతున్నాయి. అంతర్జాతీయ స్థాయిలో విజయవాడ అభివృద్ధి సాధించేందుకు ఈ విమాన సర్వీసు దోహదపడుతుందని, రాబోయే రోజుల్లో మరిన్ని అంతర్జాతీయ రూట్లు తెరవాలని స్థానికులు కోరుతున్నారు.

## తప్పుడు ప్రచారం చేస్తే కఠిన చర్యలు

-మొదటిపేజీ తరువాయి

చేస్తానని.. మంచి విద్య, వైద్యంతో పాటు ఆదాయం పెరిగేందుకు కృషి చేస్తామని అన్నారు. గత పాలకులు అనుసరించిన విధానంతో ఆసుపత్రులు కడితే పూర్తయ్యేందుకు కనీసం 20 ఏళ్లు పడుతుందని, అప్పటివరకూ పేదలు ఇబ్బందులు పడాలా అని ప్రశ్నించారు. ప్రస్తుత విధానంలో రెండేళ్లలోనే ఆసుపత్రులు అందుబాటులోకి వస్తాయని తెలిపారు.

**లక్ష మంది మహిళలను... పారిశ్రామికవేత్తలుగా చేస్తాం**

"మహిళలను ఆర్థికంగా అభివృద్ధి చేయడంపై ప్రత్యేకదృష్టి పెట్టాం. అత్యాధునిక సౌకర్యాలతో నెల్లూరులో చేపట్టిన స్మార్ట్ స్ట్రీట్‌బజారు అందులో భాగమే. మొత్తం 120 దుకాణాలకు సౌర విద్యుత్తు, వై–ఫై, సీసీ కెమెరాలు ఏర్పాటుచేశాం. దీంతో 120 మంది మహిళలు చిన్న పారిశ్రామికవేత్తలుగా మొదటి అడుగు వేశారు. రాబోయే రోజుల్లో రాష్ట్రంలోని డ్వాక్రా, మెప్మా సంఘాలకు చెందిన లక్షమంది మహిళలను పారిశ్రామికవేత్తలుగా తయారు చేస్తాం" అని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. "రూ.7 కోట్లతో 30 మాడ్యులర్ కంటెయినర్లలో 120 దుకాణాలు ఏర్పాటుచేశాం. అర్హులైన పేదలు, దివ్యాంగులకు అందించాం. ఏళ్లుగా వీధి వ్యాపారాలు చేస్తున్నవారికి.. అత్యాధునిక దుకాణాల్లో వ్యాపారం చేసుకునే సౌలభ్యం లభించింది. ఒకప్పుడు ఇంటికో ఐటీ ఉద్యోగం ఉండాలని భావించాం. ప్రస్తుతం ఏ దేశంలో చూసినా మన ఐటీ ఉద్యోగులు ఉన్నారు. ఇప్పుడు ప్రతి కుటుంబంలో ఒక పారిశ్రామికవేత్త అనే నినాదంతో ముందుకెళ్తున్నాం. త్వరలోనే రాష్ట్రవ్యాప్తంగా అన్ని మున్సిపాలిటీల్లో స్మార్ట్ స్ట్రీట్‌బజార్లు ఏర్పాటు చేస్తాం" అని తెలిపారు. ఈ వినూత్న ప్రయత్నం చేసిన మంత్రి నారాయణ, పురపాలక శాఖ, మెప్మా అధికారులను అభినందించారు. అంతకుముందు మహిళా వ్యాపారులతో ముఖ్యమంత్రి అమరావతి నుంచి వర్చువల్‌గా మాట్లాడి అభినందనలు తెలిపారు. దుకాణాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని.. వినియోగదారులకు అత్యుత్తమ సేవలు అందించాలని సూచించారు. ఎంపీ వేమిరెడ్డి ప్రభాకరరెడ్డి మాట్లాడుతూ.. స్మార్ట్ స్ట్రీట్‌బజారు అద్భుతంగా ఉందని, దీనిద్వారా ఎంతోమందికి ఉపాధి దొరుకుతుందన్నారు. మహిళలు ఈ దుకాణాల ద్వారా యజమానులుగా మారారని సంతోషం వ్యక్తం చేశారు. మంత్రి నారాయణ మాట్లాడుతూ.. రాష్ట్రంలోని 8 కార్పొరేషన్లు, 123 మున్సిపాలిటీల్లో ఇలాంటి షాపులు ఏర్పాటు చేస్తామన్నారు. నెల్లూరులో ఏర్పాటుచేసిన 120 దుకాణాల ద్వారా ప్రత్యక్షంగా సుమారు 500 మందికి ఉపాధి లభిస్తుందన్నారు. కార్యక్రమంలో మెప్మా ఎండీ తేజ్ భరత్, నెల్లూరు జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా, కమిషనర్ నందన్, రాష్ట్ర వక్ఫ్‌బోర్డ్ చైర్మన్ అబ్దుల్ అజీజ్, నుడా చైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, ఆర్టీసీ నెల్లూరు జోన్ చైర్మన్ సన్నపురెడ్డి సురేష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## పకడ్బందీగా కాలుష్య నియంత్రణ

-మొదటిపేజీ తరువాయి


ఆందోళన వ్యక్తం చేసిన నేపథ్యంలో తక్షణమే అక్కడి పరిస్థితుల్ని అధ్యయనం చేసి, సమగ్ర నివేదిక ఇవ్వాలని పవన్ ఆదేశించారు. సమస్య ఉన్న పరిశ్రమల్లో పొల్యూషన్ ఆడిట్ నిర్వహించాలని సూచించారు.



తీరప్రాంత మత్స్యకారుల సమస్యల పరిష్కారానికి రోడ్ మ్యాప్‌ను సిద్ధం చేసి, 100 రోజుల ప్రణాళికలను తక్షణమే అమలు చేయాలన్నారు. కాకినాడ జిల్లా పరిధిలోని తీరప్రాంతంలో కాలుష్య నియంత్రణకు తీసుకునే చర్యలు దేశానికే మోడల్ కావాలని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా పవన్ మాట్లాడుతూ "తీరప్రాంతంలో పరిశ్రమల నుంచి వచ్చే రసాయన వ్యర్థాలు తమ జీవనోపాధిని దెబ్బతీస్తాయని మత్స్యకారులు ఆందోళనలో ఉన్నారు. సముద్రంలో కలిసే వ్యర్థాలపై పర్యవేక్షణలో పారదర్శకత ఉండాలి. పర్యవేక్షక బృందాల్లో విద్యావంతులైన స్థానిక మత్స్యకార యువతకు అవకాశం కల్పించాలి. కాలుష్య కారక పరిశ్రమల్లో ఎప్పటికప్పుడు సమీక్షించి, ట్రీట్‌మెంట్ ప్లాంట్లను ఆధునీకరించాలి. నూతన సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించడంపై పారిశ్రామిక వేత్తలను సమాయత్తం చేయాలి' అని ఆదేశించారు. అవసరాలకు తగ్గట్టు సిబ్బంది నియామకంపై సీఎంతో చర్చిస్తానని, ఉన్న సిబ్బందిని సమర్థంగా వినియోగించాలని సూచించారు. ఈ సమీక్షలో పీసీబీ చైర్మన్ పీ కృష్ణయ్య, సభ్య కార్యదర్శి శరవణన్, పర్యావరణ ఇంజనీర్లు పాల్గొనగా, కాకినాడ జిల్లా కలెక్టర్ షణ్మోహన్, ఎస్పీ బిందుమాధవ్, మత్స్యకార ప్రతినిధులు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పాల్గొన్నారు.

# విశ్వం వాయిస్

అవినీతిపై- అక్షరసమరం...



## సింహాద్రి అప్పన్న స్వామి సన్నిధిలో "అభి" నృత్యం..

**పలువురు ప్రముఖులను, ప్రజలను ఆకట్టుకుంది - చిన్నారి "అభి" నృత్యానికి అభినందనలు**


**కూచిపూడి వృద్ధ కళాకారులకు పెన్షన్ ఇచ్చి ఆదుకోవాలి - కళాతపస్వీ తణుకు సాయిమాధవి**





**విశాఖపట్నం, విశ్వం వాయిస్ న్యూస్ :** సింహాచలం అప్పన్న స్వామి వారి సన్నిధిలో శ్రీ వరాహ లక్ష్మి నరసింహ స్వామి వారి దేవస్థానం కళా వేదికలో స్తిరవారం శ్రీశివసాయి కూచిపూడి కళాక్షేత్రం నిర్వాహికురాలు, కళాతపస్వీ తణుకు సాయి మాధవి వారిని ఆలయ కమిటి పెద్దల ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. దుస్సాలువాతో వారి అభిమానాన్ని చాటుకుని మెమోంటోను బహుకరించారు . అనంతరం కళా వేదికపై సాయిమాధవి విద్యార్థిని చిరంజీవి సి.హెచ్ "అభి " అద్భుతమైన నృత్య ప్రదర్శన చేసి పలువురుని ఆకర్శించి పెద్దల మన్నలను పొందింది. అభితో పాటుగా దివ్యాంషి, రత్నశ్రీ, సౌమ్య, హృతిక్, సాయి శ్రీ రామ్, దినశ్రీ, వేదశ్రీ లక్మి,హారిక, మనస్వి, లాస్య చక్కని నృత్య ప్రదర్శన చేసారు. సాయి మాదవి విద్యార్థినిలు వారి వారి నృత్య కళా నైపుణ్యాన్ని చాటుకున్నారు. ఇప్పటికే శ్రీ శివ సాయి కూచిపూడి కళాక్షేత్ర విద్యార్థులు భారతదేశంలో గల అనేక పవిత్ర పుణ్య క్షేత్రాల్లో కూచిపూడి నృత్య ప్రదర్శనలు చేసి రాజమండ్రి ఖ్యాతిని ఖండాంతరాలు వ్యాపింప చేసారు. చిన్నారుల ప్రదర్శనల అనంతరం సింహాచల పుణ్యక్షేత్ర పెద్దలు చిరంజీవి "అభి" కి మొమెంటో జ్ఞాపికతో పాటుగా సర్టిఫికెట్‌ను అందచేశారు. అభితో పాటుగా ప్రతిభను చాటుకున్న మరి కొంత మంది మెమెంటోలు అందుకుని పెద్దల అభినందనలు పొందారు. ఈ సందర్భంగా కళాతపస్వీ శివ సాయి కళా క్షేత్ర నిర్వహికురాలు తణుకు సాయి మాధవి మాట్లాడుతూ ప్రభుత్వం దృఢ సంకల్పంతో కళలకు వన్నె తెచ్చిన సాహితీ నగరం రాజమండ్రిలో కూచిపూడి కళలను, హిందూ ధర్మ ఔన్నత్యాన్ని ప్రోత్సహించే దిశగా పెద్ద స్థాయిలో ఒక కళా క్షేత్రం ప్రభుత్వం నిర్వహించి కూచిపూడి కళను ప్రోత్సాహించాలని, కూచిపూడి వృద్ధ కాళాకారులకు పెన్షన్ ఇచ్చి గౌరవించాలని , విద్యా సంస్థల్లో కూడా కూచిపూడి విద్య విలువలను , ఔన్నత్యాన్ని తెలియచేసే విధంగా ప్రత్యేక తరగతులు నిర్వహించి కూచిపూడి కళను,ఆ చరిత్రను తెలియచేయాల్సిన అవసరం ప్రభుత్వంపై వుందని మాధవి అభిప్రాయాన్ని వ్యక్త పరిచారు.

## రోబోటిక్ సర్జరీలపై అవగాహన..




**తాడేపల్లిగూడెం, విశ్వం వాయిస్ న్యూస్ :** తాడేపల్లిగూడెం నియోజకవర్గం పెంటపాడు మండలాలకి సంబంధించి తాళ్ల ముదునూరుపాడు డాక్టర్ పి.ఎస్ మూర్తి మెమోరియల్ సేవా సదన్ హాల్ నందు రాజమండ్రికి చెందిన డెల్టా హాస్పిటల్స్ ఆధ్వర్యంలో అడ్వాన్స్ రోబోటిక్ సర్జరీస్ మీద శనివారం, తాడేపల్లిగూడెం పెంటపాడు కమ్యూనిటీ పారా మెడిక్స్ ప్రైమరీ హెల్త్ కేర్ ప్రొవైడర్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులతో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సుకు ముఖ్య అతిథిగా డాక్టర్ నితిన్ రిమ్మలపూడి, డాక్టర్ సుమంత్ మండవ, ఆర్.క్రాంతి కుమార్ పాల్గొన్నారు. అడ్వాన్స్ రోబోటిక్ సర్జరీ ద్వారా హెర్నియా, గర్భాశయ, బేరియాట్రిక్, గాల్ బ్లేడర్‌లకు మేజర్ సర్జరీలు అతి తక్కువ నొప్పితో, తక్కువ ఖర్చుతో చేయునని తెలిపారు. షుగర్ వ్యాధికి సంబంధించి అధునాతన శస్త్రచికిత్సలపై అవగాహన కల్పించారు. క్యాన్సర్ వ్యాధి మీద అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సదస్సు ద్వారా ఈ అత్యాధునిక వైద్యం గురించి అసోసియేషన్ సభ్యులకు అవగాహన కల్పిస్తే వీరి ద్వారా ప్రజలకు(పేషెంట్స్‌కు) సమాచారం తెలుస్తుందని ఈ కార్యక్రమం నిర్వహించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సుమారు 100 మంది పైగా సభ్యులు పాల్గొన్నారు.


## శ్రీ నందమూరి తారక రామారావు విగ్రహ ఆవిష్కరణకు పరిటాల శ్రీరామ్ రాక

**సీతానగరం, విశ్వం వాయిస్ న్యూస్ :** తూర్పుగోదావరి జిల్లా సీతానగరం మండలం ముని కూడలి గ్రామంలో రుడా చైర్మన్ తెలుగుదేశం పార్టీ రాజనగరం నియోజకవర్గ ఇన్చార్జ్, రాష్ట్ర కార్యదర్శి బొడ్డు వెంకటరమణ చౌదరి ఆధ్వర్యంలో స్వర్గీయ నటసార్వభౌమ శ్రీ నందమూరి తారక రామారావు విగ్రహ ఆవిష్కరణకు స్వర్గీయ పరిటాల రవీంద్ర తనయుడు తెలుగుదేశం నాయకులు పరిటాల శ్రీరామ్ విచ్చేయుచున్న సందర్భంగా రాజమండ్రి ఎయిర్పోర్టులో పరిటాల శ్రీరామ్ కు బొడ్డు వెంకటరమణ చౌదరి తదితర నాయకులు ఘనంగా స్వాగతం పలికారు.

## హుక్కుంపేట కార్తికేయనగర్ డ్రైనేజ్ నీరుతో ప్రజలు ఇబ్బందులు..

**దోమలు, శానిటేషన్ తదితర సమస్యలు.. - అధికారులు పట్టించుకోవాలి, సమస్యను పరిష్కరించాలి..**





**రాజమహేంద్రవరం రూరల్, విశ్వంవాయిస్ న్యూస్ :** రాజమహేంద్రవరం రూరల్ నియోజకవర్గం హుక్కుంపేట పంచాయతీ స్థానిక కార్తికేయనగర్లో డ్రైనేజ్ నిండిపోయి వాటర్ బయటకు వచ్చి, దుర్గదంగా తయారయింది అని స్థానిక ప్రజలు ఇబ్బందిని వ్యక్తం చేశారు. స్థానికులు తెలుపుతూ.. మా కార్తికేయ నగర్ లో డ్రైనేజీ సమస్యను పలు సార్లు తెలిపినా అధికార యంత్రాంగం, నాయకులు గానీ పట్టించుకోలేదు, మా ఏరియా మొత్తం మురికి నీరు కాలువగా మారి చుట్టూ ఉన్న స్తానిక ప్రజలు దోమలు,క్రిమికీటకాలతో పురుగులతో బాధపడుతున్నాము. ఇలా కొన్ని రోజులు నీరు నిలవంటే స్థానికులకు లేనిపోని రోగాలు వచ్చే అవకాశం ఉంది. స్థానికులు ఆ దారిలో వెళ్లాలంటే నరకయాతన అనుభవిస్తున్నారు. దయచేసి అధికార యంత్రాంగం, నాయకులు పట్టించుకోవలసిందిగా ఈ సమస్యను పరిష్కరించాలని స్థానికులు ఆవేదన వ్యక్తం చేశారు.

## మేకలు కోల్పోయిన కుటుంబానికి లక్ష రూపాయలు సహాయం

**ప్రభుత్వ పరంగా ఆదుకుంటాం : రాజానగరం ఎమ్మెల్యే బత్తుల**





**కోరుకొండ, విశ్వం వాయస్ న్యూస్ :** దోసకాయల పల్లిలో సుబ్రహ్మణ్యానికి చెందిన సుమారు 40మేకలు అగ్నికి ఆహుతి కావడంతో రాజానగరం శాసనసభ్యులు బత్తుల బలరామకృష్ణ హుటా హుటిన వెళ్లి బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. శనివారం దోసకాయల పల్లిలో బాధిత కుటుంబాన్ని పరామర్శించి, పరిస్థితిని చూసి చలించిన బత్తుల తక్షణ సహాయాన్ని లక్ష రూపాయలు అందించారు. ప్రభుత్వ పరంగా అన్ని విధాల ఆదుకుని, మేకలను కొనుగోలు చేసుకోవడానికి బ్యాంకు రుణం ఇప్పిస్తానని బాధిత కుటుంబానికి బత్తుల దంపతులు భరోసా కల్పించారు. ఈ కార్యక్రమంలో పలువురు ఎన్డీఏ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## న్యాయవాద వృత్తి ఎంతో ఉన్నతమైనది.. : ఎమ్మెల్యే గోరంట్ల

**ఘనంగా న్యాయ కళాశాల స్నాతకోత్సవ సభ : న్యాయ పట్టభద్రులతో ప్రతిజ్ఞ చేయించిన ముప్పాళ్ళ సుబ్బారావు**









**రాజమహేంద్రవరం రూరల్, విశ్వం వాయిస్ న్యూస్ :** న్యాయవాద వృత్తి ఎంతో ఉన్నతమైనదని, యువ న్యాయవాదులు నిజాయతీ నిబద్ధతతో ఎదగాలని గోరంట్ల బుచ్చయ్యచౌదరి అన్నారు. జిఎస్‌కేఎం లా కళాశాల వార్షికోత్సవంలో స్నాతకోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా రాజమహేంద్రవరం రూరల్ శాసనసభ్యులు గోరంట్ల బుచ్చయ్య చౌదరి, ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర బార్ కౌన్సిల్ సభ్యులు ముప్పాళ్ళ సుబ్బారావు మాట్లాడుతూ తాను జీఎస్‌కేఎం లా కళాశాలలోనే చదవానని, అలనాటి ప్రముఖ న్యాయవాది గుర్రాలకృష్ణ స్ఫూర్తితో సమాజసేవ ఒక వైపు,మరోవైపు బార్ కౌన్సిల్ సభ్యులుగా న్యాయవాదుల సమస్యలపై పోరాడుతున్నామని, న్యాయవాదులు నీతి నిజాయితీ నిబద్ధత సంపాదనే లక్ష్యంగా కాకుండా సమాజ సేవ మరియు ప్రజల హక్కుల పరిరక్షణలో కూడా కొంత సమయాన్ని ఇచ్చి సమాజానికి ఉపయోగపడాలని, ప్రజలలో మంచి పేరు తెచ్చుకోవాలని, న్యాయ పట్టభద్రులై ఉన్నత పదవులు చేపట్టాలని, ఈ కళాశాలలో చదివిన అనేకమంది జిల్లాస్థాయి నుంచి హైకోర్టు వరకు న్యాయమూర్తులుగా ఎదిగారని గుర్తు చేశారు. ముప్పాళ్ళ సుబ్బారావు అన్నారు. కళాశాల యాజమాన్యం మాట్లాడుతూ యువ న్యాయవాదులు వృత్తిలో పాటించవలసిన నియమాలను వివరించడం జరిగింది. 1983లో తమ నాన్నమ్మ శారదరావు ఈ కళాశాలను స్థాపించారని, వారు చూపించిన బాటలో పయనిస్తూ,కళాశాలను ముందుకు తీసుకు వెళుతున్నామని కళాశాల డైరెక్టర్ శరత్ కృష్ణ అన్నారు. యువ న్యాయ వాదులు చేత ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ ఎస్.మధు సూదనరావు, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ మార్ని వాసుదేవరావు, కళాశాల ఉపాధ్యక్షురాలు లక్ష్మీ శ్రీనివాస్, ప్రముఖ న్యాయవాది, సీనియర్ అధ్యాపకులు పి.శ్రీనివాస రావు, విద్యార్థి నాయకులు ఇంద్రాణి, నాగరాజు, ఆసిఫ్ తదితరులు పాల్గొన్నారు.

## ఆదిరెడ్డికి ముస్లిం మైనారిటీలు కృతజ్ఞతలు..



**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** ఏళ్ల తరబడి ఉన్న సమస్యకు పరిష్కారం లభించడంతో నగరానికి చెందిన ముస్లిం మైనారిటీ లు రాజమహేంద్రవరం సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ కు కృతజ్ఞతలు తెలిపారు. స్థానిక 4వ డివిజన్ రాజేంద్రనగర్‌లో ఉన్న బిలాల్ మసీదును పునర్మించేందుకు అక్కడి మసీదు కమిటీ నిర్ణయించింది. అయితే అందుకు సంబంధించిన ప్లాన్ అప్రూవల్ ఇతర తతంగాలు పూర్తి చేసేందుకు పొజిషన్ సర్టిఫికెట్ కాల్సివచ్చింది. ఈ విషయాన్ని మసీదు కమిటీ, అలాగే స్థానిక టీడీపీ పెద్దలు నక్కా చిట్టిబాబు, నక్కా దేవీవరప్రసాద్, ముస్లిం మైనారిటీ నాయకులు మహ్మద్ అబ్దుల్లా తదితరులు ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ వారి దృష్టికి తీసుకురాగా, ఆయన సానుకూలంగా స్పందించి సంబంధిత అధికారులతో మాట్లాడి పొజిషన్ సర్టిఫికెట్ వచ్చేలా చేశారు. అందుకు సంతోషించిన ముస్లిం మైనారిటీ నాయకులు, మసీదు కమిటీ సభ్యులు, స్థానిక టీడీపీ నాయకులు తిలక్ రోడ్డులోని నగర టీడీపీ కార్యాలయంలో ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్‌ను కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మసీదు పున నిర్మాణానికి కావాల్సిన అన్ని అనుమతులు వచ్చేలా చేస్తానని, అలాగే మసీదు నిర్మాణానికి తన వంతు ఆర్థిక సహాయం అందిస్తానని ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ హామీ ఇచ్చారు.

## ఊహించని ప్రమాదం పెను విషాదాన్ని మిగిల్చింది..

**అగ్ని ప్రమాద భాదితుల కుటుంబాలను పరామర్శించిన ఎమ్మెల్యే వేగుళ్ళ..**



**రాయవరం , విశ్వంవాయిస్ న్యూస్ :** డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా, మండల కేంద్రమైన రాయవరం శివారులో శ్రీ గణపతి గ్రాండ్ ఫైర్ వర్క్స్ బాణాసంచా కర్మాగారంలో జరిగిన అగ్ని ప్రమాద ఘటనలో మరణించిన రాయవరం మండలం, సోమేశ్వరం గ్రామానికి చెందిన పాక అరుణ, వాసంశెట్టి విజయలక్ష్మిల కుటుంబ సభ్యులను రాష్ట్ర అంచనాల కమిటీ చైర్మన్, ఎమ్మెల్యే వేగుళ్ళ జోగేశ్వరరావు శనివారం పరామర్శించారు. ఈ సంధర్భంగా ఆయన మాట్లాడుతూ అనుకోని సంఘటనతో కార్మికుల కుంటుంబాలు శోకసంద్రంలో మునిగిపోయాయని, ఇటువంటి సంఘటన దురదృష్టకరమని అన్నారు. చనిపోయిన వారి పవిత్ర ఆత్మకు శాంతి కలగాలని ఆ భగవంతున్ని ప్రార్థించారు. వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. మృతుల కుటుంబాలకు కూటమి ప్రభుత్వం భరోసాగా ఉంటుందన్నారు. ఈ పరామర్శలలో ఎమ్మెల్యే వెంట అమలాపురం పార్లమెంట్ ఉపాధ్యక్షులు వై.ఆర్.కె.పరమహంస, సొసైటీ చైర్మన్ శాక కోటేశ్వరరావు, గ్రామ టీడీపీ అధ్యక్షులు శాక శ్రీనివాస్, రావుల సత్యనారాయణ, అమ్మవరపు సత్యనారాయణ, నీటి సంఘం డైరెక్టర్ పిల్లి వెంకటరమణ, కడియాల వెంకటరమణ, గుత్తుల పవన్ కుమార్, గుత్తుల వీరన్న, చింతపల్లి వెంకటరమణ, దండంగి పైసా దాసు, సరాకుల రాజు, మద్ద రాజు, అనసూరి శ్రీనివాసు, కురుపూడి సత్యనారాయణ, కూటమి నాయకులు, కార్యకర్తలు, తదితరులు ఉన్నారు.

# ఎడిటర్ వాయిస్

## మత్తులో యువత చిత్తు

విచక్షణ జ్ఞానం గల మనిషిని మాదకద్రవ్యాలు మృగంగా మార్చేస్తూ, ప్రజా ఆరోగ్యానికి, శాంతి భద్రతలకు ప్రథమ శత్రువులుగా పరిణమించాయి. గంజాయి, హెరాయిన్, కొకైన్, మెఫీడ్రిన్ వంటి పదార్థాలు నిత్యం ఏదో ఓ చోట పట్టుబడుతూనే ఉన్నాయి. అదే సమయంలో ఎన్నో రెట్లు ఎక్కువ పరిమాణంలో మత్తు పదార్థాలు సురక్షితంగా గమ్యస్థానాలకు చేరి వినియోగ దారుల చెంతకు చేరుతున్నాయి. విదేశాల నుంచి భారత్‌లోకి చొరబాట్ల ద్వారా ప్రవేశిస్తున్న ఈమత్తు పదార్థాలకు తోడు, స్థానిక పరిశ్రమల్లో గుట్టు చప్పుడు కాకుండా జరుగుతున్న డ్రగ్ తయారీ దందాలు దేశ భవిష్యత్తుకు తీవ్రమైన ముప్పుగా మారాయి. ఇటీవల హైదరాబాద్‌లోని చర్లపల్లి ప్రాంతంలో పోలీసుల దాడిలో కోట్ల రూపాయల విలువైన మెఫీడ్రిన్ మత్తుమందు, ముడిసరుకులు స్వాధీనం కావడం ఈ వ్యవస్థీకృత నేరాల విస్తృతిని సూచిస్తోంది. గుజరాత్, రాజస్థాన్ వంటి రాష్ట్రాల్లో కూడా ఇలాగే రూ.230 కోట్ల విలువైన డ్రగ్స్ ఉత్పత్తి సామగ్రి పట్టుబడింది. ఇవన్నీ ప్రాణాధార ఔషధాల ముసుగులో జరుగుతున్న నేర కార్యకలాపాలు. వీటిని సమూలంగా అరికట్టకపోతే దేశాన్ని అనారోగ్యం, అల్లకల్లోలం వైపు నెడతాయి. పాఠశాలల నుండి విశ్వవిద్యాలయాల వరకు, వృత్తి, సాంకేతిక విద్యాలయాల వరకు మత్తుమందుల ప్రభావం విస్తరిస్తోంది. యువతలో 'ఒత్తిడి' తగ్గించుకోవడం పేరుతో లేదా స్నేహితుల ప్రోత్సాహంతో డ్రగ్స్ వైపు అడుగులు వేస్తున్నారు. ఉన్నత విద్యావంతులు, డాక్టర్లు, ఇంజినీర్లు సైతం ఈ మాదక రక్కసి కబంధహస్తాల్లో చిక్కి విలవిల్లాడుతున్నారు. మత్తు అలవాటుతో మానసిక స్థైర్యం కోల్పోయి నేరాలకు పాల్పడడం, ఆత్మహత్యలు చేసుకోవడం వంటి ఘటనలు పెరుగుతున్నాయి. డ్రగ్స్ ట్రీట్మెంట్ క్లినిక్‌లకు వెళ్లేవారి సంఖ్య ఐదేండ్లలో పదమూడు వందల శాతం పెరిగిందని గణాంకాలు చెబుతున్నాయి. ఇండోర్, ముంబై, చెన్నై, లక్నో వంటి నగరాల్లో ఈ మహమ్మారి విస్తరిస్తూ ఉంది. మన రాష్ట్రంలోనే మత్తు మార్కెట్ విలువ దాదాపు రూ.వెయ్యి కోట్లకు పైగా ఉందని అధికారులు చెబుతున్నారు. పట్టుబడుతున్న మత్తుమందులు మొత్తం వ్యాపారంలో పది శాతానికి కూడా చేరవు. స్థానికంగా ఉత్పత్తి అవుతున్న గంజాయి, లాటిన్ అమెరికా నుంచి చేరే హెరాయిన్, అలాగే ఔషధ కర్మాగారాల రూపంలో తయారవుతున్న రసాయన డ్రగ్స్ మార్కెట్లో సులభంగా లభ్యమవుతున్నాయి. ప్రస్తుతం నలభై నాలుగుకు పైగా రకాల మత్తు పదార్థాలు వినియోగంలో ఉన్నాయని అధికారుల అంచనా. ఇటీవల మహారాష్ట్ర పోలీసులు చర్లపల్లి పారిశ్రామికవాడలో రూ.పన్నెండు కోట్ల విలువైన మత్తు మందులు స్వాధీనం చేసుకోవడం, గత ఏడాది రూ.139 కోట్లు, ఈ ఏడాది జూలై వరకు రూ.68 కోట్ల విలువైన డ్రగ్స్ ఈగల్ అధికారులు పట్టుకోవడం పరిస్థితి తీవ్రతను తెలియజేస్తున్నాయి. పట్టణాలు, నగరాల ప్రతి మూలలో గంజాయి మత్తులో తేలుతున్న యువతను చూడడం ఇప్పుడు సాధారణ దృశ్యమైంది. హైదరాబాద్‌లో ఖరీదైన హెరాయిన్, కొకైన్ డ్రగ్స్‌తో పార్టీలు నిర్వహించడం 'ఫ్యాషన్'గా మారింది. ముఠాలు మొదట ఉచితంగా సరఫరా చేసి, తరువాత ఆ వ్యక్తులను అమ్మకందారులుగా మార్చే వ్యూహం అవలంబిస్తున్నాయి. ప్రభుత్వం కట్టడి చర్యలు ఫలితాలనివ్వడం లేదు. అధికారుల కన్నుగప్పి వ్యాపారం విస్తరిస్తూనే ఉంది. 2023లో ఈగల్ అధికారులు 104.75 గ్రాముల కొకైన్ స్వాధీనం చేసుకోగా, 2024లో అది 336.56గ్రాములుగా పెరిగింది. అలానే హెరాయిన్ విషయంలో కూడా ఇదే ధోరణి 2023లో 419 గ్రాములు, 2024లో 2,160.67 గ్రాములు పట్టుబడ్డాయి. నిన్నటికి నిన్న వ్యాసం రాస్తుండగానే హైదరాబాద్‌లో నిషేధిత ఎఫి డ్రీన్ మత్తు పదార్థాన్ని భారీగా తయారు చేసి విక్రయించేందుకు సిద్ధమైన ముఠాను తెలంగాణ ఈగల్ (ఎలిటీ యాక్షన్ గ్రూప్ ఫర్ డ్రగ్ లా ఎన్ ఫోర్స్‌మెంట్) పట్టుకుంది. 220 కిలోల ఎఫీడ్రిన్ ను స్వాధీనం చేసుకుంది. దీని విలువ దాదాపు రూ. 72 కోట్ల విలువ అంతర్జాతీయ మార్కెట్లో ఉంటుందని తెలుస్తోంది. ఈ పరిస్థితులు,గణాంకాలు భయంకర దిశను చూపుతున్నాయి. ఇలా ఊడలు దిగిన డ్రగ్స్ విషవ్యాపారాన్ని నిర్మూలించాలంటే? కేంద్రం అన్ని రాష్ట్రాలు కలిసికట్టుగా పని చేయాలి. దీనికి సంబంధించిన ముడి సరుకులు ఎక్కడినుంచి వస్తున్నాయి, ఏ ప్రాంతాల్లో మత్తు మందులను ఎలా తరలిస్తున్నారు? అనే అంశాలపై లోతుగా ఆరా తీయాలి. ఆ రవాణా వ్యవస్థను పూర్తిగా విచ్ఛిన్నం చేయాలి.



ఎడిటర్ : కె. సునీల్‌కుమార్

# న్యాయ వేదికపై ఓ మానవతా విప్లవం



డాక్టర్ రామ్ మనోహర్ లోహియా 1910 మార్చి 23న ఉత్తర ప్రదేశ్ రాష్ట్రంలోని ఫైజాబాద్ జిల్లా, అక్బర్‌పూర్ గ్రామంలో జన్మించారు. మధ్యతరగతి కుటుంబంలో పుట్టిన ఆయన చిన్ననాటి నుంచే సమాజంలో ఉన్న అసమానతలు, పేద ప్రజల కష్టాలు, అన్యాయ పరిస్థితులు ఆయన మనసును కదిలించాయి. సామాజిక న్యాయం కోసం జీవితాన్ని అంకితం చేయాలన్న సంకల్పం చిన్నతనంలోనే ఆయనలో బలపడింది. విద్యాభ్యాసంలో అసాధారణ ప్రతిభ కనబరచిన లోహియా, భారత రాజకీయ, ఆర్థిక వ్యవస్థలపై లోతైన అవగాహన పెంపొందించుకున్నారు. జర్మనీలో ఆర్థిక శాస్త్రంలో డాక్టరేట్ పూర్తి చేసి, యూరోపియన్ సామాజిక సిద్ధాంతాలపై విశేష పట్టు సాధించారు. అక్కడి సామాజిక, ఆర్థిక చైతన్య ఉద్య మాల నుంచి ఆయనకు స్ఫూర్తి లభించి, దేశానికి ఒక ప్రగతిశీల నాయకుడిగా అవతరించడానికి దారితీసింది. లోహియా గారి రాజకీయ ప్రవేశం భారత స్వాతంత్ర్య ఉద్యమం ద్వారానే ఆరంభమైంది. 1930–40ల మధ్య గాంధీ సత్యాగ్రహాలు, నిరసనలు, జైలు పోరాటాల్లో ఆయన చురుకుగా పాల్గొన్నారు. స్వాతంత్ర్య సమరయోధుడిగా, ఉద్యమకారుడిగా ఆయన చూపిన ధైర్యం, త్యాగం విశేషమైనవి. భారత యువతలో రాజకీయ చైతన్యాన్ని రగిలించడం, స్వాతంత్ర్యం కోసం వారిని ప్రేరేపించడం ఆయన ప్రధాన ధ్యేయంగా మారింది. విదేశాల్లో నేర్చుకున్న సామాజిక ఆర్థిక సిద్ధాంతాలను భారతీయ పరిస్థితులకు అనుగుణంగా మార్పులు చేసి, పేదలు, రైతులు, వెనుకబడిన వర్గాల అభ్యున్నతికి అంకితభావంతో కృషి చేశారు. స్వాతంత్ర్యం అనంతరం లోహియా గారు భారత రాజకీయ రంగంలో సామాజిక సమానత్వం, ఆర్థిక న్యాయం, పేదల సంక్షేమం వంటి అంశాలను ముందుకు తెచ్చారు. నెహ్రూ ప్రభుత్వ విధానాలపై ఆయన గట్టి విమర్శలు చేశారు. ప్రజల సంక్షేమాన్ని కంటే ప్రభుత్వ వ్యవస్థల కేంద్రీకృత ఆలోచనలను ఆయన వ్యతిరేకించారు. సోషల్ ప్రోగ్రెసివ్ పార్టీ, తరువాత సోషలిస్ట్ పార్టీ స్థాపన ద్వారా రైతులు, కార్మికులు, వెనుకబడిన వర్గాలు, యువత హక్కుల పరిరక్షణకు గట్టి కదలికలు చేపట్టారు. లోహియా గారి నాయకత్వం సామాజిక న్యాయం, ప్రజాస్వామ్య విలువలకు కొత్త దిశను చూపింది. లోహియా గారి రాజకీయ తత్త్వాలు ప్రజాస్వామ్యం, సామాజిక సమానత్వం, యువత చైతన్యం, ఆర్థిక న్యాయం అనే నాలుగు మూలస్తంభాలపై నిలిచాయి. కుల, లింగ, ఆర్థిక భేదాలను నిర్మూలించి, సమాజంలోని ప్రతి వర్గానికి సమాన అవకాశాలు కల్పించాలన్నది ఆయన ప్రధాన ధ్యేయం. ప్రజాస్వామ్యం కేవలం ఓటు హక్కులో కాకుండా, ప్రజల పాలనా హక్కులో ప్రతిబింబించాలన్నది ఆయన విశ్వాసం. ఆయన రైతు, కార్మికుల జీవితాలను లోతుగా అర్థం చేసుకుని, వారి సమస్యలకు తక్షణ పరిష్కార మార్గాలను సూచించారు. ప్రజల్లో రాజకీయ అవగాహన, సామాజిక బాధ్యత కలగాలన్న ఆలోచనతో జీవించారు. లోహియా గారి రాజకీయ జీవనంలో అనేక విశిష్ట ఘట్టాలు చోటుచేసుకున్నాయి. 1942–44 మధ్య స్వాతంత్ర్య పోరాటంలో బాంబే, లక్నో, అహ్మదాబాద్ ప్రాంతాల్లో యువత, రైతు ఉద్యమాలకు నాయకత్వం వహించారు. 1948–49లో సోషల్ యూత్ ఆర్గనైజేషన్‌ను స్థాపించి, యువతలో సామాజిక, రాజకీయ చైతన్యాన్ని పెంపొందించారు. 1952–67 మధ్య లఖ్నో, బీహార్ ప్రాంతాల ప్రజాప్రతినిధిగా పార్లమెంట్‌లో పనిచేసి, పేదల, రైతుల, కార్మికుల హక్కుల రక్షణకు సంబంధించిన చట్టబిల్లులు ప్రవేశపెట్టారు. నెహ్రూ పాలనలోని ఆర్థిక విధానాలపై ఆయన చేసిన విప్లవాత్మక విమర్శలు, ప్రత్యామ్నాయ ఆర్థిక సూత్రాల ప్రతిపాదనలు భారత రాజకీయ చరిత్రలో ప్రగతిశీల మైలురాళ్లుగా నిలిచాయి. లోహియా గారి ప్రసంగాలు, వ్యాసాలు, రచనలు భారతీయ రాజకీయ, ఆర్థిక, సామాజిక అంశాలపై లోతైన విశ్లేషణను అందించాయి. 1950%–%67 మధ్య ఆయన రూపొందించిన సామాజిక న్యాయ బిల్లులు, రైతు సంక్షేమ చట్టాలు, కార్మిక హక్కుల పరిరక్షణ చట్టాలు భారత రాజకీయ చరిత్రలో స్థిరమైన పునాది వేశాయి. ఆయన ప్రజలలో చైతన్యాన్ని రగిలించి, సామాజిక సమానత్వం వైపు దారి చూపిన గొప్ప మార్గదర్శకుడు. 1967 అక్టోబర్ 12న 57 ఏళ్ల వయసులో లోహియా గారు పరమపదించారు. ఆయన మరణం భారత రాజకీయ రంగానికి అపూర్వ నష్టం. అయినా ఆయన ఆలోచనలు, సిద్ధాంతాలు, జీవన విలువలు భారత ప్రజాస్వామ్య చైతన్యంలో నేటికీ సజీవంగా ఉన్నాయి. సామాజిక సమానత్వం, ప్రజాస్వామ్య విలువలు, యువతలో చైతన్యం పెంపొందించడానికి ఆయన చేసిన కృషి భారత చరిత్రలో చిరస్మరణీయంగా నిలిచింది. డాక్టర్ రామ్ మనోహర్ లోహియా జీవితం మనకు ఒక గొప్ప పాఠం. సమాజంలో అసమానతలను తొలగించి, ప్రజాస్వామ్యాన్ని ప్రజల జీవితాల్లోకి తీసుకురావాలన్న ఆకాంక్ష ఆయన సూత్రాల సారం. ఆర్థిక, సామాజిక న్యాయం కోసం ఆయన చేసిన త్యాగం, పోరాటం భవిష్యత్ తరాలకు ప్రేరణగా నిలుస్తాయి. ఆయన ఆలోచనలు నేటి భారత రాజకీయాలకు మార్గదర్శకంగా ఉండి, సమాజాన్ని సమానత్వం, న్యాయం, చైతన్య దిశలో నడిపిస్తాయి. లోహియా గారి జీవితం ఒక ఆదర్శం ‚ సామాజిక న్యాయానికి ప్రతీక, ప్రజాస్వామ్య చైతన్యానికి శాశ్వత దీప్తి.

# కదలికకు కీళ్లే కీలకం

మన ప్రతి కదలికకూ కీలే.. కీలకం! జాయింట్లు మృదువుగా, సజావుగా, సున్నితంగా కదులు తుంటేనే... మన జీవితం హాయిగా, సుఖంగా సాగుతుంటుంది. అది వేళ్ల, మణికట్టు, భుజం, చివరికి పాదాల, వేళ్ల ఏ జాయింట్లు అయినా కావచ్చు.. మోకాలి కీళ్లు కావచ్చు. ఏ కదలికకైనా ఈ కీళ్లే కీలకం. మరి మన శరీరంలో ఈ కీళ్లు ఉగ్రరూపం దాలిస్తే కాలు, చేయి మెదపాలంటే కష్టం. మారు తున్న జీవనశైలి, ఆహారపు అలవాట్లు అనేక రకాల అనారోగ్య సమస్యలకు దారి తీస్తుంటాయి. అందులో ఆర్థరైటిస్ కూడా ఒకటి. ఇది గ్రీకు పదాలైన "ఆర్ట్రో" నుండి ఉద్భవించింది, అంటే "ఉమ్మడి", మరియు "ఐటిస్", అంటే "మంట". మానవ ఆర్థరైటిస్ యొక్క మొట్ట మొదటి జాడలు క్రీ.పూ 4500 నాటివి. ప్రారంభ నివేది కలలో, ఆర్థరైటిస్‌ను చరిత్రపూర్వ ప్రజల అత్యంత సాధారణ వ్యాధిగా సూచిస్తారు. కీళ్ల అరుగుదలనే ఆర్థరైటిస్ అంటాం. కీళ్ల నొప్పులు అధికంగా తుంటి, మోకాలులో వస్తుంటాయి. చేతి, మోచేతిలోనూ కీళ్ల నొప్పులు రావచ్చు. శరీరంలో మోకాలే పెద్ద కీలు. శరీర బరువును సగానికిపైగా మోకాలే మోస్తుంటుంది. వయసు పెరుగుతున్న కొద్దీ కీళ్లలో ఉండే కీలకమైన మృదులాస్థి అనే పదార్థం కరిగిపోతుంది. అది నిరంతరం కరుగుతూ మళ్లీ ఏర్పడు తుండటం దాని ప్రత్యేకత. అయితే 40–45 ఏళ్ల మధ్య మృదులాస్థి పున రుత్పత్తి తగ్గడం మొదలవుతుంది. దీంతో కీళ్లవాపు, నొప్పి, నడవలేక పోవడం వంటివి వస్తాయి. ఈ విధంగా జరగడాన్నే కీళ్ల నొప్పి లేదా ఆర్థరైటిస్ అంటారు. కీళ్లనొప్పికి జన్యు పరమైన కారణాలూ ఉంటాయి. ప్రధానంగా వయసు, జన్యు పరమైన కారణాలతోనే ఆర్థరైటిస్ వస్తుంది. రుమటాయిడ్ ఆర్థరైటిస్, ఎంకైలోడింగ్ ఆర్థరైటిస్ అనే 2 రకాలున్నాయి. సాధారణ ఆర్థరైటిస్‌కు ఈ రెండూ భిన్నం. ఈ రెండింటిలో ఉపశాఖలుగా మరో 15 ఆర్థరైటిస్‌లు ఉన్నాయి. ఒకసారి తగులుకుంటే వదిలి పెట్టవు. పూర్తిగా నిర్మూలించలేం. స్టెరాయిడ్స్ తదితర మందులు వాడటం వల్ల వీటిని నియంత్రించ వచ్చు. ఇక సోరియాసిస్ కూడా ఆర్థరైటిస్‌కు దారితీస్తుంది. రీటస్ డిసీజ్ అంటే కంటి చూపు మంద గించడం ద్వారా కీళ్ల నొప్పులు వచ్చే అవకాశ ముంది. ఇలాంటి జబ్బులు వస్తే 20–30 ఏళ్లకే ఆపరేషన్లు చేయాల్సి ఉంటుంది. గతంలో 50–60 ఏళ్లలో కనిపించే ఆర్థరైటిస్‌ను ఇప్పుడు 35–40 ఏళ్లలోనే చూస్తున్నాం. దీన్ని ముందుగా గుర్తించి నియంత్రణ చర్యలు తీసుకోక పోతే ముమ్ముందు నడవలేని, కదల్లేని పరిస్థితులు రావొచ్చని వైద్యులు హెచ్చరి స్తున్నారు. కింద కూర్చోవడం వల్ల, సాధారణ మరుగుదొడ్లు వాడినా మోకాలి నొప్పులు వస్తాయి. ఈ కీళ్లకు వచ్చే అతి పెద్ద సమస్య ఆర్థ్రైటిస్! అంటే కీలు లోపలంతా వాచి పోయి కదపా లంటేనే తీవ్రమైన నొప్పి, బాధతో జాయింటులో అరిగి పోవడం వల్ల రావచ్చు. దాన్ని "ఆస్టియో ఆర్థ్రైటిస్" అంటారు. ఇప్పుడు ఎక్కువ మంది అనుభవిస్తున్న మోకాళ్ల నొప్పుల బాధ ఇదే. ఇక ఒంట్లో ఏద్కెనా ఇన్ఫెక్షన్ తలెత్తి అది కీలుకు చేరటం వల్ల కీళ్లనొప్పి రావచ్చు. దీన్ని "ఇన్ఫెక్టివ్ ఆర్థ్రైటిస్' అంటారు. సోరియాసిస్ వంటి చర్మ వ్యాధుల్లో కూడా కీళ్ల వాపు, నొప్పి పలకరించవచ్చు. దాన్ని "సోరియాటిక్ ఆర్థ్రైటిస్" అంటారు. అలాగే మూత్రనాళ ఇన్ఫెక్షన్లు, నీళ్ల విరేచనాల వంటి ఇన్ఫెక్షన్ల తర్వాత కూడా కీళ్ల వాపు రావచ్చు. దాన్ని "రియాక్టివ్ ఆర్థ్రైటిస్" అంటారు. చికున్‌గన్యా వంటి వ్కెరల్ వ్యాధుల్లో కూడా కీళ్ల వాపులు రావచ్చు, వీటిని "వ్కెరల్ రియాక్టివ్ ఆర్థ్రైటిస్" అంటారు. ఇలా కీళ్ల వాపుల్లో ఎన్నో రకాలు న్నాయి. అయితే ఇవన్నీ కూడా ఏదో ఒక ప్రత్యేకమైన, స్పష్టమైన కారణంతో వచ్చే కీళ్ల నొప్పులు! వీటికి భిన్నంగా... స్పష్టమైన కారణమేదీ తెలియ కుండానే ఆరంభమయ్యే అతి పెద్ద సమస్య... రుమటాయిడ్ ఆర్థ్రైటిస్! కీళ్లవాతం!! వేళ్లు, మణికట్టు వంటి చిన్న జాయింట్లను ఎక్కువగా పట్టి పీడించే ఈ కీళ్లవాతం.. దీర్ఘకాలం ఉండిపోయే సమస్య! దీన్ని నిర్లక్ష్యం చేస్తే శరీరంలో గుండె, ఊపిరితిత్తులు, కళ్ల వంటి ఇతరత్రా అవయవాలూ ప్రభావితమై పరిస్థితి మరింత విషమిస్తుంది. అదృష్టవశాత్తూ– దీన్ని పూర్తి నియంత్రణలోకి తీసుకు వచ్చే విధానాలు అందుబాటులో ఉన్నాయి. అందుకే 'ప్రపంచ ఆర్థ్రైటిస్ దినం' సందర్భంగా ఈ కీళ్లవాతం గురించి అవగాహన కలిగి వుండాలి. మన శరీరంలో ఒక అద్భుతమైన రక్షణ వ్యవస్థ ఉంది. అదే 'రోగ నిరోధక వ్యవస్థ'. మనం వ్యాధుల బారినపడకుండా.. ఎటువంటి సూక్ష్మక్రిములూ మనపై దాడి చెయ్యకుండా నిరంతరం పహారా కాస్తుందీ వ్యవస్థ. రేయిం బవళ్లు ఈ బాధ్యతలను ఇది అద్భుతంగా నిర్వర్తిస్తుంటుంది. కానీ.. ఒక్కోసారి ఇది ఏకంగా మన శరీర భాగాల మీదే దాడి చేసేస్తుంది. ఫలితమే రకరకాల 'ఆటో ఇమ్యూన్' సమస్యలు. కీళ్లవాతం.. రుమటాయిడ్ ఆర్థ్రైటిస్ కూడా ఇలా తలెత్తే సమస్యే! ఇది మన కీళ్లలో ఎముకల మధ్య ఉండే మృదువ్కెన 'సైనోవియం' పొరను చూసి, దానిపై దాడి చేసి దెబ్బతీయటం ఆరంభిస్తుంది. దీంతో కీళ్లు ఎర్రగా వాచిపోవటం, నొప్పుల వంటి బాధలన్నీ ఆరంభ మవుతాయి. సాధారణంగా ఇతరత్రా కీళ్ల నొప్పుల్కెతే శరీరంలోని ఏదో ఒకవ్కెపు కీలుకు మాత్రమే వస్తాయి. కానీ రుమటాయిడ్ ఆర్థ్రైటిస్‌లో– ఒకేసారి రెండు వ్కెపులా వాపు కనిపిస్తుంది. అంటే ఉదాహరణకు కుడి చేతి వేలి కీళ్లు వాస్తే, ఎడమ చేతి వేలి కీళ్లు కూడా వాస్తుంటాయి. కుడి మణికట్టు కీలు వాస్తే, ఎడమ మణికట్టు కీలూ వాస్తుంది. అలాగే ఈ వాపు ఏకకాలంలో శరీరంలోని చాలా కీళ్లకూ రావచ్చు. కీళ్లవాతం ఏ వయసు వారికైనా రావచ్చుగానీ సాధారణంగా పెద్దవారి లోనే.. అదీ 30–60 ఏళ్ల మధ్య వయసు వారిలో ఎక్కువగా కనిపిస్తుంటుంది. ముఖ్యంగా– ఇది మహిళల్లో ఎక్కువ. కీళ్లవాతం సాధారణంగా శరీరంలోని చిన్న కీళ్లతో మొదలవు తుంది. అంటే చేతివేళ్లు, మణికట్టు, కాలివేళ్ల వంటి వాటితో ఆరంభమై క్రమేపీ మోకాలు, తుంటి వంటి పెద్ద జాయింట్లకూ రావచ్చు. వాపు, నొప్పి వంటివన్నీ చిన్న జాయింట్లతో ఆరంభం కావటం దీని ప్రత్యేక లక్షణం. రుమటాయిడ్ ఆర్థ్రైటిస్ బాధితుల్లో చాలా కొద్దిమందికి మాత్రమే కీళ్ల మార్పిడి అవసరం అవుతుంది. కీళ్లవాతం కొంతకాలం పెరుగుతూ తగ్గుతూ ఉండటం దీని మరో ప్రత్యేకత. కీళ్లవాతం వచ్చిన తొలిదశలో కీళ్ల మీది పైపొర మాత్రమే దెబ్బతింటుంది. వ్యాధి ముదురుతున్న కొద్దీ క్రమేపీ అది కీళ్లను, లోపలి ఎముకలను కొరికేస్తుంది. ఇంకా తీవ్రమైతే కీళ్ల మధ్య ఖాళీ తగ్గిపోతుంది. దీంతో ఎముకల రాపిడి కారణంగా నొప్పి వస్తుంది. కొన్నాళ్లకు కీళ్లు మొత్తం దెబ్బతింటాయి. రుమటాయిడ్ ఆర్థ్రైటిస్‌ను నియంత్రించు కోకపోతే – గుండె జబ్బులు, పక్షవాతం వంటివి పదేళ్ల ముందుగానే వచ్చే ప్రమాదం ఉంది. కళ్లు పొడిబారటం, లాలాజలం తగ్గిపోవటంతో పాటు గుండె చుట్టూ, వూపిరితిత్తుల చుట్టూ నీరు చేరటం వంటి ఇబ్బందులూ ఎదురవ్వచ్చు. వ్యాధిని సత్వరమే గుర్తించి చికిత్స ఆరంభిస్తే ఈ కీళ్ల మార్పిడి అవసరం అంతగా రాదు. చిన్న కీళ్లకు ఈ మార్పిడి అవకాశమూ ఉండదు. అందుకే మందులతో చికిత్సకే ప్రాధాన్యం ఇస్తారు. కీళ్లవాతం బాధితుల్లో చాలామంది పూర్తి విశ్రాంతిగా పడుకుంటూ వ్యాయామం మానేస్తుంటారు. ఇది సరికాదు. వ్యాయామం చేయకపోతే కీళ్లు గట్టిగా బిగుసుకు పోతాయి. కొన్నిసార్లు ఆపరేషన్ చేసినా ఫలితం ఉండక పోవచ్చు. మందులతో నొప్పి తగ్గాక వ్యాయామం మొదలెట్టాలి. నొప్పి తగ్గుతున్న కొద్దీ వ్యాయామం చేసే సమయాన్ని కూడా పెంచుకోవాలి. ఏరోబిక్, యోగా, నడక వంటి వ్యాయామాలు ఏవ్కెనా చేయొచ్చు. పొగ తాగకూడదు. బరువు పెరగ కుండా, శరీరానికి తగ్గట్లుగా ఉండాలి. ఆర్థరైటిస్‌ను ముందుగా గుర్తించకపోతే పనిచేసే సామర్థ్యం తగ్గిపోతుంది. దీనివల్ల శరీరంలో కొవ్వు పెరిగిపోతుంది. ఫలితంగా గుండెకు చేటు తెస్తుంది. అలాగే మెటబాలిజం తగ్గుతుంది. దీంతో ఒత్తిడి పెరుగుతుంది. మన జనాభాలో సుమారు ఒక శాతం మంది దీంతో బాధపడు తున్నారు. కీళ్ల 20 శాతం అరుగుదల ఉంటే, దాన్ని పెరగకుండా చూసుకోవాలి. మృదులాస్థి పెరగడానికి మందులు ఇస్తారు. అవి వాడాలి. సైక్లింగ్, ఈత వంటివి చేయాలి. దీని వల్ల కీళ్లపై ప్రభావం చూపదు. నిర్ణీత మోతాదులో డాక్టర్ల సూచన మేరకు నడవవచ్చు. ఏదైనా సమతుల్య మైన శారీరక శ్రమ, వ్యాయామం అవసరం. రుమటాయిడ్ ఆర్థ్రైటిస్ దీర్ఘకాలిక సమస్య. కాబట్టి చికిత్స కూడా దీర్ఘకాలం, జీవితాంతం తీసుకోవాల్సి ఉంటుంది.





# చేనేత కార్మికులతో మంత్రి సుభాష్ చర్చలు సఫలం

**మంత్రి హామీతో దీక్ష విరమించిన అంగర చేనేత కార్మికులు - సమస్యలు సీఎం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తా..**
**చేనేత రంగానికి పూర్వవైభవం తెస్తాం.. : రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్**



**రామచంద్రపురం, విశ్వం వాయిస్ న్యూస్ :** కపిలేశ్వరపురం అక్టోబర్ 11:-కపిలేశ్వరపురం మండలం,అంగర గ్రామంలో గల శ్రీ గణపతి చేనేత సహకార సంఘం ఆధ్వర్యంలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ హామీతో దీక్ష విరమించారు.మంత్రి సుభాష్,మండపేట ఎమ్మెల్యే వేగుళ్ళ జోగేశ్వరరావుతో కలిసి శనివారం దీక్షా శిబిరం వద్దకు వెళ్లి చేనేత సంఘాల నాయకులు, సభ్యులతో చేపట్టిన చర్చలు సఫలమయ్యాయి.దీంతో గత 13 రోజులుగా దీక్ష చేస్తున్నవారికి మంత్రి సుభాష్ నిమ్మరసం ఇచ్చి దీక్ష ముగింపు చేశారు. చేనేత కార్మికులకు ప్రభుత్వం నుంచి తమకు రావలసిన 3 కోట్ల 85 లక్షలు రూపాయలు బకాయిలు కోసం 13 రోజులుగా రిలే నిరసన దీక్షలు చేపట్టిన నేపథ్యంలో మంత్రి సుభాష్ వారితో చర్చలు జరిపారు.ఈ సందర్భంగా మంత్రి సుభాష్ చేనేత కార్మికుల సమస్యలు సావధానంగా విని, అనంతరం మాట్లాడుతూ నెల రోజుల్లో చేనేత సహకార సంఘంకు ఇవ్వాల్సిన బకాయిలు విడుదలకు కృషి చేస్తానని మంత్రి హామీ ఇచ్చారు. గత వై ఎస్ ఆర్ సీపీ ప్రభుత్వం హయంలో రాష్ట్ర వ్యాప్తంగా చేనేత సహకార సంఘాలకు ఇవ్వాల్సిన బకాయిలు నేడు ఎన్డిఏ కూటమి ప్రభుత్వానికి గుదిబండగా మారాయని మంత్రి సుభాష్ కార్మికులకు వివరించారు.గత ప్రభుత్వం చేనేత కార్మికుల సమస్యలను గాలికి వదిలేసింది అన్నారు. అయినప్పటికీ కూటమి ప్రభుత్వం కార్మికులకు ఇవ్వాల్సిన నిధులు, బకాయిలు విషయమై సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకెళ్ళి విడుదల చేసేలా కృషి చేస్తానని హామీ ఇచ్చారు.చేనేత కార్మికుల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు.అలాగే 2024 సార్వత్రిక ఎన్నికలలో మగ్గం నేత కార్మికులుకు ఏడాదికి రూ. 25 వేలు రూపాయలు చొప్పున చెల్లించేందుకు ఇచ్చిన హామీ డిసెంబర్ నెల ఆఖరుకు లోగా అమలు చేస్తామని భరోసా ఇచ్చారు.ఈ కార్యక్రమంలో విజయనగరం ఆర్టిసి జోన్ మాజీ చైర్మన్ నెక్కంటి బాలకృష్ణ,బీజేపీ నాయకులు కోన సత్యనారాయణ, అడబాల సత్య నారాయణ,నామాల శ్రీనువాస్ రావు,ఛాట్రాతి జానకి రామయ్య, తదితరులు నేతన్నలకు సంఘభావం తెలుపగా,ఈ చర్చల్లో బండారు కొండయ్య,బాలా వీరభద్రు, ఉండారు సత్యనారాయణ, శివకుమార్,పోతబత్తుల విజయ్ కుమార్, దొంతంశెట్టి సత్య ప్రకాష్, ఆదివారం పేట సర్పంచ్ నక్కిన దొరబాబు, కూటమి పార్టీ నాయకులు అల్లక రాజు,కొండా పూర్ణచంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

**విద్యార్థుల్లో నైపుణ్యాల మెరుగుదలకు**

# విజ్ఞాన ప్రదర్శనలు దోహదం : కొత్తపేట ఎమ్మెల్యే బండారు

**రావులపాలెం, విశ్వం వాయిస్ న్యూస్ :** విద్యార్థుల్లో నైపుణ్యాలు పెరగడానికి విజ్ఞాన ప్రదర్శనలు దోహదం చేస్తాయని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు అన్నారు. శనివారం రావులపాలెం సెయింట్ ప్యాట్రిక్ పాఠశాలలో విద్యార్థులచే ఏర్పాటు చేయ బడిన ఆర్ట్స్, సైన్స్,సోషల్, క్రాఫ్ట్ ఎగ్జిబిషన్ ను ఆయన ప్రారంభించారు. విద్యార్థులు తమ సృజనాత్మకత, విభిన్న అంశాలపై తమకున్న విజ్ఞానం ప్రదర్శించడానికి ఇటువంటి ఎగ్జిబిషన్లు ఏర్పాటు ఎంతైనా



అవసరమన్నారు. ఇన్ని విభిన్నమైన అంశాలను ఒకే చోట ప్రదర్శించడం వల్ల విద్యార్థులకు అన్ని అంశాల పట్ల సమగ్రమైన అవగాహన కలుగు తుందన్నారు. ఇటువంటి ప్రదర్శనలు విద్యార్థుల్లో కమ్యూనికేషన్ నైపుణ్యాలను పెంచడంలో సహాయపడతాయని, విద్యార్థులు విజ్ఞాన శాస్త్రం, సామాజిక అంశాలపై తాము నేర్చుకున్న విషయాలను ప్రదర్శించడానికి దోహదపడ తాయని వ్యాఖ్యానించారు. విద్యార్థులను, నిర్వాహకులను అభినందించారు.

# కొరిపెళ్ల సుబ్బారావుకు జెడ్పీటీసీ అబ్బు పరామర్శ



**కపిలేశ్వరపురం, విశ్వం వాయిస్ న్యూస్ :** మాతృవియోగం తో బాధపడుతున్న కపిలేశ్వరపురం వైస్సార్సీపీ నాయకులు కొరిపెళ్ల సుబ్బారావు ను మండల జడ్పీటీసీ పుట్టపూడి అబ్బు పరామర్శించారు. శనివారం కపిలేశ్వరపురంలో వారి స్వగృహంలో కలిసి పరామర్శించారు. సుబ్బారావు కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలిపారు. అనంతరం నిడసనమెట్ట గ్రామంలో సతీ వియోగంతో బాధపడుతున్న సేనక్కాయల త్రిమూర్తులును పరామర్శించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ పతివాడ నూక దుర్గారాణి, పార్టీ మండల అధ్యక్షుడు గూటం సత్యనారాయణ, జిల్లా కార్యదర్శి మరివాడ సూరిబాబు, మున్సిపల్ కౌన్సిలర్ మండపల్లి రవి కుమార్, నియోజకవర్గం ఐ టి వింగ్ అధ్యక్షులు యరమాటి వెంకన్నబాబు, గ్రామ ఉప సర్పంచ్ బొక్కా రాంబాబు, కట్టా మురళి కృష్ణ, పిప్పర సంపత్ రావు, సొసైటీ మాజీ చైర్మన్ పెంటపాటి వెంకన్నబాబు, వంగా శ్రీనివాస్, పితాని సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

**అనుమతి లేని మందుగుండు సామాన్లు**

# నిల్వలపై దాడులు : ఎస్సై రాము

**మండపేట, విశ్వం వాయిస్ న్యూస్ :** మండపేట పట్టణంలో అనుమతులు లేకుండా అక్రమంగా గృహాలు, షాపులలో మరియు ఇతర ప్రదేశ ములలో దీపావాలి మందుగుండు సామగ్రిని నిల్వలు ఉంచితే అట్టి వారిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని మండపేట పట్టణ పోలీస్ సబ్ ఇన్స్పెక్టర్ ఎన్.రాము హెచ్చ రించారు. పట్టణంలో ప్రజల పలు నివాస గృహాల వద్ద, వ్యాపార సంస్థల లోను ఆయన పర్యటించి తనిఖీలు నిర్వహించారు, రాము మాట్లాడుతూ తాత్కాలిక లైసెన్సు పొందినవారు తమ వద్ద అక్రమంగా దీపావళి మందు గుండు సామగ్రి ఉంచకూడదన్నారు. ఇప్పటికే పలు ప్రాంతములలో మందు గుండు సామగ్రి వల్ల ప్రమాదాలు జరి గాయని గుర్తుచేస్తూ జాగ్రత్త వాహించాలని సూచించారు. దీనిపై నిఘా టీమ్ ను కూడా ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. మందు గుండు సామాగ్రి నిర్వహణ అనుమతులు లేకుండా నిల్వలు ఉంచి అతిక్రమించిన వారిపై చట్టపరమైన కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని ఎన్. రాము తెలిపారు.



# మూడు రోజులు గడిచినా, మౌనం వీడని ప్రభుత్వ వైఖరి

**హోంమంత్రి సందర్శించినా నష్ట పరిహారంపై ప్రకటన లేదు - ఆవేదన వ్యక్తం చేసిన పీ.డీ.ఎస్.యూ, ఏ.ఐ.కె.ఎం.ఎస్, ఐ.ఎఫ్.టీ.యూ సంఘాల నాయకులు**

**రామచంద్రపురం, విశ్వం వాయిస్ న్యూస్ :** డా. బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా, రాయవరం మండలంలో ఇటీవల జరిగిన అగ్నిప్రమాదం అత్యంత విషాద కరమని పలు ప్రజా సంఘాల నాయకులు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. రాయవరం మండలం సోమేశ్వరం గ్రామానికి చెందిన పాకా అరుణ, వాసంశెట్టి విజయలక్ష్మి, అనపర్తి సావరం చెందిన కుడిపూడి జ్యోతి, పెంకే శేషారత్నం, చిట్టూరి శ్యామల, పొట్నూరి వెంకట రమణ బాధిత కుటుంబాలను శనివారం వారు పరామర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాయవరం శ్రీ గణపతి ఫైర్ వర్క్స్లో సుమారు 30 మంది కార్మికులు పనిచేస్తుండగా, ప్రమాదం జరిగిన కేవలం రోజు 12 మంది మాత్రమే డ్యూటీకి వచ్చినట్టు సమాచామని, భోజన విరామ సమయం కావడంతో ప్రమాదంలో



మరణాల సంఖ్య కొంతమేర తగ్గిందని, అయినప్పటికీ, నీటి వనరులు సకాలంలో అందుబాటులో లేకపోవడం, అగ్నిమాపక చర్యల్లో నిర్లక్ష్యం కారణంగా ప్రమాదం తీవ్రరూపం దాల్చింది అని పేర్కొన్నారు. ఇప్పటి వరకు 8 మంది కార్మికులు ఈ ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయారని, మిలిగిన వారు క్షతగాత్రులు అయ్యారని విచారం వ్యక్తం చేస్తూ, భవిష్యత్తులో ఇలాంటి ప్రమాదాలు పునరావృతం కాకుండా ఉండాలంటే రెవెన్యూ, అగ్నిమాపక, పరిశ్రమల, కార్మిక శాఖలు నిరంతర పర్యవేక్షణ చేయాలని సూచించారు, భద్రతా ప్రమాణాలు పాటించని యజమానులు, తనిఖీల్లో నిర్లక్ష్యం చేసిన అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర హోంశాఖ మంత్రి అనిత సంఘటన స్థలాన్ని సందర్శించి, ప్రమాదం జరిగి మూడు రోజులు గడిచినా, ఇప్పటివరకు ఎటువంటి నష్టపరిహారం ప్రకటించక పోవడం మరింత ఆవేదన కలిగిస్తుందని తెలిపారు. ప్రమాదంలో మరణించిన కార్మికులు ఎస్.సి, బి.సి,ఓ.సి సామాజిక వర్గాలకు చెందిన నిరు పేదలని, వీరి పై ఆధారపడి వారి పిల్లలు, కుటుంబాలు బ్రతుకుతున్నా యని తెలుపుతూ, మృతుల కుటుంబాలకు రూ.50 లక్షల ఎక్స్గ్రేషియా ప్రకటించాలని, క్షతగాత్రుల కుటుంబాలకు రూ.10 లక్షల ఆర్థిక సహాయం అందించి, గాయపడిన వారికి ప్రభుత్వం ద్వారా అత్యుత్తమ వైద్యం అందించాలన్నారు, ప్రభుత్వం బాధిత కుటుంబాలను అన్ని విధాల ఆదుకోవాలని పీ.డీ.ఎస్.యూ రాష్ట్ర సహాయ కార్యదర్శి బి. సిద్ధూ, ఎ.ఐ.కె.ఎం.ఎస్ జిల్లా నాయకుడు వెంటపల్లి భీమ శంకరం, ఐ.ఎఫ్.టీ.యూ నాయకులు కూటమి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

**ఈతకోట శ్రీ కనకదుర్గమ్మ వారి ఆలయం అత్యంత**

# ఘనంగా నిర్వహించిన భారీ అన్న సమారాధన





**రావులపాలెం, విశ్వం వాయిస్ న్యూస్ :** రావులపాలెం మండల పరిధిలోని ఈతకోట గ్రామంలో జాతీయ రహదారి చెంతనే కొత్త సెంటర్లో కొలువై ఉన్న శ్రీ కనకదుర్గమ్మవారి ఆలయం వద్ద భారీ అన్న సమారాధన నిర్వహించారు దసరా మహోత్సవాలు శ్రీదేవి శరన్నవరాత్రులను పురస్కరించుకుని ఆలయ కమిటీ వారి ఆధ్వర్యంలో అమ్మవారి ఆలయంలో నిర్వహించిన నవరాత్రుల పూజల సందర్భంగా భక్తులు దాతలు విరాళాల సహకారంతో శనివారం నాడు దుర్గమ్మవారి ఆలయం వద్ద ఆలయ కమిటీ చైర్మన్ వెలుగట్ల రామకృష్ణ. కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో అన్న సమారాధన నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు మహిళలు ప్రజలు పాల్గొని దుర్గాదేవి. దుర్గామాతను దర్శించుకుని అన్న ప్రసాదాలను స్వీకరించారు. సుమారు 8000 వేలమందిపైగా భక్తులు అన్న సమారాధనలో పాల్గొన్నారు.

# ద్వారపూడిలో అంతర్జాతీయ బాలికల దినోత్సవం



**మండపేట, విశ్వం వాయిస్ న్యూస్ :** అంతర్జాతీయ బాలికల దినోత్సవం సందర్భంగా ద్వారపూడిలో శనివారం నిర్వహించారు. మండపేట ప్రాజెక్ట్ సీడీపీఓ యూ పూర్ణిమ ఆదేశాలు మేరకు సూపర్వైజర్ సునీత ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సూపర్వైజర్ సునీత మాట్లాడుతూ కిషోరి బాలికలకు పోషణ, చట్టపరమైన హక్కులు వివరించారు. వైద్య సంరక్షణ, రక్షణ, హింస, బలవంతపు బాల్య వివాహాలపై, వివక్షత తదితర అంశాలు వివరించారు. విద్య లేకుండా సాధికారత అసాధ్యం అన్నారు. కౌమారదశలో సమర్థవంతంగా మద్దతు ఇస్తే, బాలికలు ప్రపంచాన్ని మార్చగల సామర్థ్యాన్ని కలిగి ఉంటారని పేర్కొన్నారు. నేటి సాధికారత పొందిన బాలికలుగా రేపటి ఉద్యోగులు, కార్మికులుగా, తల్లులుగా, వ్యవస్థాపకులుగా, మార్గదర్శకులుగా, గృహపెద్దలుగా రాజకీయ నాయకులుగా తీర్చిదిద్దగలమని తెలిపారు. బాలికలు ఎదుర్కొంటున్న అసమానతల గురించి ప్రజల్లో అవగాహన కల్పించడం, ఆడపిల్లల హక్కుల గురించి అవగాహన పెంచడం,స్త్రీ విద్య, ఆరోగ్యం పోషకాహారం ప్రాముఖ్యతపై అవగాహన కల్పించాలని తెలియజేసారు. పిల్లలని ఉత్తేజ పరచడం కోసం వివిధ పోటీలు నిర్వహించారు. విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ కార్యకర్తలు, ఆశాలు, కిషోరి బాలికలు పాల్గొన్నారు.

# కేశవరంలో శ్రీ ముత్యాలమ్మ అమ్మవారు ఆలయ నిర్మాణం

**ఎమ్మెల్యే వేగుళ్ళ జోగేశ్వరరావు శంఖుస్థాపన**



**మండపేట, విశ్వం వాయిస్ న్యూస్ :** మండపేట మండలం కేశవరం గ్రామంలో శ్రీ ముత్యాలమ్మ అమ్మవారు నూతన ఆలయ నిర్మాణం కు శనివారం రాష్ట్ర అంచనాల కమిటి చైర్మన్, ఎమ్మెల్యే వేగుళ్ళ జోగేశ్వరరావు శంఖుస్థాపన చేశారు. తొలుత ఎమ్మెల్యే వేగుళ్ళ ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం కొబ్బరికాయ కొట్టి శంఖుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో మండల టిడిపి అధ్యక్షులు కర్రి తాతరావు, కేశవరం సొసైటి ప్రెసిడెంట్ ఉండమట్ల శ్రీనివాస్, ఉండమట్ల సురేష్, ఎంపిపి ఉండమట్ల శ్రీనివాస్, పోతురాజు ఆలయ కమిటీ చైర్మన్ ఆళ్ళ రాజబాబు, ఉండమట్ల తాతాజి, ఉండమట్ల పాపారావు, కంటిపూడి రాంబాబు, తదితరులు పాల్గొన్నారు.

# 17న ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ రాక

**కేశనపల్లిలో హెలిప్యాడ్ నిర్మాణానికి స్థల పరిశీలనలో ఎమ్మెల్యే వరప్రసాద్, అధికారులు**




**మలికిపురం, విశ్వం వాయిస్ న్యూస్ :** ఉప ముఖ్య మంత్రి పవన్‌కల్యాణ్ ఈ నెల 17న రాజోలు నియోజక వర్గంలోని కేశనపల్లి, పొదలాడలో పర్యటిం చనున్నట్లు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ తెలి పారు. హెలిప్యాడ్ నిర్మా ణానికి కేశనపల్లిలో ఓఎన్జీసీ డ్రిల్లింగ్ సైట్, గూడపల్లిలో ఖాళీ స్థలాలను సర్పంచి యెనుముల నాగు, అధికారులతో కలిసి శుక్రవారం ఆయన పరిశీలించారు. శంకరగుప్తం మేజరు డ్రెయిన్, దెబ్బతిన్న కొబ్బరి తోటలను పవన్‌కల్యాణ్ చూడటానికి వీలుగా ప్రధాన రహదారి నుంచి కల్వర్టు వరకు సుమారు 250 మీటర్లమేర రహదారి నిర్మించాలని పంచాయతీరాజ్ డీఈఈ పి.కృష్ణంరాజుకు సూచించారు. ఉన్నత పాఠశాల మైదానంలో రైతులు, నాయకులు, స్థానిక బాధిత ప్రజలతో ఉప ముఖ్యమంత్రి మాట్లాడడానికి ఏర్పాట్లు చేయాలని నిర్ణయించారు. అనంతరం తుపాను ఆశ్రయ భవనంలో అడబాల నాని అధ్యక్షతన జరిగిన సమావేశంలో పవన్‌కల్యాణ్ పర్యటనపై అధికారులతో ఎమ్మెల్యే సమీక్షించారు. రాజోలు సీఐ టి.వి.నరేశ్‌కుమార్, ఎస్సై పి.సురేశ్, డీఈఈలు కృష్ణింరాజు, నాగార్జున, రవి, ఏఈ రవికుమార్, తహసీల్దారు టి.శ్రీనివాసరావు, ఎంపీడీవో సీహెచ్ లక్ష్మీకల్యాణి, ఎంపీపీ మేడిచర్ల వెంకటసత్యవాణి, గోదావరి సెంట్రల్ డెల్టా ప్రాజెక్టు ఛైర్మన్ గుబ్బల శ్రీనివాస్ పాల్గొన్నారు.



## పంతం వారి పెళ్లి సందడికి విచ్చేసిన

# సీఎం, డిప్యూటీ సీఎం

### మంగళగిరి సి.కె.కన్వెన్షన్ హాల్‌కి వేలాదిగా తరలివచ్చిన పంతం సైన్యం





**కాకినాడ రూరల్ , విశ్వం వాయిస్ న్యూస్ :** ఎమ్మెల్యే పంతం నానాజీ తనయుడు కాకినాడ రూరల్ జనసేన యువనేత పంతం సందీప్ శ్రీలేఖ వివాహ వేడుక విజయవాడ మంగళగిరి సీకే కన్వెన్షన్ నందు అంగరంగ వైభవంగా జరిగింది. ఈ వేడుకకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్, డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణం రాజు ముఖ్య అతిధులుగా విచ్చేసి ఎమ్మెల్యే నానాజీ, అరుణలను ఆప్యాయంగా పలకరించి కుమారడు పంతం సందీప్ శ్రీలేఖలకు పుష్పగుచ్ఛంతో శుభాకాంక్షలు తెలియజేశారు. పవన్ కళ్యాణ్ పెళ్లి మండపం పైకి రాగానే ఓజి. ఓజి. పవర్ స్టార్ అంటూ జన సైనికులు కేరింతలు కొట్టారు. జన సైన్యాన్ని కంట్రోల్ చేయడానికి సెక్యూరిటీ కి తలమునకలైయ్యింది. కాకినాడ రూరల్ నుండే కాకుండా రాష్ట్రనలుమూలల నుండి ప్రజా ప్రతినిధులు, జనసైనికులు వేలాదిక తరలివచ్చారు. వచ్చిన వారికి పసందైన వంటకాలతో నోరూరించే రుచులతో వివాహ భోజనంబు వింతైన వంటకంబు అనే విధంగా చక్కటి ఏర్పాట్లను చేసి వచ్చిన ప్రతి ఒక్కరిని ఎమ్మెల్యే నానాజీ వారి కుటుంబ సభ్యులు పేరుపేరునా పలకరిస్తూ ఆప్యాయంగా మర్యాదలు చేశారు. బెజవాడ ఇంద్రకీలాద్రి కనకదుర్గమ్మ కొలువై ఉన్న ఈ నగరంలో ఆమె కరుణాకటాక్షాలతో ఒక్కటైన జంటను వచ్చిన ప్రతి ఒక్కరు నిండైన మనసుతో ఆశీర్వదించారు. మన గోదావరి జిల్లాలో నుండి రాజ్యసభ ఎంపీ సానా సతీష్ బాబు, ఎమ్మెల్సీలు తోట త్రిమూర్తులు, పేరా బత్తుల రాజశేఖర్, కాకినాడ ఎంపీ తంగేళ్ళ ఉదయ శ్రీనివాస్, మంత్రులు నాదెండ్ల మనోహర్, కందుల దుర్గేష్, నారా లోకేష్, ఎమ్మెల్యే బాలకృష్ణ, కాకినాడ సిటీ ఎమ్మెల్యే కొండ బాబు, వరుపుల సత్యప్రభ, సీనియర్ రాజకీయ నాయకులు కెవిపి రామచంద్రరావు, కాకినాడ రూరల్ జనసైనికులు, జర్నలిస్ట్‌లు, పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# అయ్యన్న వారసుడు వైసీపీని డిఫెన్స్‌లోకి నెట్టేశారుగా..!



అనకాపల్లి జిల్లా నర్సీపట్నానికి జగన్ వస్తున్నారు అన్న వార్తలు వచ్చినప్పటి నుంచి రాజకీయం ఒక్కసారిగా వేడెక్కింది. మాజీ సీఎం వైసీపీ అధినేత అయిన జగన్ రోడ్ షోతో వస్తున్నారు అంటే ఇంకా హీటెత్తిపోయింది. ఒక వైపు అయ్యన్న ఇలాకాలో జగన్ అంటూ పొలిటికల్ గా బిగ్ డిబేట్ సాగుతోంది. దాంతో ఏమి జరుగుతుంది అన్న ఆసక్తి కూడా దానితో పాటే మొదలైంది. ఈ నేపథ్యంలో టీడీపీ ఏ విధంగా ఈ విషయంలో కౌంటర్ యాక్షన్ చూపిస్తుంది అన్నది కూడా ఉత్కంఠను కలిగించేదిగా మారింది.

**అయ్యన్న లేని వేళలో :** తమాషా ఏమిటి అంటే జగన్ కి దమ్ముంటే జీవో కాపీ చూపించాలని కొద్ది రోజుల క్రితం సవాల్ చేసిన స్పీకర్ అయ్యన్నపాత్రుడు తీరా జగన్ నర్సీపట్నం వచ్చే సమయానికి ఇదేశాలలో ఉన్నారు ఆయన బార్బడోస్‌లో జరిగిన 68వ కామన్వెల్త్ పార్లమెంటరీ అసోసియేషన్ సమావేశంలో పాల్గొనేందుకు వెళ్ళారు. దాంతో వైసీపీకి ఏకపక్షమైన రాజకీయం అవుతుందా అన్నదే అంతా అనుకున్న నేపథ్యం ఉంది. అయితే అయ్యన్న కుమారుడు ఏపీ టీడీపీ ప్రధాన కార్యదర్శి అయిన విజయ్ మాత్రం జగన్ తమ సొంత ఇలాకాలో అడుగుపెడుతున్న వేళ తనదైన రాజకీయ మంత్రాంగం నడిపి వైసీపీని పూర్తిగా డిఫెన్స్ లో పడేశారు.

**షాకింగ్ ఫ్లెక్సీలతో :** జగన్ నర్సీపట్నం వస్తారు అనగానే ముందు రోజే డాక్టర్ సుధాకర్ ఫ్లెక్సీలతో నర్సీపట్నంలో టీడీపీ హోరెత్తించింది. కరోనా టైం లో మాస్కులు అడిగిన పాపానికి దళిత డాక్టర్ ని నానా ఇబ్బందులు పెట్టి ఆఖరికి ఆయన మరణానికి కారకులు అయ్యారంటూ జగన్ మీద విమర్శలు చేస్తూ వెలసిన ఆ ఫ్లెక్సీలు నర్సీపట్నంతో పాటు ఏపీ వ్యాప్తంగా చర్చనీయాంశం అయ్యాయి. మాస్కులే ఇవ్వలేని వారు మెడికల్ కాలేజీలు కడతారా అంటూ వేసిన సెటైర్లు కూడా సోషల్ మీడియా ద్వారా బిగ్ డిబేట్ కి దారి తీశాయి. ఈ రకమైన ప్లాన్ వెనక విజయ్ ఉన్నారని అంటున్నారు. అంతే కాదు దళితులు అంతా గో బ్యాక్ జగన్ అంటూ నర్సీపట్నం లో ఆందోళనలు చేయడం అలాగే సోషల్ మీడియా ద్వారా వైసీపీ నర్సీపట్నం మెడికల్ కాలేజ్ నిర్మాణానికి ఎంత సొమ్ము వెచ్చింది అసలు ఏమి జరిగింది అన్న వాస్తవాలను కూడా పూర్తి వివరాలతో జనం ముందు పెట్టడంలోనూ విజయ్ సక్సెస్ అయ్యారని అంటున్నారు.

**రుజువు చేసుకున్నారుగా :** అయ్యన్నపాత్రుడు అయితే మీడియా ముందుకు వచ్చి వైసీపీ అధినాయకత్వానికి జవాబు చెప్పేవారు అని విజయ్ మరి కాస్తా ముందుకు అడుగులు వేసి ఏకంగా వైసీపీనే డిఫెన్స్ లో పడేశారు అని టీడీపీ వర్గాల నుంచి వినిపిస్తున్న మాట. జగన్ నర్సీపట్నం టూర్ జనాలతో సక్సెస్ అయింది అని ఆ పార్టీ చెప్పుకుంటున్నా అందులో కంటెంట్ మిస్ అయింది అని టీడీపీ చెబుతోంది ఆ విధంగా చేయడం వెనక విజయ్ వ్యూహాలే గట్టిగా పనిచేసాయని అంటున్నారు. ఏది ఏమైనా విజయ్ తన రాజకీయ పరిణతిని సమయస్ఫూర్తిని చాటుకున్నారని అంటున్నారు. 2024 ఎన్నికల్లో అనకాపల్లి ఎంపీ సీటు ఆశించిన విజయ్ 2029 నాటికి ఏకంగా తండ్రి సీటు నర్సీపట్నం నుంచే పోటీ చేయబోతున్నారు. ఈ నేపథ్యంలో వైసీపీ దూకుడుని ఆయన సింగిల్ హ్యాండ్ తోనే అడ్డుకున్నారని పసుపు పార్టీ తమ్ముళు నిబ్బరంగా అంటున్నారు.

# బాలికా శిశు భ్రూణ హత్యలను నివారించాలి

### కాకినాడ జిల్లా కలెక్టర్ షణ్మోహన్ సగిలి



**కాకినాడ, విశ్వం వాయిస్ న్యూస్ :** ఆడ శిశువులపై వివక్షతతో జరిగే భ్రూణ హత్యలను నివారించడంతో పాటు, డివిజన్ స్థాయిలో బాలికా జనన నిష్పత్తి తక్కువగా ఉన్న ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని, డెకాయ్ ఆపరేషన్ చెయ్యాలని కాకినాడ జిల్లా కలెక్టర్ షణ్మోహన్ సగిలి అధికారులను ఆదేశించారు. కాకినాడ కలెక్టర్ కార్యాలయం స్పందన సమావేశ మందిరంలో వైద్య ఆరోగ్యశాఖ, రెవెన్యూ, లీగల్, స్త్రీ శిశు సంక్షేమం, వివిధ స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులతో కలిసి డిస్టిక్ లెవెల్ మల్టీ మెంబర్ అప్రోప్రియేట్ అథారిటీ, డిస్ట్రిక్ట్ లెవెల్ అడ్వైజరీ కమిటీ, పీసీ, పీఎన్‌డీటీ సమన్వయ కమిటీ సమావేశాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గర్భస్థ పిండ ఆరోగ్య పర్యవేక్షణకు సంబంధించిన పరీక్షలను లింగ నిర్ధారణకు దుర్వినియోగం కాకుండా అల్ట్రాసౌండ్ స్కానింగ్ సెంటర్లపై నిఘా పెట్టామన్నారు. అల్ట్రాసౌండ్ వైద్య పరీక్షలు లింగ నిర్ధారణకు ఉపయోగించుకోవడం చట్ట రీత్యా నేరమని, జిల్లా స్థాయిలో ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా లింగనిర్ధారణ పరీక్షలు నిర్వహించే స్కానింగ్ సెంటర్లపై కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. జిల్లాలో గుర్తింపు పొందిన 159 స్కానింగ్ సెంటర్లపై డెకాయ్ ఆపరేషన్లు, ఆకస్మిక తనిఖీలను నిర్వహిస్తా మన్నారు. ఏప్రిల్-సెప్టెంబర్ నెలల మధ్య 44 డెకాయ్ ఆపరేషన్లు, కొన్ని స్కానింగ్ సెంటర్లపై ఆకస్మిక తనిఖీలు నిర్వహించా మన్నారు. పిండ లింగ నిర్ధారణ చట్టంపై ప్రతి గ్రామ స్థాయిలో వైద్య ఆరోగ్య, స్త్రీ శిశు సంక్షేమ, స్వచ్ఛంద సంస్థలను సమన్వయం చేసుకుంటూ ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. రెండు న్యూ రిజిస్ట్రేషన్లు, రెండు రెన్యువల్, ఒకటి యాడింగ్ అఫ్ మెషిన్, ఒకటి ఎంప్లాయ్ మార్పుకి సంబంధిచి ఈ కమిటి మీటింగ్ లో ఆమోదం తెలిపారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డా. జె.నరసింహ నాయక్ మాట్లాడుతూ జిల్లాలో చట్ట వ్యతిరేకంగా గర్భస్థ శిశు లింగ నిర్ధారణ పరీక్షలు చేసే స్కానింగ్ కేంద్రాల సమాచారము, నమోదు కాని స్కానింగ్ కేంద్రాలు, అర్హత లేని వైద్యుల వివరములు ఈ దిగువ టోల్ ఫ్రీ నెంబర్ (1800 425 3365), వాట్సాప్ నెంబర్ 9494113365 కు తెలపాలని కోరారు. ఈ సమావేశంలో డీఐవో డాక్టర్ కె.వి.సుబ్బరాజు, డి.సి.హెచ్.ఎస్. డాక్టర్ఎస్.స్వప్న, జి.జి.హెచ్. సూపరింటెండెంట్ డాక్టర్కె.లావణ్య కుమారి, 2 టౌన్ సి.ఐ. యం.అప్పలనాయుడు, డి.డి.ఐ. పి.ఆర్, డి.నాగార్జున, జి.జి.హెచ్. హెచ్.ఒ.డి.లు, రేడియాలజీ, పిడియాట్రిక్, గైనిక్, పేథాలజీ డిపార్టుమెంట్ల సిబ్బంది, ఎన్.జి.ఒ లు ఎస్. అప్పల నాయుడు, పి.చక్రవర్తి, ఎం.డి. సఫురా, ఐ.సి.డి.ఎస్. ప్రాజెక్ట్ డైరెక్టర్, డెమో సిబ్బంది పాల్గొన్నారు.

# స్వచ్ఛ గురుజనాపల్లి కార్యక్రమం




**కాకినాడ రూరల్ , విశ్వం వాయిస్ న్యూస్ :** మానవత్వం స్వచ్ఛంద సేవా సంస్థలు స్థాపించి గ్రామ అభివృద్ధితో పాటు ప్లాస్టిక్ రహిత అన్నదానం చేస్తూ విద్య వైద్యం వసతి ఆసరా రక్తదానం మొదలైన అనేక సేవా కార్యక్రమాలు చేస్తున్నందుకు గాను స్వచ్ఛ గురజనాపల్లి మరియు మానవత్వం స్వచ్ఛంద సేవా సంస్థ ఫౌండర్ శ్రీ జోన్నలగడ్డ రాజును ప్రముఖ యూనివర్సిటీ అయినా గ్లోబల్ హ్యూమన్ పీస్ యూనివర్సిటీ వారు పాండిచ్చేరిలో కుంభ కళింగ ఆడిటోరియంలో ప్రముఖులు చేతుల మీదుగా గౌరవ డాక్టరేట్ ను ప్రధానం చేయడం జరిగినది. గౌరవ డాక్టరేట్ వచ్చిన శుభ సందర్భంగా డాక్టర్ జోన్నలగడ్డ రాజు కరప మాజీ సర్పంచ్ తాతీలు గురజనాపల్లి గ్రామ ప్రజలు బంధుమిత్రులు,గురజనాపల్లి హై స్కూల్ పూర్వ విద్యార్థులు, చేయూత అధ్యక్షులు డాక్టర్ ఎమ్.రవి కుమార్, చేయూత కార్యదర్శి ఎమ్.అలీమ్ ,చేయూత కార్యవర్గ సభ్యులు శ్రీ చింతా నారాయణమూర్తి , ఇతర తోటి స్వచ్ఛంద సేవా సంస్థలు హర్షం వ్యక్తం చేస్తూ ప్రత్యేక హృదయపూర్వక ఆనంద అభినందనలు తెలియజేసారు.

# బాలికా విద్య అనేది అత్యంత శక్తివంతమైన సాధనాల్లో ఒకటి : డాక్టర్ అడ్డాల



**కాకినాడ సిటీ, విశ్వం వాయిస్ న్యూస్ :** కాకినాడ ఐడిఎ మరియు అడబాల ట్రస్ట్ ఆధ్వర్యాన అంతర్జాతీయ బాలికల దినోత్సవం సందర్భంగా డాక్టర్ అడ్డాల సత్యనారాయణ జానకిరమ దంపతులచే బాలికలకు పుస్తకాలు అందచేశారు. కాకినాడ ఐడిఎ కార్యదర్శి డాక్టర్ అడ్డాల సత్యనారాయణ మాట్లాడుతూ 'బాలికా విద్య అనేది అత్యంత శక్తివంతమైన సాధనాల్లో ఒకటి' అని, ప్రతి సంవత్సరం అక్టోబర్ 11న ప్రపంచవ్యాప్తంగా అంతర్జాతీయ బాలికల దినోత్సవం జరుపుకుంటారనీ, ఈ దినోత్సవం యొక్క ముఖ్య ఉద్దేశం, ప్రపంచ వ్యాప్తంగా బాలికల హక్కులను గుర్తించడం మరియు ప్రోత్సహించడం అని, ఆడపిల్లలు ఎదుర్కొంటున్న వివక్ష, హింస, బాల్య వివాహాలు, మరియు ఇతర సవాళ్ల గురించి ప్రజలలో అవగాహన కల్పించడం, విద్య, పోషణ, వైద్య సంరక్షణ మరియు చట్టపరమైన హక్కులు వంటి విషయాలలో బాలికలకు సమాన అవకాశాలను కల్పించడం, బాలికలు వారి సామర్థ్యాన్ని పూర్తిగా గ్రహించి, తమ జీవితాలపై మరియు ప్రపంచంపై ప్రభావం చూపడానికి వారికి అధికారం ఇవ్వడం జరిగేలా చూడాలని కోరారు. అడబాల రత్న ప్రసాద్ మాట్లాడుతూ "డిసెంబర్ 19, 2011న ఐక్యరాజ్యసమితి జనరల్ అసెంబ్లీ అక్టోబర్ 11వ తేదీని అంతర్జాతీయ బాలికా దినోత్సవంగా ప్రకటించాలని తీర్మానం చేసిందని అన్నారు. బాలికలు విద్యను పొందినప్పుడు, వారి దేశాలు మరింత బలపడి అభివృద్ధి చెందుతాయని అన్నారు. ఈ రోజు శ్రీమతి అడ్డాల జానకిరమ జన్మదినోత్సవం సందర్భంగా బాలికలందరికీ పుస్తకాలు అందచేయడం అభినందనీయమని అన్నారు. ఈ కార్యక్రమంలో నిమ్మకాయల వెంకటేశ్వర రావు, ప్రసాద్ నాయుడు, కృష్ణమోహన్, మహిళలు, బాలికలు పాల్గొన్నారు.



# దుర్గేష్ చెప్పింది నిజం : పవన్ మాట వింటారా?

జనసేన నాయకుడు, ఏపీ మంత్రి కందుల దుర్గేష్.. తాజాగా చేసిన వ్యాఖ్యలు ప్రభుత్వంలో చర్చకు దారి తీశాయి. ఆయనకు మద్దతుగా పార్టీ అధినేత, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ కూడా వ్యాఖ్యలు చేశారు. అయితే.. ఈ ఇద్దరి వాదన కూడా పెద్దగా పరిగణనలోకి రాలేదనే చెప్పాలి. విషయం ఏంటంటే.. శుక్రవారం జరిగిన కేబినెట్ భేటీలో తాము ఎదుర్కొంటున్న సమస్యను దుర్గేష్ చెప్పుకొచ్చారు. తమ మాటను ఎవరూ వినిపించుకోవడం లేదని.. పర్యాటక శాఖకు చెందిన కార్యదర్శులే అన్నీ చేస్తున్నారని అన్నారు. నిజానికి మంత్రి దుర్గేష్ చేసిన వ్యాఖ్యలు చాలా సీరియస్ అనే చెప్పాలి. ఆయన అక్కడితో కూడా ఆగకుం డా.. తన పర్యాటక శాఖకు సంబంధించి పలు పెట్టుబడులను ఆహ్వానిస్తున్నానని.. అవి వస్తున్నాయని తెలిపారు. కానీ, ఆ తర్వాత జరుగుతున్న కొన్ని వ్యవహారాలను తన వద్దకు రాకుండానే.. కార్యదర్శులు చక్కబెడుతున్నారని, దీంతో కొందరు పెట్టుబడులు పెట్టేందుకు విముఖత వ్యక్తం చేస్తున్నారని అన్నారు. అసలు కార్యదర్శుల మాట మంత్రి వినాలా. మంత్రి చెప్పింది కార్యదర్శి చేయాలా? అని ప్రశ్నించారు. ఈ సమయంలో జోక్యం చేసుకున్న ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్.. ఈ సమస్య తనకు కూడా ఎదురైందన్నారు. సెక్రటరీ స్థాయిలో వర్క్ ఉంటుందని.. కానీ, వారే సర్వం అయిపోతే ఎలా? అని పవన్ ప్రశ్నిం చారు. అంటే.. ఈ విషయాన్ని గమనిస్తే.. మంత్రులకు శాఖలపై పట్టు ఉందా? లేదా? అనేది పక్కన పెడితే.. సెక్రటరీలుగా ఉన్న ఐఏఎస్ లు మంత్రులపై పైచేయి సాధించేందుకు ప్రయత్నిస్తున్నారన్న వాదన బలంగా వినిపించింది. మంత్రి దుర్గేష్ సహా డిప్యూటీ సీఎం కూడా ఇవే వ్యాఖ్యలు చేయడం గమనార్హం. అయితే.. రెమెడీ ఏంటి? అనేది మాత్రం సస్పెన్స్ గానే ఉంది. సీఎం చంద్రబాబు మంత్రులే పైచేయి సాధించాలని చెప్పినా.. వాస్తవానికి అధికారులు ఇంత స్థాయిలో పైచేయి సాధించడానికి గల కారణాలను మాత్రం ఆయన విశ్లేషించలేకపోయారు. అంతేకాదు.. అదేసమావేశంలో ఉన్న ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి తోనూ ఆయన చర్చించలేదు. ఈ పరిణామాలు.. మంత్రి దుర్గేష్‌ను ఇరకాటంలోకి నెట్టాయి. పవన్ చెప్పినా .. ఈ విషయంలో మార్పు వస్తుందో రాదో అనే సందేహం వ్యక్తం చేయడం గమనార్హం.



# రాష్ట్రంలో సంక్షేమం, అభివృద్ధి వేగవంతం...

- ◆ రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టడానికి వస్తున్న పారిశ్రామికవేత్తలు
- ◆ విశాఖలో గూగుల్ తో సహా మూడు డేటా సెంటర్లు ఏర్పాటు చేస్తుంది.
- ◆ మేమే ప్రజాసమస్యలు ప్రస్తావించి ప్రతిపక్ష పాత్ర కూడా పోషిస్తున్నాం...
- ◆ కూటమిలో అందరూ కలిసే ఉంటాం ఎవరూ విడదీయలేరు...
- ◆ పాత్రికేయుల సమావేశంలో రాజమండ్రి రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల




**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** రాష్ట్రంలో కూటమి ప్రభుత్వంలో వేగంగా అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలు కొనసాగుతు న్నాయని పరిశ్రమలు పెట్టడానికి పారిశ్రామిక వేత్తలు వస్తున్నారని టిడిపి సీనియర్ నేత, రాజమహేంద్రవరం రూరల్ శాసనసభ్యులు గోరంట్ల బుచ్చయ్య చౌదరి అన్నారు. ఇచ్చిన హామీలతో పాటు ఇవ్వని హామీలు కూడా నెరవేరుస్తున్నామన్నారు. శనివారం ఉదయం గోరంట్ల తన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశం లో ఆయన మాట్లాడుతూ విశాఖకు గూగూల్ తో సహా మూడు డేటా సెంటర్లు వస్తావున్నాయని, దీని వలన లక్షలాది మందికి ఉపాధి లభిస్తుందని అన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ చేస్తున్న కృషికి ప్రధాని మోడీ కూడా అండగా ఉండడంతో పారిశ్రామిక వేత్తలు రాష్ట్రానికి వస్తున్నారని గోరంట్ల పేర్కొన్నారు. సూపర్ సిక్స్ సూపర్ సక్సెస్ అయిందని, తల్లికి వదనం ఎంతమంది పిల్లలు ఉంటె అంత మందికి వేశామని గోరంట్ల చెప్పారు. స్త్రీ శక్తి పేరుతొ మహిళలకు ఉచిత బస్సు సౌకర్యాన్ని కల్పించామని, మరోపక్క ఆర్టీసీ ఆక్యుపెన్సీ రేటు పెంచడానికి చర్యలు కూడా ప్రభుత్వం తీసుకుంటోందని ఆయన చెప్పారు. ఇందుకోసం ఎలక్ట్రిక్ బస్సులు కొనాలనే యోచన చేస్తున్నట్లు తెలిపారు. ఉచిత బస్సువలన ఆటో డ్రైవర్లకు ఇబ్బంది లేదని, మారుమూల ఇరుకు ప్రాంతాలకు వెళ్లాలంటే ఆటోలు కావాల్సిందేనని ఆయన చెప్పారు. అలాగే ఆటో డ్రైవర్లకు రూ 15వేలు చొప్పున అందజేయడంతో పాటు వారిపై ఎలాంటి కేసులు, పెనాల్టీలు లేకుండా ప్రభుత్వం చర్యలు తీసుకుందని గోరంట్ల చెప్పారు. రాష్ట్రంలో ప్రతిపక్షం లేదని గోరంట్ల అన్నారు. అందుకే ముందుగానే చెప్పినట్లు ప్రజాసమస్యలు అసెంబ్లీ వేదికగా ప్రస్తావించి, తామే ప్రతిపక్ష పాత్ర పోషిస్తున్నామని ఆయన స్పష్టం చేసారు. దీన్ని కూడా కొంతమంది అపోహలు సృష్టించేలా సోషల్ మీడియాలో లేనిపోని ప్రచారాలు చేస్తున్నారని, వైసిపి వాళ్ళు ఇదే అదనుగా భావించి,ఆజ్యం పోస్తున్నారని ఆయన అన్నారు వైసిపి వాళ్ళది విడగొట్టి లబ్ధిపొందాలనే శాడిజమని, ప్రతి విషయానికి బూతులే వాడుతున్నారని, ఇంకా వాళ్ళ తీరు మారలేదని ఆయన మండిపడ్డారు. ఎన్ని దుష్ప్రచారాలు చేసినా కూటమి ఐక్యతకు ఇబ్బంది లేదని ఆయన స్పష్టం చేసారు.



అసెంబ్లీలో లేవనెత్తిన అంశాలను ప్రస్తావిస్తూ, అధికారులు చెప్పిందే కాకుండా వాస్తవాలు తెలుసుకుని మాట్లాడాలని అడిగానని, ఇలా అడగడం తప్పేం కాదే అన్నారు. 1985 నుంచీ తనకు ఇది అలవాటేనని ఆయన గుర్తుచేసారు. అసెంబ్లీలో తన ప్రసంగం, అందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు కూడా తనను అభినందిస్తూ చేసిన ప్రసంగ క్లిప్పింగ్స్ చూపిస్తూ, వాయిస్ వినిపించారు. పిపిపి విధానం తప్పని, తాము అడ్డుకుంటామని జగన్ అనడం తగదని గోరంట్ల విమర్శించారు. మెడికల్ కాలేజీలకు భూములు కేటాయించినా అన్నింటికీ నిధులు ఎందుకు ఇవ్వలేదని ఆయన ప్రశ్నించారు. పిపిపి ద్వారాచేయడం వలన వెయ్యి సీట్లు వస్తాయని ఆయన అన్నారు. పిపిపి విధానం వ్యతిరేకిస్తున్న జగన్ గతంలో కృష్ణపట్నం పోర్టుల వంటివి ప్రయివేటుకు ఎలా ఇచ్చారని ఆయన ప్రశ్నించారు. దళితుడిని మర్డర్ చేసి డోర్ డెలివరీ చేసిన వంటి వాళ్ళను చంకలో పెట్టుకున్న జగన్ హత్యా రాజకీయాలు చేసినవాళ్లను ప్రోత్సహించారని గోరంట్ల ధ్వజమెత్తారు. దోచుకున్న సొమ్మంతా ఖర్చు చేస్తూ 13ఏళ్ళ నుంచి బెయిల్ మీద తిరుగుతున్న తీరుని ప్రజలు గమనిస్తున్నారని ఆయన అన్నారు. రాష్ట్రాన్ని జగన్ దివాళా తీయించి, అభివృద్ధి లేకుండా చేసారని, వైసిపి వాళ్ళు చేసిన తప్పులను సరిదిద్దుతూ ఒక్కొక్క అభివృద్ధి కార్యక్రమాన్ని కూటమి ప్రభుత్వం చేసుకుంటూ వస్తోందని ఆయన అన్నారు. ఆరోగ్యశ్రీకి , సీఎం రిలీఫ్ ఫండ్ కి సంబంధం లేదని గోరంట్ల ఒక ప్రశ్నకు సమాధానంగా స్పష్టం చేసారు. ఆరోగ్యశ్రీకి బడ్జెట్‌లో కేటాయింపులు ఉంటాయని, సీఎం రిలీఫ్ ఫండ్ కి వేరే ద్వారా నిధులు వస్తాయని ఆయన అన్నారు. గత ప్రభుత్వ నిర్వాకం ఆరోగ్యశ్రీ బకాయిలు పేరుకుపోతే కూటమి ప్రభుత్వం వచ్చాక చెల్లిస్తోందన్నారు. అయినా పళ్ళున్న చెట్టుకే రాళ్లదెబ్బలు అన్న చందంగా ఉందని ఆయన వ్యాఖ్యానించారు. రూరల్ నియోజక వర్గంలో 212మందికి 2కోట్ల 40లక్షలకు పైగా సీఎం రిలీఫ్ ఫండ్ కింద సాయం అందించినట్లు ఆయన చెప్పారు. కానిస్టేబులు ఉద్యోగాల భర్తీ , డీఎస్సీ తీయడం , మళ్ళీ డీఎస్సీకి కసరత్తు చేయడం, వంటి చర్యల వలన ఉద్యోగ ఉపాధి అవకాశాలను మెరుగుపడ్డాయని, ప్రభుత్వ, ప్రయివేటు రంగాల్లో ఉద్యోగాల కల్పన జరుగుతోందని గోరంట్ల అన్నారు. రూరల్ నియోజక వర్గంలో మరో 9కోట్ల 20లక్షల రూపాయల పనులకు నిధులు విడుదల అయ్యాయని ఆయన చెప్పారు. అనంతరం సిటీ వార్డులు 16వ వార్డుకు చెందిన రాయుడు పద్మావతికి 35,028/-, కొప్పుల శేషారత్నంకు 47,786/-, షేక్ మున్నీసా 25,655/-, 18వ వార్డుకు చెందిన గుంటి సత్యనారాయణకు 2,25,000/-, దేవరకొండ రమేష్ కు 45,000/-, పితాని సింహాచలం కు 35,000/-, 19 వార్డుకు చెందిన కల్లేపల్లి యమునాకు 51,618/-, 26వ వార్డుకు చెందిన కొణిజేటి మల్యాద్రికి 1,63,499/- , 27 వార్డుకు చెందిన పేట దుర్గా గణేష్ కు 30,573/-, పందిరి వెంకట శ్రీదేవికి 3,25,000/-, 28వ వార్డుకు చెందిన రజియా సుల్తానా కు 25,460/- మొత్తం 11 మంది లబ్ధిదారులకు 10,07,619/- లక్షల రూపాయల సీఎం సహాయనిధి చెక్కులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎం.పీ.పీ వెలుగుబంటి సత్య ప్రసాద్,టూరిజం కార్పొరేషన్ డైరెక్టర్ వాసిరెడ్డి రాంబాబు, మార్కెట్ యార్డ్ చైర్మన్ మార్ని వాసుదేవ్, మండల తెదేపా అధ్యక్షులు మత్సేటి శివ సత్య ప్రసాద్, రాష్ట్ర కుమ్మరి శాలివాహన కార్పొరేషన్ డైరెక్టర్ పందూరి అప్పారావు, నున్న కృష్ణ, తలారి మూర్తి, శీలం గోవింద్, కొప్పిశెట్టి చిన్ని,రొంపిచర్ల ఆంటోనీ, ఏడాకుల వెంకటేశ్వరరావు, కక్కల రమేష్,చిట్టిబోయిన శ్రీనివాస్ తదితరులు సమావేశంలో పాల్గొన్నారు.

ఎన్డీఏ ఆధ్వర్యంలో

## ఘనంగా కార్తీక మాసోత్సవాలు : బత్తుల

**భక్తుల సౌకర్యాలపై దృష్టి సారించండి - 45 రోజుల్లో నరసన్న భూములకు విముక్తి**



**కోరుకొండ, విశ్వం వాయిస్ న్యూస్ :** కోరుకొండ శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి వారి సన్నిధిలో కార్తీక మాసోత్సవాలు ఘనంగా నిర్వహించడానికి ఎన్డీఏ ఆధ్వర్యంలో సేవాకమిటీ ఏర్పాటు చేస్తానని రాజానగరం శాసనసభ్యులు బత్తుల బలరామకృష్ణ అన్నారు. శనివారం నరసన్న ఆలయ వంశపారంపర్య ధర్మకర్త ఎస్పి రంగరాజ బట్టర్ ఆధ్వర్యంలో అన్నవరం దేవస్థానం అధికారులు, ఎన్డీఏ నాయకులు కార్తీకమాస అన్న సమారాధన, నరసన్న తెప్పోత్సవం, భక్తులకు సౌకర్యాలు వంటి అంశాలపై సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన రాజానగరం శాసనసభ్యులు బత్తుల మాట్లాడుతూ ఎన్డీఏ ఆధ్వర్యంలో సుమారు 36కోట్ల రూపాయలతో నరసన్న ఆలయ అభివృద్ధికి అన్ని అనుమతులు వచ్చాయని, త్వరలో పనులు ప్రారంభిస్తామని, ఆలయ అభివృద్ధికి పార్లమెంట్ సభ్యురాలు దగ్గుపాటి పురందేశ్వరి ముఖ్య భూమిక పోషించారన్నారు. కార్తీకమాసాన్ని పురస్కరించుకొని విచ్చేసే భక్తులకు ఎన్డీఏ నాయకులు,భక్తుల సహకారాలతో నరసన్న సేవాకమిటీ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం విజయవంతం చేయాలన్నారు. ప్రతిరోజు సాయంత్రం దీపోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించాలన్నారు. కొండపై విద్యుత్ దీపాల అలంకరణ, కొండపై భక్తులకు త్రాగునీటి సౌకర్యం, మెట్ల రిపేరు, గిరి ప్రదక్షణకు తుప్పల తొలగింపు పారిశుధ్యం, వాష్ రూముల పరిశుభ్రత వంటి విషయాలపై శ్రద్ధ కనపరిచి భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా చూడాలన్నారు. నవంబర్ 2వ తేదీ నరసన్న హంసవాహన పై తెప్పోత్సవానికి అధికారులు ఏర్పాట్లు పూర్తి చేయాలన్నారు.45 రోజుల్లో నరసన్న భూములకు మోక్షం కల్పించి, రిజిస్ట్రేషన్ అయ్యేటట్లు చూస్తానని బత్తుల తెలిపారు. ఈ కార్యక్రమంలో శాసనసభ్యులు బత్తుల బలరామకృష్ణ, అన్నవరం దేవస్థానం అధికారులు, ఆలయ అర్చకులు గిరిధర్, ఎంపీడీవో బత్తిన అశోక్ కుమార్, సర్పంచ్ కర్రి లక్ష్మీసరోజ గణేష్, కటకం చలం, బదిరెడ్డి దొర, జాజుల రాము, రొంగల శ్రీనివాస్, ముక్క రాంబాబు,తన్నీరు తాతాజీ,వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## జాస్తి వారి వివాహ వేడుకలో పాల్గొన్న రుడా చైర్మన్ బొడ్డు




**సీతానగరం, విశ్వం వాయిస్ న్యూస్ :** తొర్రెడు జీఎస్ఎన్ కళ్యాణ మండపంలో జరిగిన సీతానగరం మండలం కాటవరం గ్రామానికి చెందిన జాస్తి వారి వివాహ వేడుకలో రుడా చైర్మన్, తెలుగుదేశం పార్టీ రాజానగరం నియోజక వర్గ ఇన్చార్జ్ మరియు రాష్ట్ర కార్యదర్శి బొడ్డు వెంకటరమణ చౌదరి పాల్గొని నూతన వధూవరులను హృదయపూర్వకంగా ఆశీర్వదించారు.

## ఛలో రంపచోడవరానికి ఆదివాసులందరూ తరలిరండి



**దేవీపట్నం, విశ్వం వాయిస్ న్యూస్ :** ఈనెల 13న రంపచోడవరం ఐటీడీఏ ముందు జరిగే ర్యాలీ, ముట్టడి కార్యక్రమానికి ఆదివాసు లందరూ తరలి రావాలని ఏపీ ఆదివాసీ జేఏసీ రాష్ట్ర వైస్ చైర్మన్,అదివాసీ హక్కులు ఉద్యోగాల సాధన కమిటీ సలహాదారు తెల్లం శేఖర్ పిలుపునిచ్చారు. ఈ దేవీ పట్నం మండలం,ఆర్ అండ్ ఆర్ కాలనీ గొందూరు గ్రామంలో జరిగిన సమావేశానికి ఆదివాసీ హక్కుల ఉద్యోగాల సాధన కమిటీ డివిజన్ ప్రెసిడెంట్ మడి మురళిదొర అధ్యక్షత వహించటం జరిగింది.ఏపీ సిఎం చంద్రబాబు నాయుడు జీవో నెంబర్ మూడు పునరుద్ధరించి మరో కొత్త జీవో ప్రకటించి ఆదివాసీ నిరుద్యోగుల కు100 శాతం ఉద్యోగాలు భర్తీ చేస్తామని ఎన్నికల ముందు ఇచ్చిన హామీని అమలు చేయాలని, తక్షణమే ట్రైబల్ అడ్వైజర్ కౌన్సిల్ ద్వారా తీర్మానం చేసి షెడ్యూల్డ్ ప్రాంత ఉద్యోగ నియామకాలు చట్టం ప్రకటించాలని, ఆదివాసీ నిరుద్యోగులకు 2025 జనరల్ డిఎస్సి లో రూల్ ఆఫ్ రిజర్వేషన్ అమలు చేయడంతో ఆదివాసీ నిరుద్యోగులకు తీవ్ర అన్యాయం జరిగిందన్నారు.కావున ఐటీడీఏ బైలా ప్రకారం తక్షణమే ప్రత్యేక డిఎస్సి ప్రకటించాలని,మరియు షెడ్యూల్డ్ ప్రాంత చట్టాలైన 1/59,1/70 చట్టం, పెసా చట్టం, 2013 పోలవరం భూ సేకరణ చట్టం మొదలైన చట్టాలు పటిష్టంగా అమలు చేయాలని ఈనెల 13వ తేదీన రంపచోడవరం ఐటిడిఏ నందు ధర్నా, ర్యాలీ కార్యక్రమం శాంతియుతంగా జరుగుతుంది. కావున ఆదివాసులందరూ తప్పనిసరిగా వచ్చి ఆదివాసీల హక్కులు చట్టాలు పరిరక్షణ కోసం అందరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఆదివాసీ హక్కులు ఉద్యోగాల సాధన కమిటీ మండల వైస్ చైర్మన్ చవలం విద్యాసాగర్ దొర, మిర్తివాడ సూరారెడ్డి, మిర్తివాడ సాయి కిరణ్ రెడ్డి, మడకం సూర్యకుమారి, శారపు నవీన్ కుమార్ దొర, మేదే శ్రీదేవి మొదలైన వారు పాల్గొన్నారు.

## ప్రభుత్వ మెడికల్ కాలేజీలను ప్రైవేటీకరణ చేయొద్దు..



**రాజమహేంద్రవరం రూరల్, విశ్వం వాయిస్ న్యూస్ :** రాజమండ్రి రూరల్ బొమ్మూరు గ్రామంలో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ తలపెట్టిన కోటి సంతకాల సేకరణ కార్యక్రమం రాజమండ్రి రూరల్ బొమ్మూరు గ్రామంలో రూరల్ పార్టీ కార్యాలయంలో కరపత్రం పంపిణీ ఆవిష్కరణ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ట్రేడ్ యూనియన్ తూర్పుగోదావరి జిల్లా అధ్యక్షులు,కాపు కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ ముద్దాల తిరుపతిరావు (అను)పాల్గొన్నారు. ముద్దాల అను మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం మెడికల్ కాలేజీలను ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా రాష్ట్ర పార్టీ నాయకత్వం ఇచ్చిన పిలుపు మేరకు వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో కోటి సంతకాల సేకరణ చేయాలని వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు మాజీ ముఖ్యమంత్రి వై.యస్ జగన్మోహన్ రెడ్డి కార్యాచరణ రూపొందించారు.వారి ఆదేశాలనుసారం తూర్పుగోదావరి జిల్లా అధ్యక్షులు మాజీ మంత్రి చేల్లుబోయిన వేణుగోపాల కృష్ణ ఆధ్వర్యంలో వివిధ సంఘాల నాయకులతో కార్యకర్తలతో సమావేశంలో రూరల్ నియోజకవర్గంలో ప్రతి గ్రామంలో సంతకాల సేకరణ కార్యక్రమంలో పెద్ద ఎత్తున వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులందరూ పాల్గొనాలని విజయవంతం చేయాలని చేస్తామని ఈ ప్రభుత్వం మెడికల్ కాలేజీ ప్రైవేట్ పరం చేయొద్దనే ప్రజలు కోరుకుంటున్నారని, కూటమి ప్రభుత్వానికి బుద్ధి చెప్పేందుకు ప్రజలు సంతకాల ఉద్యమంలో భాగస్వాములు అవుతారని ప్రజల మద్దతుతో ఈ కోటి సంతకాల సేకరణ కార్యక్రమం నిర్వహిస్తామని చిన్న పెద్ద అందర్నీ కలుపుకుని ఉద్యమంలా సాగుతుందని, జిల్లా అధ్యక్షులు చెల్లుబోయిన ఆదేశాలతో నిర్వహిస్తామని ఒక ప్రకటనలో అన్నారు.

## స్వర్ణాంధ్రకు ఉత్తమ వృద్ధాశ్రమ అవార్డు..




**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** వృద్ధులు ఒంటరి జీవుల సంరక్షణలో స్వర్ణాంధ్ర వృద్ధాశ్రమం నిరుపమాన సేవలు అందిస్తుందని జిల్లా దివ్యాంగుల ట్రాన్స్ జెండర్స్ వయోవృద్ధుల జిల్లా సహాయ సంచాలకులు ఏవై శ్రీనివాస్ ప్రశంసించారు. శనివారం ఉదయం స్థానిక లాలాచెరువు స్వర్ణాంధ్ర వృద్ధాశ్రమ ప్రాంగణంలో జరిగిన ప్రపంచ వయోవృద్ధుల దినోత్సవం ప్రత్యేక కార్యక్రమంలో శ్రీనివాస్ ఈ అవార్డుని స్వర్ణాంధ్ర నిర్వాహకులు గుబ్బల రాంబాబుకి అందించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ జిల్లాలోని వృద్ధాశ్రమాల నిర్వహణలో స్వర్ణాంధ్ర మంచి పనితీరు ప్రదర్శిస్తుందని స్వర్ణాంధ్ర సేవలను పరిశీలించి ఉత్తమ నిర్వహణ సంస్థగా అవార్డునందించామన్నారు. స్వర్ణాంధ్ర వృద్ధాశ్రమం నిర్వాహకులు రాంబాబు మాట్లాడుతూ నగర ప్రజలు దాతల సహకారంతో స్వర్ణాంధ్ర వృద్ధాశ్రమాన్ని నడిపిస్తున్నామని అన్నారు వృద్ధాశ్రమ నిర్వహణకు జిల్లా స్థాయి ఉత్తమ అవార్డు రావడం పట్ల రాంబాబు హర్షం వ్యక్తం చేశారు స్వర్ణాంధ్ర నిర్వహణకు కష్టపడుతున్న సిబ్బందికి రాంబాబు అవార్డుని అంకితం చేస్తున్నానన్నారు.ఈ కార్యక్రమంలో సీనియర్ సిటిజన్స్ రాష్ట్ర ఉపాధ్యక్షులు బుద్ధరాజు, సత్యనారాయణరాజు, స్వర్ణాంధ్ర సిబ్బంది పాల్గొన్నారు.

## అధునాతన శస్త్రచికిత్సలపై అవగాహన

**రోబోటిక్ సర్జన్ డాక్టర్ నితిన్ నిమ్మలపూడి**



**తాడేపల్లిగూడెం, విశ్వం వాయిస్ న్యూస్ :** గ్రామాల్లో ప్రాథమికంగా ప్రథమ చికిత్సలందించే పీఎంపీలు అధునాతన శస్త్రచికిత్సలయిన రోబోటిక్ సర్జరీలపై అవగాహన అవసరమని రాజమండ్రికి చెందిన డెల్టా హాస్పిటల్స్ శస్త్రచికిత్స నిపుణులు డాక్టర్ నితిన్ నిమ్మలపూడి అన్నారు. శనివారం తాడేపల్లిగూడెం డాక్టర్ పీఎస్ మూర్తి మెమోరియల్ సేవా సదన్ నందు కమ్యూనిటీ పారామెడిక్స్ అండ్ ప్రైమరీ హెల్త్ కేర్ ప్రొవైడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ (ది పిఎంపి అసోసియేషన్) తాడేపల్లిగూడెం, పెంటపాడు మండలాల ఆధ్వర్యంలో వైద్య విజ్ఞాన అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో పాల్గొన్న శస్త్రచికిత్స నిపుణులు డాక్టర్ నితిన్ రిమ్మలపూడి మాట్లాడుతూ అడ్వాన్స్ రోబోటిక్ సర్జరీ విధానం ద్వారా హెర్నియా,గర్భాశయ, బేరియాట్రిక్,గాల్ బ్లేడర్లకు అతి తక్కువ నొప్పితో, తక్కువ ఖర్చుతో మేలైన చికిత్స అందించవచ్చని తెలిపారు.క్యాన్సర్ వైద్య నిపుణులు డాక్టర్ సుమంత్ మండవ మాట్లాడుతూ క్యాన్సర్ పై నేడు సమాజంలో ప్రతి ఒక్కరికీ అవగాహన అవసరమని, గత కొంత కాలంగా క్షేత్ర స్థాయిలో ప్రజలకు క్యాన్సర్ పై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్న పీఎంపీ అసోసియేషన్ ను అభినందించారు. పీఎంపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వీబీటి రాజు మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఆర్ఎంపీ,పీఎంపీ జేఏసి ఆధ్వర్యంలో ఈనెల 18వ తేదీన నిర్వహించే రాష్ట్ర మహాసభకు ప్రతీ గ్రామీణ వైద్యుడు తప్పనిసరి గా హాజరుకావాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు ఏఆర్కే పరమేశ్వరులు,జిల్లా కార్యదర్శి ఎస్కే సుభాన్, జిల్లా కోశాధికారి, మండల అధ్యక్షులు ఎమ్ జితేంద్ర, గౌరవ అధ్యక్షులు ఎల్ఎస్వీ నాగేశ్వరరావు, హాస్పిటల్ మేనేజర్ క్రాంతి కుమార్ లతో పాటు సభ్యులు పాల్గొన్నారు.అనంతరం వైద్యులను సభ్యులు ఘనంగా సత్కరించారు.

నేడే వాగ్దేవి కళా పీఠం

## కళా సంగమం



**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** శ్రీవాగ్దేవి కళా పీఠం సంగీత సాహిత్య సాంస్కృత ఉత్సవం కళా సంగమం పేరిట ఈ నెల 12న సంహిత డిగ్రీ కళాశాలలో జరుగుతుంది. మహా మహోపాధ్యాయులు విశ్వనాథ్ గోపాలకృష్ణ, దోర్బల ప్రభాకర్ శర్మలు విశిష్టాథితులుగా పాల్గొంటారు. వేద పఠనం, నాద వాయిద్యంతో పాటు డాక్టర్ కరిమెళ్ళ వరప్రసాద్‌చే అవధాన కార్యక్రమం జరుగుతుంది. ఇందులో భాగంగా తెలుగు రేడియో టోరీ ఛానల్‌లో శిలాక్షరాలు అనే శీర్షిక నిర్వహిస్తున్న కొత్తపల్లి సీతారామారావు దంపతులకు ఆత్మీయ సత్కారం జరుగుతుంది. ఈ మేరకు నిర్వాహకులు, వ్యవస్థాపకులు వెంపరాల వెంకటలక్ష్మి శ్రీనివాసమూర్తి తెలిపారు.

మధురపూడి విమానాశ్రయంలో

## పరిటాలకు బొడ్డు ఘన స్వాగతం



**కోరుకొండ, విశ్వం వాయిస్ న్యూస్ :** రాప్తాడు నియోజకవర్గం శాసనసభ్యురాలు పరిటాల సునీత తనయుడు ధర్మవరం నియోజకవర్గ తెదేపా ఇన్చార్జ్ పరిటాల శ్రీరామ్‌కు రాజమహేంద్రవరం రుడా చైర్మన్ రాజానగరం నియోజకవర్గ తెదేపా ఇంచార్జి బొడ్డు వెంకటరమణ చౌదరి మధురపూడి విమానాశ్రయంలో ఘన స్వాగతం పలికారు. శనివారం రాత్రి పరిటాల శ్రీరామ్ రాజానగరం నియోజకవర్గం సీతానగరం మండలంలోని మునికూడలిలో స్వర్గీయ నందమూరి తారకరామారావు విగ్రహ ఆవిష్కరణ నిమిత్తం ఆయన మధురపూడి విమానాశ్రయానికి విచ్చేశారు. శ్రీరామ్‌ను బొడ్డు వెంకటరమణ చౌదరి తదితరులు మర్యాదపూర్వకంగా కలిసి, పూలమాలలు వేసి సాల్వాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో తెదేపా నాయకులు కంటే నాగ కేశవరావు, మాత ప్రభు తదితరులు పాల్గొన్నారు.

# బాబు బాధ మంత్రులకు అర్థం కావడం లేదా..?



ఏపీలో చంద్రబాబు ఏడున్నర పదుల వయసులో కూడా ఎక్కడా విసుగూ విరామం లేకుండా పనిచేస్తున్నారు. ఒక పద్ధతి ప్రకారం ప్రభుత్వ విజయాలను జనంలోకి తీసుకుని వెళ్తున్నారు. అదే సమయంలో విపక్షాల వైఫల్యాలను ఎండగడుతున్నారు. మరీ ముఖ్యంగా వైసీపీ హయాంలో జరిగిన అరాచకాలను కూడా బాబు జనాల దృష్టికి పదే పదే తెస్తూ ఒక విధంగా వైసీపీ గ్రాఫ్ తగ్గించే పనిలో ఉన్నారు. బాబు ఏ వేదిక మీద నుంచి అయినా కూటమి ప్రభుత్వం క్రెడిట్స్ చెప్పడం, అదే విధంగా వైసీపీ మైనస్ లు చెప్పడం మీదనే ఫుల్ ఫోకస్ పెడుతున్నారు.

**మంత్రులు ఏమి చేస్తున్నారు :** అదే సమయంలో టీడీపీ కూటమి మంత్రులు ఏమి చేస్తున్నారు అన్న ప్రశ్నలు సహజంగానే ఉదయిస్తాయి. తమ శాఖలలో జరుగుతున్న జరగబోతున్న పనుల గురించి జనాలకు ఎప్పటికపుడు తెలియచేయాల్సి ఉందని అంటున్నారు. అదే సమయంలో భవిష్యత్తు ప్రణాళికలు చెబుతూ జనాలలో ఆశావహమైన వాతావరణాన్ని క్రియేట్ చేయాల్సి ఉంది. అంతే కాదు వైసీపీ అయిదేళ్ళ ఏలుబడిలో రాష్ట్రం ఎంతగా నష్టపోయింది అన్నది కూడా గణాంకాలతో సహా తెలియచేయాలని అధినాయకత్వం నుంచి అయితే కోరుకుంటున్నారు. కానీ మంత్రులు మాత్రం ఈ విధంగా దూకుడు చూపించడం లేదనే బాధ అయితే ప్రభుత్వ అధినేత చంద్రబాబులో చాలానే ఉంది.

**మరో సారి క్లాస్ :** తాజాగా శుక్రవారం జరిగిన మంత్రి వర్గ సమావేశంలో చంద్రబాబు మంత్రులకు క్లాస్ తీసుకున్నారు అని అంటున్నారు. మంత్రులు ప్రభుత్వం గురించి చెప్పాల్సినంతగా చెప్పడం లేదని బాబు అన్నట్లుగా తెలిసింది. అంతే కాదు ప్రభుత్వం నుంచి ప్రజలకు పెద్ద ఎత్తున జరుగుతున్న మేళ్ళను గురించి కూడా పెద్దగా ప్రచారం చేయడం లేదని బాబు అసంతృప్తి వ్యక్తం చేసినట్లుగా చెబుతున్నారు. తమ మంత్రిత్వ శాఖల విషయంలో అయినా జరిగిన అభివృద్ధిని వివరించడంలో వెనకబడుతున్నారు అని బాబు అన్నట్లుగా భోగట్ట. విద్యుత్ చార్జీలు తగ్గించామని దీని వల్ల యూనిట్ కి 13 పైసలు వంతున ప్రతీ వినియోగదారుడికి భారం తగ్గుతుందని కానీ దీనికి రావాల్సినంతగా ప్రచారం అయితే రాలేదని బాబు ఆవేదన వ్యక్తం చేశారు అని అంటున్నారు. విద్యుత్ మంత్రిత్వ శాఖ ఈ విషయంలో జోరు చూపించాలని ఆయన కోరినట్లుగా అంటున్నారు.

**మీడియాతోనే అంతా :** మంత్రులు ప్రతీ రోజూ మీడియాకు అందుబాటులో ఉండాలని చంద్రబాబు దిశా నిర్దేశం చేశారని అంటున్నారు. అంతే కాదు ప్రభుత్వం చేసే మంచిని ఒకటికి పది సార్లు చెప్పాల్సిన అవసరం ఉందని కూడా స్పష్టం చేశారు అని అంటున్నారు. రాష్ట్రంలో గత పదహారు నెలలలో పెద్ద ఎత్తున అభివృద్ధి సాగిందని ప్రతీ మంత్రిత్వ శాఖలో కూడా భారీగా ప్రగతి సాగుతోందని దానికి కూడా మంత్రులు చెప్పకపోతే ఎలా అని బాబు అన్నట్లుగా తెలిసింది. ప్రతీ మంత్రివ శాఖలో జరుగుతున్న అభివృద్ధి మీద మంత్రులు పూర్తి అవగాహన కలిగి ఉండాలని ఆ విధంగా వారు మీడియా ముందుకు ప్రజల ముందుకు వచ్చి కూటమి ప్రభుత్వం చేసిందేమిటో సవివరంగా చెప్పాలని చంద్రబాబు సూచించారు అని అంటున్నారు.

**జీఎస్టీ ప్రచారం మీద :** జీఎస్టీ 2.0 మీద దేశంలో ఎక్కడా లేని విధంగా ఏపీలోనే పెద్ద ఎత్తున ప్రచారం చేస్తున్నామని చంద్రబాబు చెప్పారు ఆ విషయంలో ఏపీనే నంబర్ వన్ అని ఆయన అన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టగా తీసుకున్న ఈ కార్యక్రమంలో ఏపీ ముందు ఉందని ఆయన చెప్పారు. అలాగే కేంద్ర ప్రభుత్వం రాష్ట్ర ప్రభుత్వం కో ఆర్డినేషన్ తో పనిచేస్తున్న విషయం కూడా బాబు సమావేశంలో ప్రముఖంగా ప్రస్తావించారు అని అంటున్నారు. అదే విధంగా ఈ నెల 16న ప్రధాని నరేంద్ర మోడీ ఏపీకి వస్తున్న సందర్భంగా ఆ కార్యక్రమం గురించి కూడా కేబినెట్ లో బాబు చర్చించారని భోగట్టా. మొత్తానికి బాబు ఏమి కోరుకుంటున్నారు అన్నది మంత్రులు ఆయన మనసెరిగి వ్యవహరించాల్సి ఉందని అంటున్నారు.

# టీసీఎస్ మెగా డేటా సెంటర్

## విశాఖకు మరో లక్ష కోట్ల పెట్టుబడి!!




తాజాగా దేశీయ దిగ్గజ ఐజీ సంస్థ టీసీఎస్ కూడా విశాఖలో మెగా డేటా సెంటర్ ఏర్పాటుకు నిర్ణయం తీసుకుంది. ఆసియాలోనే అతిపెద్ద డేటా హబ్ గా విశాఖపట్నం నిలవనుంది. ఇప్పటికే గూగుల్ అనుబంధ సంస్థ రైడెన్ ఇన్ఫో రూ.87,520 కోట్లతో ఒక గిగావాట్ డేటా సెంటర్ ఏర్పాటుకు సంసిద్ధత వ్యక్తం చేయగా, తాజాగా దేశీయ దిగ్గజ ఐజీ సంస్థ టీసీఎస్ కూడా విశాఖలో మెగా డేటా సెంటర్ ఏర్పాటుకు నిర్ణయం తీసుకుంది. ముఖ్యమంత్రి చంద్రబాబుతో సంప్రదించిన టీసీఎస్ ప్రతినిధులు త్వరలో ప్రకటన చేయనున్నట్లు వార్తలు వస్తున్నాయి. టీసీఎస్ విశాఖలో నెలకొల్పనున్న డేటా సెంటర్ కోసం సుమారు రూ.లక్ష కోట్ల పెట్టుబడి పెట్టనున్నట్లు అధికార వర్గాల సమాచారం. లక్ష కోట్ల పెట్టుబడితో 1,000 మెగావాట్ల డేటా సెంటర్ ఏర్పాటుకు ముందుకు వచ్చిన టీసీఎస్.. వచ్చేనెలలో విశాఖలోనే ప్రారంభించనున్న డెవలప్మెంట్ సెంటర్ ద్వారా నగరం అభివృద్ధిలో కీలక భూమిక పోషించనున్నట్లు చెబుతున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక విశాఖ నగరం ఏపీ ఐటీ రాజధానిగా ఆవిర్భవించిందని కూడా అంటున్నారు. రాబోయే రెండేళ్లలో విశాఖలో సుమారు రూ.2.60 లక్షల విలువైన డేటా సెంటర్లు ఏర్పాటయ్యే అవకాశం ఉందని ప్రభుత్వ వర్గాలు అంచనా వేస్తున్నాయి. ఇక డేటా సెంటర్ల వల్ల విశాఖ అమెరికాతో అనుసంధానం కాబోతోందని చెబుతున్నారు. అమిత వేగంతో డేటా బదిలీ చేయడానికి అవసరమైన సముద్రగర్భ కేబుల్ పనులు ఇప్పటికే ఊపందుకుంటున్నాయి. ఇక్కడ ఏర్పాటు అవుతున్న డేటా సెంటర్లతో ఆ కేబుళ్లను అనుసంధానించడానికి సిఫీ టెన్నాలజీస్ సిద్ధమైంది. గూగుల్ సంస్థ బ్లూరామన్ పేరుతో సబ్ మెరైన్ కేబుళ్లను విశాఖపట్నం తీసుకువస్తుంది. వీటిని డేటా సెంటరుతో అనుసంధానం చేయడానికి సిఫీ ఒప్పందం కుదుర్చుకుంది. అదేవిధంగా మెటా సంస్థ కూడా అమెరికా నుంచి బ్రెజిల్, భారత్, దక్షిణాఫ్రికా తదితర దేశాలకు 50వేల కి.మీ. పొడవైన సబ్ మెరైన్ కేబుల్ వేయడానికి ఒప్పందాలు చేసుకుంది. భారత్ లో ముంబై, విశాఖ నగరాలను ల్యాండింగ్ సెంటర్లుగా ఎంపిక చేసింది మెటా. ఇక ఈ సంస్థ తీసుకువస్తున్న సబ్ మెరైన్ కేబుల్ ను డేటా సెంటర్లకు అనుసంధానించే బాధ్యతను కూడా సిఫీనే తీసుకుంది. విశాఖలో అతిపెద్ద డేటా సెంటర్లను కేబుల్ తో అనుసంధానం చేసే సిఫీ టెక్నాలజీస్ కు ఏపీ ప్రభుత్వం విశాఖ సమీపంలోని ఓజోన్ వ్యాలీలో 25 ఎకరాలను కేటాయించింది. దీనికి ఆదివారం రాష్ట్ర ఐటీ మంత్రి నారా లోకేశ్ భూమి పూజ చేయనున్నారు.

## 'వర్క్ ఫ్రమ్ హోమ్' పేరుతో

# రూ.120 కోట్లు వసూలు.. భారీ ఆర్థిక మోసం!




దొర్నిపాడు కేంద్రంగా కొందరు స్థానిక నేతలు, వారి బంధువులు కలిసి "వెల్త్ అండ్ హెల్త్ ఫైనాన్షియల్ సొల్యూషన్స్" అనే పేరుతో ఓ నకిలీ సంస్థను స్థాపించారు. ఆకర్షణీయమైన 'వర్క్ ఫ్రమ్ హోమ్' ఉద్యోగాల పేరుతో గ్రామీణ ప్రజలకు వలవేసి, నంద్యాల జిల్లా దొర్నిపాడు కేంద్రాన్ని చేసుకుని సుమారు రూ.120 కోట్లకు పైగా భారీ ఆర్థిక మోసం జరిగిన సంఘటన తాజాగా వెలుగులోకి వచ్చింది. వేలాది మంది నిరుద్యోగ యువత, రైతులు, మహిళలు ఈ మోసానికి బలయ్యారు.

### 'వెల్త్ అండ్ హెల్త్' నకిలీ సంస్థతో వల

దొర్నిపాడు కేంద్రంగా కొందరు స్థానిక నేతలు, వారి బంధువులు కలిసి "వెల్త్ అండ్ హెల్త్ ఫైనాన్షియల్ సొల్యూషన్స్" అనే పేరుతో ఓ నకిలీ సంస్థను స్థాపించారు. వీరు ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లోని నిరుద్యోగ యువతను లక్ష్యంగా చేసుకున్నారు. "రోజుకు కేవలం ఒక గంట పనిచేస్తే చాలు, నెలకు రూ.40 వేల నుంచి రూ.45 వేల వరకు జీతం వస్తుంది" అంటూ నమ్మించారు. కంపెనీలో చేరడానికి, ఉద్యోగం పొందడానికి ఒక్కొక్కరి నుంచి రూ.2.50 లక్షల చొప్పున భారీగా డబ్బులు వసూలు చేశారు. ఏజెంట్లు గ్రామాల వారీగా రూ.3 లక్షల వరకు కూడా వసూలు చేసినట్లు తెలుస్తోంది.

### కుటుంబ గ్యాంగ్ -మొదట నమ్మకం

ఈ మోసం వెనుక దొర్నిపాడుకు చెందిన ఓ పార్టీ నేత , ఆయన అల్లుళ్లు సాఫ్ట్‌వేర్ ఉద్యోగిగా పరిచయం చేసుకున్న వారు, మరో వ్యక్తి ఉన్నారని బాధితులు ఆరోపిస్తున్నారు. మొదట వీరు తమ బంధువులను ఉద్యోగాల్లో చేర్చుకుని, కొంతకాలం వారికి నిజమైనట్లుగా జీతాలు చెల్లించారు. ఈ బంధువులకు జీతాలు రావడం చూసి, గ్రామాల్లో కంపెనీపై విశ్వాసం పెరిగింది. ఇదే అదనుగా వీరు నంద్యాల, కర్నూలు, అనంతపురం, వైఎస్సార్ కడప జిల్లాల్లోని వందలాది కుటుంబాలను వలలోకి లాగారు.

### పొలాలు అమ్మి, బంగారం తాకట్టు పెట్టి...

సుమారు 5 వేల మంది ఈ మోసానికి గురై ఉంటారని అంచనా. ఉద్యోగం వస్తుందనే ఆశతో బాధితులు కొందరు తమ పొలాలను అమ్మి, మరికొందరు బంగారాన్ని తాకట్టు పెట్టి నిర్వాహకులకు డబ్బులు చెల్లించారు.

### బాధితుల ఆవేదన

"నాకు, నా ఇద్దరు కొడుకులకు ఉద్యోగం వస్తుందని నమ్మి ఎకరం పొలం అమ్మి రూ.13.50 లక్షలు కట్టాను," అని దొర్నిపాడుకు చెందిన ఓ రైతు కన్నీరుమున్నీరయ్యారు. రుద్రవరం మహిళ కూడా, "ఏజెంట్ ఫోన్ స్విచ్ ఆఫ్ వస్తోంది. మా డబ్బులు ఎవరు ఇస్తారు?" అంటూ ఆవేదన వ్యక్తం చేశారు.

### కంపెనీ బోర్డు తిప్పేసి పరారీ

దాదాపు 10 నెలల పాటు కొందరికి జీతాలు చెల్లించిన తర్వాత, "వెల్త్ అండ్ హెల్త్ ఫైనాన్షియల్ సొల్యూషన్స్" సంస్థ అకస్మాత్తుగా మూతపడింది. నిర్వాహకులు కంపెనీ బోర్డును తొలగించి, ఫోన్ నంబర్లు స్విచ్ ఆఫ్ చేసుకుని రాత్రికి రాత్రే అదృశ్యమయ్యారని మీడియాలో కథనాలు వస్తున్నాయి.. దీంతో తాము మోసపోయామని గ్రహించిన బాధితులు ఇప్పుడు లబోదిబోమంటూ పోలీస్ స్టేషన్లను ఆశ్రయిస్తున్నారు.

### కేంద్ర ఇంటెలిజెన్స్ సమాచారం ఉన్నా...

నిందితులు వాడుతున్న ఒక బ్యాంక్ ఖాతా నుంచి రోజూ కోట్ల రూపాయల లావాదేవీలు జరుగుతున్నాయని కేంద్ర ఇంటెలిజెన్స్ సంస్థలు ముందే నంద్యాల పోలీసులకు సమాచారం అందించినట్లు తెలిసింది. దీనిపై పోలీసులు విచారణ చేపట్టినా, ఆ తర్వాత కూడా మోసం కొనసాగినట్టుగా బాధితులు ఆరోపిస్తున్నారు. పోలీసులు తక్షణమే స్పందించి, పరారీలో ఉన్న నిందితులను పట్టుకుని, మోసపోయిన బాధితులకు న్యాయం చేయాలని సర్వత్రా డిమాండ్ వినిపిస్తోంది.

# జనసేన ఎమ్మెల్యే కుమారుడి వివాహ వేడుకకు బాలయ్య



నందమూరి బాలక్రిష్ణ. ఈ పేరు గత నెల నుంచి ఇప్పటికే సోషల్ మీడియాలో మారుమోగుతూనే ఉంది దానికి కారణం అసెంబ్లీ ఎపిసోడ్. మాట్లాడింది గట్టిగా అయిదు నిమిషాలు కూడా లేదు కానీ బాలయ్య రాజకీయ ప్రకంపనలే సృష్టించారు. ఆ మరునాడు ఏమీ జరగనట్లుగా ఆయన విజయవాడ ఉత్సవాలకు హాజరయ్యారు. అక్కడ కూడా ఉత్సవాల గురించి గొప్పగా చెప్పి జనాలను మెప్పించారు. ఆ తరువాత బాలయ్య వైపు నుంచి సౌండ్ లేదు. దాంతో రకరకాలైన చర్చలు దీని మీద నడిచాయి.

### ప్రత్యేక ఆకర్షణగా :

మళ్ళీ ఇన్ని రోజుల తరువాత బాలయ్య మెరిసారు. అది కూడా ఒక వివాహ వేడుకలో. జనసేన పార్టీకి చెందిన ఎమ్మెల్యే కుమారుడి వివాహ వేడుకకు బాలయ్య రావడం విశేషం అయితే ఆయనే అక్కడ సెంటర్ ఆఫ్ అట్రాక్షన్ గా మారారు పైగా తన మేనల్లుడు మంత్రి లోకేష్ తో ఆయన వచ్చారు. మంగళగిరిలోని సీకే కన్వెన్షన్ లో జరిగిన ఈ వేడుకకు పలువురు రాజకీయ ప్రముఖులు హాజరయ్యారు. ముఖ్యమంత్రి చంద్రబాబు కూడా వచ్చారు అయితే బాలయ్య లోకేష్ కలసి రావడం ఒక విశేషంగా చూడాలని అంటున్నారు.

### వివాదాలకు ఫుల్ స్టాప్ :

బాలయ్య ఆగ్రహంగా ఉన్నారని ఆయన కూడా ఒక బహిరంగ లేఖ రాస్తారని ఆ మధ్యన ప్రచారం అయితే పెద్ద ఎత్తున సాగింది. అంతే కాదు బాలయ్య టీడీపీ అధినాయకత్వం మీద మండిపడుతున్నారని కూడా మరో ప్రచారం కూడా జరిగింది అయితే బాలయ్య ప్రసన్న వదనంతో తమ మేనల్లుడుతో రావడం యధా ప్రకారం తనదైన జోష్ తో సందడి చేయడంతో ఆ వివాదానికి ఫుల్ స్టాప్ పడిందని అంతా సర్దుకున్నారని అంటున్నారు. పైగా బాలయ్య కూడా హుషార్ చేస్తూ కనిపించారు.

### వ్యూహాత్మకంగానేనా :

జనసేన ఎమ్మెల్యే పంతం నానాజీ గోదావరి జిల్లాలో ప్రముఖ నాయకుడే. అయితే ఆయన మంత్రి కాదు, అయినా ఆయనకు రాజకీయంగా అందరితో మంచి సంబంధాలు ఉన్నాయి. ఒక బలమైన సామాజిక వర్గానికి చెందిన నానాజీ కుమారుడి వివాహ వేదికకు వచ్చి బాలయ్య నవ దంపతులను ఆశీర్వదించడం యధాలాపంగానే జరిగింది అని అంటున్నా బాలయ్య చేసిన కొన్ని వ్యాఖ్యలతో ఒక బలమైన సామాజిక వర్గానికి ఇబ్బంది జరిగిందని వారు అసంతృప్తిగా ఉన్నారని ప్రచారం సాగుతున్న క్రమంలో బాలయ్య రావడం తన నిండు దీవెనలు ఇవ్వడం విశేషంగానే చూస్తున్నారు. మొత్తానికి టీ కప్పులో తుఫాను మాదిరిగా అసెంబ్లీ ఎపిసోడ్ అయితే ముగిసింది అని అంటున్నారు.

# అన్నదాతకు అభయం

న్యూఢిల్లీ



దేశంలో తృణధాన్యాల ఉత్పత్తిని భారీగా పెంచడంతోపాటు దేశవ్యాప్తంగా 100 జిల్లాల్లో సాగును ప్రోత్సహించడానికి ప్రధానమంత్రి నరేంద్ర మోదీ రెండు కీలక పథకాలకు శ్రీకారం చుట్టారు. రూ.24,000 కోట్లతో అమలు చేసే ప్రధానమంత్రి ధన్ ధాన్య కృషి యోజన(పీఎం%-%డీడీకేవై)తోపాటు రూ.11,440 కోట్లతో అమలయ్యే 'మిషన్ ఫర్ ఆత్మనిర్భర్ ఇన్ పల్సెస్'ను లాంఛనంగా ప్రారంభించారు. అలాగే వ్యవసాయం, పశు పోషణ, మత్స్య, ఆహార శుద్ధి రంగాలకు సంబంధించి రూ.5,450 కోట్ల విలువైన ప్రాజెక్టులు సైతం ప్రారంభించారు. రూ.815 కోట్ల విలువైన మరికొన్ని ప్రాజెక్టులకు శంకుస్థాపన చేశారు. ఢిల్లీలోని భారత వ్యవసాయ పరిశోధన సంస్థలో శనివారం జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో ప్రధాని మోదీ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... ఆహారం విషయంలో దిగుమతులపై ఆధారపడడం తగ్గించుకోవాలని, ఎగుమతులు పెంచాల్సిన అవసరం ఉందని స్పష్టంచేశారు. గతంలో అధికారం చెలాయించిన కాంగ్రెస్ ప్రభుత్వాల నిర్లక్ష్యం వల్లే వ్యవసాయ రంగం వెనుకంజలో ఉందని ఆరోపించారు. వ్యవసాయం, దాని బంధాల రంగాలపై కాంగ్రెస్ ప్రభుత్వాలకు ఏనాడూ ఒక వ్యూహం గానీ, లక్ష్యం గానీ లేవని మండిపడ్డారు.

**అంతర్జాతీయ మార్కెట్ల తలుపులు తట్టాలి**

పీఎం%-%డీడీకేవైతోపాటు తృణధాన్యాల మిషన్ అమలుకు రూ. 35,000 కోట్లకుపైగా ఖర్చు చేయబోతున్నామని, దీనివల్ల కోట్లాది మంది రైతన్నలకు లబ్ధి చేకూరుతుందని, వారి జీవితాల్లో మార్పులు వస్తాయని ప్రధాని మోదీ వెల్లడించారు. ఈ రెండు పథకాలను రాబోయే రబీ సీజన్ నుంచి 2030%-%31 దాకా అమలు చేస్తారు. 2047నాటికి భారత్‌ను అభివృద్ధి చెందిన దేశంగా తీర్చిదిద్దుకోవాలని లక్ష్యంగా నిర్దేశించుకున్నామని ప్రధానమంత్రి పునరుద్ఘాటించారు. వికసిత్ భారత్ సాధనలో అన్నదాతలదే కీలక పాత్ర అని తేల్చిచెప్పారు.

దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత ఆహార ధాన్యాల ఉత్పత్తిలో స్వయం సమృద్ధి సాధించామంటే ఆ ఘనత రైతులదేనని ప్రశంసించారు. అదే స్ఫూర్తితో వికసిత్ భారత్ సాధన కోసం కృషి చేయాలని పిలుపునిచ్చారు. ప్రపంచ మార్కెట్ల అవసరాలకు తగ్గట్టుగా ఆహారం ఉత్పత్తి చేయాలని సూచించారు. అంతర్జాతీయ మార్కెట్ల తలుపులు తట్టాలని, విదేశాల్లోని డిమాండ్‌ను తీర్చే పంటలు పండిస్తే మనకు లాభదాయకమని పేర్కొన్నారు. ఆహార దిగుమతులు తగ్గించుకోవడం, ఎగుమతులు పెంచుకోవడం అనే రెండు కీలక లక్ష్యాలు కచ్చితంగా సాధించుకోవాలని వివరించారు. ఇందుకు నేడు ప్రారంభించిన రెండు కొత్త పథకాలు దోహదపడతాయని తెలిపారు.

**పంటల వైవిధ్యంపై దృష్టి పెట్టాలి**

కేవలం వరి, గోధుమలే కాకుండా పంటల వైవిధ్యంపై దృష్టి పెట్టాలని రైతులకు ప్రధాని మోదీ విజ్ఞప్తి చేశారు. ప్రజలకు ప్రొటీన్ భద్రత కల్పించడానికి తృణధాన్యాల సాగును పెంచాలని చెప్పారు. తృణధాన్యాల ఉత్పత్తి, వినియోగంలో ప్రపంచంలో మన దేశమే తొలిస్థానంలో ఉందన్నారు. అయినప్పటికీ మన అవసరాల కోసం విదేశాల నుంచి దిగుమతులపై ఆధారపడాల్సి వస్తోందని అసంతృప్తి వ్యక్తంచేశారు. 'తృణధాన్యాల మిషన్' కింద తృణధాన్యాల సాగును 2030 నాటికి 35 లక్షల హెక్టార్లకు పెంచనున్నట్లు వెల్లడించారు. ప్రస్తుతం ఏటా 252.38 లక్షల టన్నుల తృణధాన్యాలు ఉత్పత్తి అవుతున్నాయని, 2030%-%31 నాటికి దీన్ని 350 లక్షల టన్నులకు పెంచాలని లక్ష్యంగా నిర్దేశించారు.

**సాగులో సంస్కరణలకు పెద్దపీట**

ఇక పీఎం%-%డీడీకేవై కింద 100 జిల్లాలో పంటల సాగు పెంచబోతున్నామని, వేర్వేరు శాఖలకు సంబంధించిన 36 పథకాలను మిళితం చేయబోతున్నామని ప్రధానమంత్రి పేర్కొన్నారు. పంటల ఉత్పత్తిని పెంచడం, పంటల వైవిధ్యాన్ని ప్రోత్సహించడం, సాగునీరు సదుపాయం, పంటల నిల్వ సామర్థ్యం మెరుగుపర్చడం, రైతులకు రుణాలు ఇవ్వడం ఈ పథకం ప్రధాన లక్ష్యాలని వివరించారు. కాంగ్రెస్ ప్రభుత్వాల వల్ల అధోగతి పాలైన వ్యవసాయ రంగాన్ని తాము అధికారంలోకి వచ్చిన తర్వాత గాడిలో పెట్టామని గుర్తుచేశారు. ఈ రంగంలో సంస్కరణలకు పెద్దపీట వేస్తున్నామని చెప్పారు.

పెట్టుబడులు పెంచుతున్నామని, విత్తనాల నుంచి మార్కెట్ల దాకా సంస్కరణలు అమలు చేస్తున్నామని వెల్లడించారు. గత 11 ఏళ్లలో వ్యవసాయ బడ్జెట్‌ను ఆరు రెట్లు పెంచామని తేల్చిచెప్పారు. తమ ప్రభుత్వ చర్యల వల్ల వ్యవసాయ ఉత్పత్తుల ఎగుమతులు రెండు రెట్లు పెరిగాయని పేర్కొన్నారు. ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన కింద రైతులకు రూ.2 లక్షల కోట్లు అందజేశామని, ఇది చిన్న మొత్తం కాదని వ్యాఖ్యానించారు. తాము అధికారంలోకి వచ్చాక పదేళ్లలో రైతన్నల బాగు కోసం ఎరువులపై రూ.13 లక్షల కోట్ల రాయితీ ఇచ్చామన్నారు. తృణధాన్యాలు సాగు చేస్తున్న పలువురు రైతులతో ప్రధాని నరేంద్ర మోదీ ఈ సందర్భంగా సంభాషించారు.

# కరూర్ తొక్కిసలాట..
# మృతుల కుటుంబాల చెంతకు నటుడు విజయ్?



కరూర్ తొక్కిసలాట ఘటనలో ప్రాణాలు కోల్పోయిన 41 మంది కుటుంబాలను ప్రముఖ నటుడు, టీవీకే పార్టీ అధ్యక్షుడు విజయ్ ఆదివారం కలవనున్నట్లు సమాచారం. అయితే బాధిత కుటుంబాల ఇంటింటికి వెళ్లి కాకుండా అందరినీ ఒక ప్రత్యేక వేదికపై విజయ్ కలువనున్నట్లు టీవీకే పార్టీ ప్రకటించింది. ధర్మపురి జిల్లా లో ప్రత్యేక వేదికను సిద్ధం చేస్తున్నారు. విజయ్ తొక్కిసలాటలో మరణించిన 41 మంది కుటుంబాల సభ్యులతో మాట్లాడి పరామర్శించ నున్నారు. వారికి ధైర్యం చెప్పనున్నారు. కాగా కరూర్‌లో సెప్టెంబర్ 27న టీవీకే పార్టీ అధ్యక్షుడు విజయ్ భారీ ప్రచార ర్యాలీ నిర్వహించారు. ఆ ర్యాలీకి జనం ఊహించని రీతిలో తరలిరావడంతో తొక్కిసలాట జరిగింది. ఆ తొక్కిసలాటలో 41 మంది మరణించారు. పలువురు గాయపడ్డారు. అయితే విజయ్ బాధితులను కలిసే సమయంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా భారీ భద్రతను ఏర్పాటు చేయాలని టీవీకే పార్టీ విజ్ఞప్తి చేసింది. అందుకు అనుగుణంగా తగిన ఏర్పాట్లు చేస్తున్నామని పోలీసులు తెలిపారు. వేదిక నుంచి ఒక కిలోమీటరు మేర ప్రజలు ఎవరూ రాకుండా చర్యలు తీసుకోవాలని పార్టీ వర్గాలు కోరాయి. కేవలం బాధిత కుటుంబాలకు మాత్రమే వేదిక వద్దకు ప్రవేశం ఉంటుందని వారు తెలిపారు.

## నిజంగా శాంతి కోసం కృషి చేసే వ్యక్తులనే ఎంపిక చేస్తాం..

# వైట్‌హౌస్‌కు నోబెల్ కమిటీ కౌంటర్



అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌కు నిరాశ ఎదురైన విషయం తెలిసిందే. నోబెల్ శాంతి బహుమతిపై ట్రంప్ పెట్టుకున్న ఆశలు గల్లంతయ్యాయి. ట్రంప్ 'శాంతి' ఆశలపై నీళ్లు చల్లుతూ 2025 నోబెల్ శాంతి బహుమతి వెనెజువెలా ప్రధాన ప్రతిపక్ష నాయకురాలు, ప్రస్తుతం అజ్ఞాతంలో ఉన్న మరియా కొరీనా మచాడోకు నోబెల్ కమిటీ శుక్రవారం ప్రకటించిన విషయం తెలిసిందే. ట్రంప్‌ను కాకుండా వెనెజువెలా ప్రతిపక్ష నేత మరియా కొరీనా మచాడోను నోబెల్ శాంతి బహుమతికి ఎంపిక చేయడంపై వైట్‌హౌస్ అసంతృప్తి వ్యక్తం చేసింది. మచాడోని ఎంపిక చేయడం ద్వారా నోబెల్ కమిటీ శాంతి కన్నా రాజకీయాలకే ప్రాధాన్యం ఇచ్చిందని విమర్శించింది. వైట్‌హౌస్ విమర్శలపై నోబెల్ కమిటీ స్పందించింది. 'శాంతి' ప్రకటన విషయంలో నియమ, నిబంధనల ప్రకారమే నడుచుకున్నట్లు తెలిపింది. కమిటీ చైర్మన్ జోర్గెన్ వాట్నే ఫ్రైడ్నెస్ మాట్లాడుతూ.. 'నోబెల్ అవార్డుల ఎంపికకు ముందు అన్నిరకాలుగా పరిశీలన జరుపుతాం. అవార్డు అందుకోవడానికి అన్ని అర్హతలు ఉన్నాయని నిర్ధారించుకున్న తర్వాతే ఎంపిక చేస్తాం. నోబెల్ పీస్ ప్రైజ్ కోసం ఏటా వేల సంఖ్యలో దరఖాస్తులు వస్తాయి. వాటన్నింటినీ పరిశీలించి నిజంగా శాంతి కోసం కృషి చేసే వ్యక్తులనే ఎంపిక చేస్తాం. నోబెల్ బహుమతి గ్రహీతల ఫొటోలు ఉన్న గదిలో కమిటీ కూర్చుంటుంది. ఆ గదిలో ధైర్యం, సమగ్రత నిండి ఉంటాయి. చేసిన కృషి, ఆల్ఫ్రెడ్ నోబెల్ అభీష్టంపైనే మా నిర్ణయం ఆధారపడి ఉంటుంది. ఇందులో ఇతర అంశాలు ఏవీ ప్రభావం చూపబోవు' అని స్పష్టం చేశారు.

## మోదీని ట్రంప్ సన్నిహితుడిగా భావిస్తారు



ఇంటర్నెట్ డెస్క్

భారత్‌తో బంధాన్ని అమెరికా ఎంతో విలువైనదిగా భావిస్తుందని ఆ దేశ రాయబారి సెర్గియో గోర్ పేర్కొన్నారు. ఆరు రోజుల భారత పర్యటనలో ఉన్న ఆయన ప్రధాని మోదీతో భేటీ అయ్యారు. రక్షణ, వాణిజ్యం, సాంకేతికత వంటి ద్వైపాక్షిక అంశాలతోపాటు కీలక ఖనిజాల ప్రాముఖ్యతపైనా చర్చించామని చెప్పారు. విదేశాంగమంత్రి ఎస్ జైశంకర్, జాతీయ భద్రతా సలహాదారు అజిత్ డోభాల్, విదేశాంగ కార్యదర్శి మిస్రీతోనూ వరుస సమావేశాలు నిర్వహించానని అన్నారు. ఇక ప్రధాని మోదీని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ అత్యంత సన్నిహితుడిగా భావిస్తారని అమెరికా రాయబారి పేర్కొన్నారు. ఈ సందర్భంగా మోదీ, ట్రంప్‌లతో కూడిన ఓ ఫొటోను ప్రధానికి బహూకరించారు.

ఈ భేటీపై ప్రధాని మోదీ కూడా స్పందించారు. భారత్‌లో అమెరికా రాయబారిగా నియమితులైన సెర్గియో గోర్‌తో భేటీ కావడం సంతోషంగా ఉందన్నారు. గోర్ హయాంలో భారత్–అమెరికాల మధ్య వ్యూహాత్మక భాగస్వామ్యం మరింత బలోపేతమవుతుందని విశ్వాసం వ్యక్తం చేశారు. భారత్ అమెరికా సంబంధాల్లో ఇటీవల ఘర్షణ వాతావరణం నెలకొన్న విషయం తెలిసిందే. ఈ క్రమంలో అధ్యక్షుడు ట్రంప్, ప్రధాని మోదీల ఫోన్ సంభాషణలతో ఇవి పునరుద్ధరణ దిశగా కొనసాగుతున్నాయి.

## మూడో తరగతి నుంచే ఏఐ!



న్యూఢిల్లీ

విద్యారంగంలో కీలక మార్పులకు కేంద్ర ప్రభుత్వం శ్రీకారం చుడుతున్నది. 2026–27 విద్యా సంవత్సరం నుంచి 3వ తరగతి నుంచే విద్యార్థులందరికీ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ)ని పాఠశాలలో తప్పనిసరిగా చేర్చాలని విద్యా మంత్రిత్వశాఖ ప్రణాళికలు రూపొందిస్తున్నది. దీనికి సంబంధించి ఒక సమగ్ర ఫ్రేమ్‌వర్క్‌ను అభివృద్ధి చేస్తున్నట్టు అధికారులు తెలిపారు. ఈ ఫ్రేమ్‌వర్క్‌ను సెంట్రల్ బోర్డ్ ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్ (సీబీఎస్ఈ) సిద్ధం చేస్తున్నది. ప్రస్తుతం 18 వేలకుగాపైగా సీబీఎస్ఈ పాఠశాలల్లో ఆరో తరగతి నుంచి ఏఐని ఒక నైపుణ్య కోర్సుగా అందిస్తున్నారు. ఏఐ, ఉద్యోగాలపై నీతి ఆయోగ్ విడుదల చేసిన ఒక నివేదిక ప్రకారం ఏఐ కారణంగా సుమారు 20 లక్షల సంప్రదాయ ఉద్యోగాలు కనుమరుగైనా, సరైన వాతావరణాన్ని సృష్టిస్తే 80 లక్షల కొత్త ఉద్యోగాలు పుట్టుకొచ్చే అవకాశం ఉంది. ఏఐ రంగంలో భారత భవిష్యత్తు కోసం ప్రభుత్వం, పరిశ్రమలు, విద్యాసంస్థలు కలిసి పనిచేయాలని, తగినంత మౌలిక సదుపాయాలు కల్పించాలని నివేదిక సిఫార్సు చేసింది. ఈ దిశగా పటిష్టమైన చర్యలు తీసుకుంటే, ఏఐ రంగంలో భారత్ కేవలం తన ఉద్యోగులను కాపాడుకోవడమే కాకుండా, ప్రపంచ ఏఐ పటంలో నాయకత్వం వహించగలదని నివేదిక స్పష్టం చేసింది.

# అక్రమ బాణాసంచా నిల్వ చేస్తే కఠిన చర్యలు తప్పవు

**కొద్దిపాటి నిల్వలైనా ప్రమాదకరంగా మారవచ్చు**

**బాణాసంచా అక్రమ నిల్వలు గుర్తిస్తే 112 లేదా 100 కు సమాచారం అందించాలి.**

**రామచంద్రపురం డిఎస్పీ రఘువీర్**



**రాయవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** అక్రమంగా బాణాసంచా నిల్వ చేస్తే చట్టరీత్యా కఠిన చర్యలు తప్పవని రామచంద్రపురం డీఎస్పీ రఘువీర్ హెచ్చరించారు. డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ జిల్లా, మండల కేంద్రమైన రాయవరం పోలీస్ స్టేషన్ లో శనివారం ఆయన మీడియా ద్వారా, దీపావళి పండుగ సందర్భంగా, ప్రజల భద్రత దృష్ట్యా కఠిన హెచ్చరికలు జారీ చేశారు. ఎవరైనా ఇళ్ళ వద్ద బాణాసంచా తయారీ లు చేపట్టినా, ఇంట్లో బాణాసంచా నిల్వ చేసినా సమాచారం ఇవ్వాలని, అమ్మకాలు, తయారీకి సంబంధించిన చట్టబద్ధమైన నిబంధనలను ప్రతి ఒక్కరూ పాటించాలని, ఎక్కడైనా నిబంధనలకు విరుద్ధంగా బాణసంచా తయారు చేస్తున్నా, అనుమతి లేకుండా నిల్వ చేస్తున్నా 112, 100 నంబర్లకు సమాచారం అందించాలని ఆయన ప్రజలను కోరారు. ఈ కార్యక్రమంలో ఆయనతో పాటు మండపేట రూరల్ సిఐ పి దొర రాజు, రాయవరం ఎస్సై డి సురేష్ బాబులు ఉన్నారు.

# శనగలు ఎలా తింటే లాభం!



శనగలో ప్రోటీన్, కార్బోహైడ్రేట్లు, ఐరన్, ఫైబర్, ఫోలేట్ వంటి పోషకాలు పుష్కలంగా ఉంటాయి. ఇవి ఆరోగ్యానికి చాలా మేలు చేస్తాయి. మీరు శనగలను మూడు విధాలుగా తినవచ్చు. వేయించిన, ఉడికించిన లేదా మొలకెత్తిన శనగలు కూగా తింటారు చాలా మంది. ప్రతి రకానికి వేర్వేరు ప్రయోజనాలు ఉన్నాయని నిపుణులు చెబుతున్నారు. మొలకెత్తిన, వేయించిన, లేదంటే ఉడికించి శనగలు ఎలా తింటే ఎలాంటి లాభాలు కలుగుతాయో తప్పక తెలుసుకోండి. శనగలో ప్రోటీన్, కార్బోహైడ్రేట్లు, ఐరన్, ఫైబర్, ఫోలేట్ వంటి పోషకాలు పుష్కలంగా ఉంటాయి. ఇవి ఆరోగ్యానికి చాలా మేలు చేస్తాయి. మీరు శనగలను మూడు విధాలుగా తినవచ్చు. వేయించిన, ఉడికించిన లేదా మొలకెత్తిన శనగలు కూగా తింటారు చాలా మంది. ప్రతి రకానికి వేర్వేరు ప్రయోజనాలు ఉన్నాయని నిపుణులు చెబుతున్నారు. మొలకెత్తిన శనగలను అథ్లెట్లు లేదా పొలాల్లో పనిచేసేవారు, అలాగే అధిక స్థాయిలో శారీరక శ్రమ చేసేవారు మాత్రమే తినాలని నిపుణులు సూచిస్తున్నారు. మొలకెత్తిన శనగల్లో నీటిలో కరిగే పీచు ఉంటుంది. ఇది జీర్ణక్రియను మెరుగు పరుస్తుంది. దాంతో మలబద్దకం, గ్యాస్ సమస్యలూ తగ్గుతాయి. శరీరంలో కొలెస్ట్రాల్ స్థాయిని తగ్గించడంలో కూడా ఈ ఫైబర్ పనిచేస్తుంది. ఇందులో ఉండే పొటాషియం హైబీపీ సమస్యను నియంత్రించడంలో సహాయపడుతుంది. ఉడికించిన శనగలు ఒక ఔషధంగా పరిగణిస్తారు. రోజంతా ఆఫీసులో పనిచేసే వారికి ఉడికించిన శనగలు ఔషధం లాంటివి అంటున్నారు నిపుణులు. ఆఫీసు సమయంలో వారు ఒక్కో చిక్కుడు గింజను తింటుండవచ్చు. వీటిలో విటమిన్ బి కాంప్లెక్స్ పుష్కలంగా ఉంటుంది. ఇవి శరీరంలో ప్రోటీన్ లోపాన్నీ తగ్గిస్తాయి. కండరాలను బలోపేతం చేయడం ద్వారా జీర్ణక్రియను సులభతరం చేస్తుంది. వీటిని క్రమం తప్పకుండా తీసుకోవడం వల్ల మంచి జ్ఞాపకశక్తిని కాపాడుకోవచ్చు. శరీరంలో సెరోటోనిన్ అనే హార్మోన్ ను పెంచడం ద్వారా మంచి మెదడు పనితీరును నిర్వహించడానికి ఇది పనిచేస్తుంది. ఇది ఒత్తిడిని తగ్గిస్తుంది.

వేయించిన శనగలు తినడం, వాటిపై కొద్దిగా నిమ్మకాయ పిండుకోవడం వల్ల రోగనిరోధక శక్తి పెరుగుతుంది. డయాబెటిస్ లేదా థైరాయిడ్ వంటి వ్యాధులు ఉన్నవారు వేయించిన శెనగలను తినాలి. ఇది డయాబెటిస్‌ను అదుపులో ఉంచడానికి సహాయపడుతుంది. జలుబు, కఫంతో బాధపడేవారు వీటిని తీసుకోవడం ద్వారా సమస్య నుంచి ఉపశమనం కలుగుతుంది. వేయించిన శనగలు తినడం వల్ల మీ బరువు నియంత్రణలో ఉంటుంది. కాబట్టి అధిక బరువు ఉన్నవారు కూడా వాటిని తినవచ్చు. అలాగే, మీరు మలబద్ధకంతో బాధపడుతుంటే, ఎట్టి పరిస్థితుల్లోనూ ఉడికించిన శనగపప్పు తినకూడదని నిపుణులు చెబుతున్నారు. ఏ రకంగా చూసినా, ఏ రూపంలో తిన్నా శనగల వల్ల ఆరోగ్యానికి మేలే జరుగుతుందని నిపుణులు చెబుతున్నారు. ఇకపోతే, కొన్ని రకాల చర్మ సమస్యలు ఉన్నవారు శనగపప్పుకు దూరంగా ఉండాలని చెబుతున్నారు. ఆయుర్వేదం ప్రకారం, వాత స్వభావం ఉన్నవారు శనగలు తినకుండా ఉండాలి. పొడి చర్మం ఉన్నవారు కూడా శనగలు తినకుండా ఉండాలి.

# కడుపు క్యాన్సర్ లక్షణాలు..



చాలా మందిని వేధిస్తున్న అతి పెద్ద సమస్యల్లో క్యాన్సర్ ఒకటి. ప్రస్తుతం క్యాన్సర్ అనేది చాప కింద నీరులా వ్యాపిస్తుంది. రోజు రోజుకు క్యాన్సర్ కేసులు అనేవి విపరీతంగా పెరిగిపోతున్నాయి. చిన్న పిల్లల నుంచి వృద్ధుల వరకు చాలా మంది క్యాన్సర్ బారిన పడుతున్నారు. దీనికి ముఖ్యకారణం, తీసుకుంటున్న ఆహారం, జీవనశైలి. అయితే క్యాన్సర్‌లు అనేక రకాలు ఉన్నాయి. చాలా మందిని వేధిస్తున్న అతి పెద్ద సమస్యల్లో క్యాన్సర్ ఒకటి. ప్రస్తుతం క్యాన్సర్ అనేది చాప కింద నీరులా వ్యాపిస్తుంది. రోజు రోజుకు క్యాన్సర్ కేసులు అనేవి విపరీతంగా పెరిగిపోతున్నాయి. చిన్న పిల్లల నుంచి వృద్ధుల వరకు చాలా మంది క్యాన్సర్ బారిన పడుతున్నారు. దీనికి ముఖ్యకారణం, తీసుకుంటున్న ఆహారం, జీవనశైలి. అయితే క్యాన్సర్‌లు అనేక రకాలు ఉన్నాయి. కడుపు క్యాన్సర్, గ్యాస్ట్రిక్ క్యాన్సర్ అనేది చాలా సాధారణమైనది. దీనిని సైలెంట్ కిల్లర్ అని కూడా అంటారు. ఎందుకంటే ప్రాణం పోయే స్టేజ్ వరకు దీని లక్షణాలు అంతగా బయటపడవు. ముఖ్యంగా దీని లక్షణాలు సాధారణ కడుపు సమస్యల మాదిరిగా ఉండటం వలన చాలా మంది దీనిని విస్మరిస్తారు. ఇది చాలా ప్రమాదకరంగా మారుతుంది. అయితే ప్రస్తుతం ఈ రకమైన క్యాన్సర్ కేసులు రోజు రోజుకు విపరీతంగా పెరుగుతున్నాయంట. ఆకలి లేకపోవడం, విపరీతంగా బరువు తగ్గడం, ఎవరికైతే ఆకలి అనేది రోజు రోజుకు నశించిపోతుందో లేదా ఆకలి అనేది లేకుండా, విపరీతంగా బరువు తగ్గుతున్నారో వారు ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలంట. ఎందుకంటే ఇది కడుపు క్యాన్సర్‌లో ప్రాథమిక లక్షణం అంటున్నారు ఆరోగ్య నిపుణులు. అంతే కాకుండా కడుపు క్యాన్సర్ ఉన్నవారిలో మిగేటప్పుడు నొప్పి వంటి సమస్యలు ఎదురవుతాయంట. భోజనం చేసిన వెంటనే అజీర్ణం, గ్యాస్, గుండెల్లో మంట వంటి సమస్యలు వస్తే అస్సలే ఆలస్యం చేయకుండా వైద్యుడిని సంప్రదించాలంట. ఎందుకంటే చాలా మంది ఇలాంటి సమస్యలను లైట్ తీసుకుంటారు. కానీ ఇవి ఎక్కువ రోజుల పాటు ఇలానే కొనసాగితే, ఇది కడుపు క్యాన్సర్‌కు కారణం అవుతుందంట. అలాగే నిరంతరం వికారం, వాంతులు లేదా రక్తంతో కలిసిన వాంతులు కూడా కడుపు క్యాన్సర్ ప్రారంభ లక్షణాలేనంట. ఎవరికైతే పొత్తికడపు పై భాగంలో తరచూ నొప్పి, నాభిపై నొప్పి వస్తుందో వారు కూడా జాగ్రత్త పడాలంట. ఇది కూడా కడుపు క్యాన్సర్ లక్షణమే, అలాగే రక్తహీనత, నిరంతరం అలసట, బలహీనత , కొంచెం తిన్నా కడుపు నిండిన భావన కలగడం, కడుపు ఉబ్బరం, కడుపు బరువుగా అనిపించడం ఇవన్నీ కూడా కడుపు క్యాన్సర్ లక్షణాలేనంట.

# బరువు తగ్గాలనుకుంటున్నారా?



ఈ ధాన్యాలు శరీర జీవక్రియను వేగవంతం చేస్తాయి, దీని కారణంగా శరీరంలోని కొవ్వు వేగంగా కరగడం ప్రారంభమవుతుంది. మీరు వీటిని ప్రతిరోజూ సరైన రీతిలో తింటే, కేవలం ఒక నెలలోనే బరువు తగ్గడం ప్రారంభమవుతుంది. ప్రత్యేకత ఏమిటంటే ఈ ధాన్యాలు బొడ్డు కొవ్వును తగ్గించడంలో చాలా ప్రభావవంతంగా ఉంటాయి. ఇటీవలి కాలంలో ఊబకాయం ఒక సాధారణ సమస్యగా మారింది. డైటింగ్, వ్యాయామం తర్వాత కూడా బరువు తగ్గడం కష్టంగా మారింది. కానీ, మీ కోసం కొవ్వును కరిగించే యంత్రంగా మారగల ఒక ఇంటి నివారణ ఉంది. అది ఏమిటో తెలిస్తే మీరు షాక్ అవుతారు. ఎందుకంటే..ఇది మీ వంటగదిలో తప్పనిసరిగా ఉండే చిన్న పసుపు ధాన్యం. కొన్నిసార్లు వంటలో కూడా ఉపయోగించబడుతుంది. నిజానికి, ఇది అద్భుతమైన లక్షణాలతో నిండి ఉంది. ఆరోగ్యానికి చాలా ప్రయోజనకరంగా ఉంటుంది. పెద్దలు దీనిని ప్రతిరోజూ ఉపయోగించేవారు. ఈ ధాన్యాలు శరీర జీవక్రియను వేగవంతం చేస్తాయి, దీని కారణంగా శరీరంలోని కొవ్వు వేగంగా కరగడం ప్రారంభమవుతుంది. మీరు వీటిని ప్రతిరోజూ సరైన రీతిలో తింటే, కేవలం ఒక నెలలోనే బరువు తగ్గడం ప్రారంభమవుతుంది. ప్రత్యేకత ఏమిటంటే ఈ ధాన్యాలు బొడ్డు కొవ్వును తగ్గించడంలో చాలా ప్రభావవంతంగా ఉంటాయి. మరి ఆహార ధాన్యం అంటే ఏమిటి? ఇంతకీ ఈ అద్భుత ధాన్యం ఏంటా అని మీరు ఆలోచిస్తున్నారా? అవి చిన్న మెంతి గింజలు..అవును బరువు తగ్గాలనుకునే వారికి మెంతులు దివ్యౌషధంగా నిరూపించబడ్డాయి. బరువు తగ్గే ప్రయత్నంలో ఉన్నవారు మెంతుల్ని ఆహారంలో భాగం చేసుకోవాలని నిపుణులు చెబుతున్నారు. వీటిల్లోని ఫైబర్ ఎక్కువసేపు కడుపు నిండుగా ఉన్న భావన కలిగిస్తుంది. తద్వారా అదనపు కెలరీలు తీసుకునే అవకాశం ఉండదు. మెంతి పొడిని ఆహారంలో భాగం చేసుకున్న వాళ్లకు ఆకలి తగ్గి, తద్వారా బరువు నియంత్రణలోకి వచ్చినట్టు ఓ అధ్యయనం చెబుతోంది. మెంతుల్ని నానబెట్టి ఉదయాన్నే తీసుకుంటే జీర్ణవ్యవస్థ మెరుగుపడుతుంది. మెంతుల్లోని పీచు పొట్ట ఆరోగ్యానికి మేలు చేసే బ్యాక్టీరియా పెరగడానికి సాయపడుతుంది. మెంతులుల్లోని పీచు, ఆల్కలాయిడ్స్ మధుమేహాన్ని అదుపులో ఉంచడానికి సాయపడతాయి. మధుమేహం సమస్య ఎక్కువగా ఉన్నవాళ్లు, టైప్-2 డయాబెటిస్ బాధితులు.. నానబెట్టిన మెంతుల్ని ఉదయాన్నే తీసుకుంటే రోజంతా రక్తంలో చక్కెర స్థాయులు పెరగకుండా చూస్తాయి.

# పోషకాల సిరులు సన్‌ఫ్లవర్ సీడ్స్



విత్తనాలు తినడం ఆరోగ్యానికి చాలా మేలు చేస్తుంది. చియా గింజలు, అవిసె గింజలు, గుమ్మడికాయ గింజలు, నల్ల బీన్ గింజలు, జనపనార గింజలు, పొద్దుతిరుగుడు విత్తనాలు వంటి అనేక రకాల విత్తనాలు ఉన్నాయి. అన్ని రకాల విత్తనాలు ఆరోగ్యకరమైన కొవ్వులతో సమృద్ధిగా ఉంటాయి. ఆరోగ్యానికి మేలు చేస్తాయి. పొద్దుతిరుగుడు విత్తనాల గురించి చెప్పాలంటే, మనం తరచుగా వాటిని సలాడ్లు, పెరుగు, స్మూతీలు లేదా చిరుతిండిగా తీసుకుంటాము. పొద్దుతిరుగుడు విత్తనాల గురించి చెప్పాలంటే, మనం తరచుగా వాటిని సలాడ్లు, పెరుగు, స్మూతీలు లేదా చిరుతిండిగా తీసుకుంటాము. పొద్దుతిరుగుడు విత్తనాలలో ప్రోటీన్, ఫైబర్, విటమిన్ ఇ, మెగ్నీషియం, సెలీనియం, అనేక ఇతర పోషకాలు ఉంటాయి. ఇవి శరీరానికి అనేక విధాలుగా ప్రయోజనకరంగా ఉంటాయి. పొద్దుతిరుగుడు విత్తనాలను మీ ఆహారంలో చేర్చుకోవడం వల్ల గుండె ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చు. ఈ విత్తనాలు ఎముకలు, కండరాలను బలోపేతం చేయడంలో ప్రయోజనకరమైన ప్రభావాన్ని చూపుతాయి. ఈ గింజల్లో ఉండే విటమిన్ బి6, విటమిన్ ఇ, ఐరన్, సెలీనియం జుట్టు రాలకుండా చూస్తాయి. జుట్టును బలంగా, ఒత్తుగా మారుస్తాయి. సన్‌ఫ్లవర్ సీడ్స్ తింటే ఎక్కువసేపు ఆకలి వేయదు. దీంతో బరువు అదుపులో ఉంటుంది. అందుకే బరువు తగ్గాలని చూసేవారు ఈ గింజలు తినడం మంచిది. ఈ గింజల్ని తినడం వల్ల ఎముకలు బలంగా, ఆరోగ్యంగా ఉంటాయి. వీటిలో ఉండే మెగ్నీషియం, కాపర్, కాల్షియం ఆస్టియోపొరోసిస్ వంటి సమస్యల ప్రమాదాన్ని తగ్గిస్తాయి. ఈ గింజల్లో ఫైబర్, ప్రోటీన్ ఎక్కువగా ఉంటాయి. వీటిని తినడం వల్ల రక్తంలో షుగర్ లెవెల్స్ అదుపులో ఉంటాయి. షుగర్ ఉన్నవారికి ఎంతో మేలు చేస్తాయి. ఇందులో ఉండే పొటాషియం రక్తపోటును అదుపులో ఉంచుతుంది. హైబీపీ ఉన్నవారు ఈ గింజలు తింటే ఎంతో మేలు కలుగుతుంది. సన్‌ఫ్లవర్ సీడ్స్‌లో మెగ్నీషియం సమృద్ధిగా ఉంటుంది. వీటిని తినడం వల్ల మెదడు పనితీరు బాగుంటుంది. ఆందోళన, ఒత్తిడి తగ్గుతాయి. సన్‌ఫ్లవర్ సీడ్స్‌లో విటమిన్ ఇ ఉంటుంది. ఇది చర్మాన్ని ఫ్రీ రాడికల్స్ వల్ల నష్టం కలగకుండా కాపాడుతుంది. తద్వారా చర్మం మృదువుగా, కాంతివంతంగా మారుతుంది. సన్‌ఫ్లవర్ సీడ్స్‌లో విటమిన్ ఎ, మెగ్నీషియం ఉంటాయి. ఇవి గుండెను ఆరోగ్యంగా ఉంచుతాయి. చెడు కొలెస్ట్రాల్‌ను కూడా తగ్గిస్తాయి. ఈ గింజల్లో విటమిన్ ఇ, జింక్, సెలీనియం వంటి పోషకాలు ఉంటాయి. ఇవి రోగనిరోధక శక్తిని పెంచుతాయి. తద్వారా జలుబు, ఫ్లూ వంటి సమస్యలు రాకుండా చూసుకోవచ్చు.

## ఈ జ్యూస్ తాగితే చాలు.. క్యాన్సర్, షుగర్ సమస్యలన్నీ దూరం!



బొప్పాయి ఆరోగ్యానికి ఎంతో ప్రయోజనకరమైన పండు. కానీ, బొప్పాయి ఆకులు కూడా అంతే ప్రయోజనకరంగా ఉంటాయని మీకు తెలుసా? బొప్పాయి ఆకుల రసం తాగడం వల్ల అనేక ఆరోగ్య ప్రయోజనాలు లభిస్తాయి. బొప్పాయి ఆకుల రసం పోషకాలతో సమృద్ధిగా ఉండటమే కాకుండా, దాని ఎంజైమ్‌లు, యాంటీఆక్సిడెంట్లు శరీరాన్ని అనేక వ్యాధుల నుండి రక్షించడంలో సహాయపడతాయి. డెంగ్యూ జ్వరానికి చికిత్స: డెంగ్యూ జ్వరానికి చికిత్స చేయడంలో బొప్పాయి ఆకుల రసం చాలా ప్రభావవంతంగా పరిగణిస్తారు. డెంగ్యూ జ్వరం ప్లేట్‌లెట్ కౌంట్‌లో వేగంగా తగ్గుదలకు కారణమవుతుంది. బొప్పాయి ఆకులలో ఉండే పపైన్, కైమోపాపైన్ వంటి ఎంజైమ్‌లు ప్లేట్‌లెట్ కౌంట్‌ను పెంచడంలో సహాయపడతాయి. ఇంకా, ఈ రసం శరీరం రోగనిరోధక శక్తిని బలపరుస్తుంది. వేగంగా కోలుకోవడానికి దోహదపడుతుంది. జీర్ణవ్యవస్థను బలోపేతం చేస్తుంది: బొప్పాయి ఆకుల రసం జీర్ణవ్యవస్థకు చాలా ప్రయోజనకరంగా ఉంటుంది. ఇందులో ఉండే ఎంజైమ్‌లు జీర్ణక్రియను మెరుగుపరుస్తాయి. గ్యాస్, ఆమ్లత్వం, మలబద్ధకం వంటి కడుపు సమస్యలను తగ్గిస్తాయి. ఈ రసం ప్రేగులను శుభ్రపరచడానికి, ఆరోగ్యకరమైన జీర్ణవ్యవస్థను నిర్వహించడానికి కూడా సహాయపడుతుంది. రోగనిరోధక శక్తిని పెంచుతుంది: బొప్పాయి ఆకులలో విటమిన్ సి, విటమిన్ ఎ, యాంటీఆక్సిడెంట్లు పుష్కలంగా ఉంటాయి. ఈ మూలకాలన్నీ శరీర వ్యాధితో పోరాడే సామర్థ్యాన్ని పెంచడంలో సహాయపడతాయి. ఈ రసాన్ని క్రమం తప్పకుండా తాగడం వల్ల జలుబు, ఇతర ఇన్ఫెక్షన్లను నివారించవచ్చు. మధుమేహాన్ని నియంత్రిస్తుంది: బొప్పాయి ఆకుల రసం మధుమేహ వ్యాధిగ్రస్తులకు కూడా ప్రయోజనకరంగా ఉంటుంది. ఇది రక్తంలో చక్కెర స్థాయిలను నియంత్రించడంలో సహాయపడుతుంది. దీని భాగాలు ఇన్సులిన్ ఉత్పత్తిని ప్రోత్సహిస్తాయి. మధుమేహాన్ని నిర్వహించడం సులభం చేస్తుంది. కాలేయాన్ని ఆరోగ్యంగా ఉంచుతుంది:

## బిజినెస్ వాయిస్

### పీఎన్‌బీ పండుగ ఆఫర్.. తక్కువ వడ్డీకే కారు లోన్




పండుగ సీజన్ సందర్భంగా కార్లు కొనేవారి కోసం పంజాబ్ నేషనల్ బ్యాంక్(పీఎన్‌బీ) తక్కువ వడ్డీకే రుణాలివ్వనున్నట్టు ప్రకటించింది. ఏడాదికి కేవలం 7.85 శాతం నుంచి ప్రారంభమయ్యే కార్ లోన్ ఆఫర్ చేస్తూ బ్యాంకు వెల్లడించింది. దీంతో ఈ రేటు ప్రభుత్వ రంగ బ్యాంకులలోనే అత్యంత తక్కువ వడ్డీగా నిలిచింది. ఈ ఆఫర్ అక్టోబర్-డిసెంబర్ మధ్య మాత్రమే చెల్లుబాటు అవుతుందని బ్యాంకు తెలిపింది. అంతేకాకుండా కస్టమర్లకు సున్నా ప్రాసెసింగ్ ఫీజు, ఫ్లోటింగ్-రేటు రుణాలపై ముందస్తు చెల్లింపు లేదా ఫోర్‌క్లోజర్ ఛార్జీల మినహాయింపు, ఎక్కువ కాలం సౌకర్యంగా చెల్లించేలా ఏడేళ్ల వరకు ఈఎంఐ ఆప్షన్ ఉంటుందని బ్యాంకు పేర్కొంది.ముఖ్యంగా పండుగ ఆఫర్ కింద తక్కువ వడ్డీ రేటుతో పాటు బ్యాంకు నో-ఫీ పాలసీ సౌకర్యం ఇవ్వడం వల్ల కస్టమర్లు రూ. వేలాది ఆదా చేసుకోవచ్చని మార్కెట్ వర్గాలు చెబుతున్నాయి. నో-ఫీ పాలసీ అంటే వాహనం కొనే సమయంలో విధించే ప్రాసెసింగ్ ఫీజు వంటి అదనపు ఛార్జీలను తొలగించడం. ఇతర బ్యాంకుల్లో కార్లపై ఇచ్చే రుణాల వడ్డీ రేట్లను గమనిస్తే.. యూకో బ్యాంకు అతి తక్కువగా 7.60 శాతం ప్రారంభ వడ్డీ ఆఫర్ చేస్తోంది. కెనరా బ్యాంక్, బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర 7.70 శాతం నుంచి, ఎస్‌బీఐ 8.8 శాతం నుంచి వడ్డీ ఆఫర్ చేస్తోంది. ప్రైవేట్ బ్యాంకుల్లో హెచ్‌డీఎఫ్‌సీ, ఐసీఐసీఐ బ్యాంకులు 9.10 శాతం ప్రారంభ వడ్డీతో రుణాలిస్తున్నాయి.

### శాంసంగ్ నుంచి నయా ఫోన్



శాంసంగ్.... మన ఇండియాలో ఈ బ్రాండ్ కు చాలా మంది అభిమానులు ఉన్నారు. దానికి తగ్గట్టుగానే ఈ కంపెనీ నుంచి రకరకాల మొబైల్ ఫోన్స్ మార్కెట్లోకి లాంచ్ అవుతున్నాయి. ఇలాంటి నేపథ్యంలోనే తాజాగా ఝఎంబఅస్త్ర కంపెనీ నుంచి మరో సరికొత్త సేఫ్టీ మొబైల్ వచ్చింది. శాంసంగ్ ఎం సిరీస్ లో భాగంగా శాంసంగ్ గెలాక్సీ ఎం 17 5జీ పేరుతో కొత్త స్మార్ట్ ఫోన్ తీసుకువచ్చారు. ఈ మేరకు అధికారిక ప్రకటన కూడా వెలువడింది. అయితే అక్టోబర్ 13వ తేదీ నుంచి విక్రయాలు ప్రారంభం అవుతాయి. రిటైల్ అలాగే ఈ-కామర్స్ లో ఈ మొబైల్ కొనుగోలు చేయవచ్చు. ఈ మొబైల్ ఫీచర్స్ ఒకసారి పరిశీలిస్తే, ఎలాంటి సైబర్ అటాక్స్ జరగకుండా ప్రొటెక్షన్ మొబైల్ కు ఉంటుందని కంపెనీ వెల్లడించింది. అంటే ఆరు సంవత్సరాల పాటు సెక్యూరిటీ అప్డేట్స్ ఇస్తుందట. ఈ మొబైల్ 6.7 అంగుళాల డిస్?ప్లే కలిగి ఉంటుంది. ప్రధాన కెమెరా వచ్చేసి 50 మెగాఫిక్సల్ ఉంటుంది. సెల్ఫీల కోసం 13 ఎంపీ కెమెరా ఇచ్చారు. సఫైర్ బ్లాక్, మూన్ లైట్ సిల్వర్ కలర్లలో ఈ మొబైల్ మార్కెట్ లో లభించనుంది. 4జీబీం128 జీబీ మోడల్ మొబైల్ ధర 12,499 రూపాయలుగా ఫిక్స్ చేశారు. ఇందులో 6జీబీం128జీబీ మొబైల్ ఫోన్ 14,000 రూపాయలుగా ఉంది. 8జీబీం128జీబీ మొబైల్ 15,499 రూపాయలకు అందిస్తున్నారు. అంటే ఈ ఫోన్స్ సామాన్యులు కూడా కొనుగోలు చేసే విధంగా ధరలు ఫైనల్ చేశారు.

# పండుగ సీజన్ సేల్స్‌లో జాగ్రత్త.. పెరుగుతున్న ఏఐ, డీప్‌ఫేక్ మోసాలు

దేశవ్యాప్తంగా పండుగ సీజన్ వేళ అన్ని ఈ-కామర్స్ కంపెనీ సేల్స్ నిర్వహిస్తున్నాయి. ఇందులో భారీ ఎత్తున ఆఫర్లను కూడా అందిస్తున్నాయి. దీన్ని అదునుగా తీసుకుని చాలామంది సైబర్ నేరగాళ్లు పండుగ సీజన్‌కు ఆన్‌లైన్‌లో కొనేవారిని సులభంగా మోసం చేస్తున్నారు. ఇందుకు ప్రధానంగా వారు ఏఐ, డీప్‌ఫేక్ లాంటి టెక్నాలజీ వాడుతున్నారు. దీపావళి పండుగ సమీపిస్తున్న సమయంలో చాలామంది షాపింగ్ కోసం ఆన్‌లైన్ ప్లాట్‌ఫామ్‌లను ఉపయోగిస్తున్నారు. దీంతో సైబర్ దాడులు కూడా పెరుగుతున్నాయి. దేశంలోని ఆన్‌లైన్ వినియోగదారులలో దాదాపు ముగ్గురిలో ఒకరు ఇలాంటి మోసాల బారిన పడుతున్నారని సైబర్ సెక్యూరిటీ కంపెనీ మెక్‌అఫీ తెలిపింది. మరో 37 శాతం మంది ఆర్థికపరమైన నష్టాలను ఎదుర్కొన్నట్టు చెప్పారని పేర్కొంది.ఈసారి పండుగ సీజన్‌కు స్కామర్ల మోసాలు పెరిగాయి. సాంకేతికత అభివృద్ధి చెందుతున్న కొద్దీ, మోసపూరిత ఘటనలు కూడా పెరుగుతున్నాయి. ఏఐ-ఆధారిత స్కామ్‌లు ఆన్‌లైన్ స్టోర్లను నిర్వహించేవారికి కొత్త సవాలుగా మారాయని మెక్‌అఫీ సీనియర్ ఇంజనీరింగ్ డైరెక్టర్ ప్రతిమ్ ముఖర్జీ అన్నారు. దీన్ని అధిగమించేందుకు తరచూ వెబ్‌సైట్‌లను తనిఖీ చేయడం, డివైజ్‌లను సెక్యూర్‌గా ఉంచుకోవడం, అప్రమత్తంగా ఉండటం ద్వారా, సైబర్ దాడుల నుంచి బయటపడగలుగుతున్నామని ఆయన అన్నారు. కస్టమర్లు ఆన్‌లైన్‌లో ఎక్కువ కొనుగోళ్లు చేస్తున్న నేపథ్యంలో సైబర్ మోసగాళ్ళు డీప్‌ఫేక్ సెలబ్రిటీ ఎండార్స్‌మెంట్‌లు, ఫిషింగ్ మేసేజ్‌లు, స్కామ్ ఈ-మెయిల్‌లు, వన్-టైమ్ పాస్‌వర్డ్ (ఓటీపీ) సహా అధునాతన వ్యూహాలను ఉపయోగిస్తున్నారు. ముఖ్యంగా మొబైల్ ద్వారా




ఆన్‌లైన్ షాపింగ్ పెరుగుతుండటం కూడా సైబర్ మోసాలకు కారణం. 77 శాతం మంది ఇప్పుడు స్మార్ట్‌ఫోన్‌ల ద్వారా కొనుగోళ్లు చేస్తున్నారు. ముఖ్యంగా 25-44 సంవత్సరాల వయస్సు గల యువ కస్టమర్లు మొత్తం ఆన్‌లైన్ ప్లాట్‌ఫామ్‌లకు ప్రధాన కస్టమర్లుగా ఉన్నారు. గతేడాది కంటే 72 శాతం మంది ఏఐ-ఆధారిత స్కామ్‌ల గురించి ఎక్కువ ఆందోళన చెందుతున్నారు. దాదాపు 91 శాతం మందికి అనుమానాస్పద షాపింగ్ సంబంధిత మెసేజ్‌లు వచ్చాయి, వాటిలో నకిలీ 'గిఫ్ట్ కార్డ్ విన్నర్' పేరుతో (49 శాతం), 'లిమిటెడ్-టైమ్ ఆఫర్లు' (40 శాతం), 'రీఫండ్ నోటిఫికేషన్లు' (27 శాతం) ఉన్నాయి. సగటున, దేశంలోని ప్రజలు రోజుకు 12 స్కామ్ ప్రమాదాలను ఎదుర్కొంటున్నారు. సాధారణ మెసేజ్‌లు, ఫిషింగ్ ఈ-మెయిల్స్, మోసపూరిత సోషల్ మీడియా యాడ్స్ తర్వాతి స్థానాల్లో ఉన్నాయి. ముఖ్యంగా డీప్‌ఫేక్ సెలబ్రిటీ ఎండార్స్‌మెంట్‌లు, నకిలీ ఈ-కామర్స్ వెబ్‌సైట్‌లు ఎక్కువ ఆందోళన కలిగిస్తున్నాయి, ఇవి నిజమైనవా కాదా అని తేల్చడం క్లిష్టంగా మారిందని మెక్‌అఫీ నివేదిక పేర్కొంది.

## భారత కుటుంబాల వద్ద 3.8 ట్రిలియన్ డాలర్ల బంగారం

భారతీయ కుటుంబాల ఆర్థిక శక్తికి బంగారం ఎంతటి కీలకమో ప్రముఖ ఆర్థిక సేవల సంస్థ మోర్గాన్ స్టాన్లీ విడుదల చేసిన తాజా నివేదిక స్పష్టం చేసింది. దేశంలోని ఇళ్లలో ఉన్న పసిడి నిల్వల విలువ ఏకంగా 3.8 ట్రిలియన్ డాలర్లని, ఇది దేశ స్థూల జాతీయోత్పత్తిలో (జీడీపీ) 88.8 శాతానికి సమానమని ఈ నివేదిక అంచనా వేసింది. ప్రస్తుతం బంగారం ధరలు ఆల్-టైమ్ గరిష్ఠ స్థాయికి చేరడంతో, కుటుంబాల సంపదపై ఇది సానుకూల ప్రభావం చూపుతోందని శుక్రవారం విడుదల చేసిన ఈ నివేదికలో పేర్కొంది.ప్రస్తుతం బంగారం ధరలు రికార్డు స్థాయిలో కొనసాగుతున్నాయి. అంతర్జాతీయ మార్కెట్లో ఔన్సు బంగారం ధర 4,056 డాలర్ల వద్ద ఉండగా, దేశీయంగా 10 గ్రాముల పసిడి ధర సుమారు రూ. 1,27,300 పలుకుతోంది. ఈ ఏడాది ఇప్పటివరకు డాలర్లలో బంగారం ధర 54.6 శాతం పెరగ్గా, రూపాయిలలో 61.8 శాతం పెరిగినట్లు నివేదిక వివరించింది.ప్రపంచంలో బంగారం వినియోగంలో చైనా (28%) మొదటి స్థానంలో



ఉండగా, భారత్ (26%) రెండో స్థానంలో కొనసాగుతోంది. దేశంలో బంగారం డిమాండ్‌లో ఎక్కువ భాగం గృహ వినియోగం నుంచే వస్తోంది. అయితే, ఇటీవలి కాలంలో పెట్టుబడి మార్గాలు కూడా మారుతున్నాయి. భౌతిక బంగారం కాకుండా, ఈటీఎఫ్‌ల వంటి ఆర్థిక ఆస్తుల వైపు ప్రజలు మొగ్గు చూపుతున్నారని, గత 12 నెలల్లో ఈటీఎఫ్‌లలోకి 1.8 బిలియన్ డాలర్ల పెట్టుబడులు వచ్చాయని నివేదిక తెలిపింది.మరోవైపు, రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా కూడా తన పసిడి నిల్వలను పెంచుకుంటోంది. 2024 నుంచి ఆర్బీఐ సుమారు 75 టన్నుల బంగారాన్ని కొనుగోలు చేసింది. దీంతో ఆర్బీఐ వద్ద ఉన్న మొత్తం బంగారం నిల్వలు 880 టన్నులకు చేరాయి. ఇది దేశ మొత్తం విదేశీ మారక నిల్వల్లో 14 శాతానికి సమానం.దేశంలో స్థూల ఆర్థిక స్థిరత్వం కారణంగా బంగారం దిగుమతులు అదుపులోనే ఉన్నాయని మోర్గాన్ స్టాన్లీ విశ్లేషించింది. ద్రవ్యోల్బణం సగటున 5 శాతంగా ఉండటం, సానుకూల వడ్డీ రేట్లు కొనసాగడం వల్ల ప్రజలు భౌతిక ఆస్తులపై అధికంగా ఆధారపడటం లేదని పేర్కొంది. ప్రస్తుతం బంగారం దిగుమతులు జీడీపీలో 1-1.5 శాతం మధ్య ఉండగా, 2013 మే నెలలో ఇది రికార్డు స్థాయిలో 3.3 శాతంగా ఉండేది. ఈ స్థిరత్వం కరెంట్ ఖాతా లోటుపై ఒత్తిడిని తగ్గించడంలో సహాయపడిందని నివేదిక ముగించింది.

# గిల్ శతక జోరు, జడ్డూ వికెట్ల వేట.. రెండో టెస్టులో పట్టుబిగించిన భారత్

ప్రపంచ టెస్టు ఛాంపియన్‌షిప్ సైకిల్‌లో భారత జట్టు చెలరేగిపోతోంది. తొలి టెస్టులో ఇన్నింగ్స్ విజయంతో వెస్టిండీస్‌కు షాకిచ్చిన టీమిండియా రెండో టెస్టులోనూ పట్టుబిగించింది. అరుణ్‌జైట్లీ స్టేడియంలో శుభ్‌మన్ గిల్ సెంచరీతో భారీ స్కోర్ అందిస్తే.. ఆ తర్వాత రవీంద్ర జడేజా వికెట్ల వేటతో విండీస్‌కు దడపుట్టించాడు. జడ్డూ విజృంభణతో పీకల్లోతు కష్టాల్లో కూరుకుపోయిన కరీబియన్ టీమ్.. రెండో రోజు ఆట ముగిసే సరికి 4 వికెట్ల నష్టానికి 140 రన్స్ చేసింది. ఇంకా 378 పరుగుల లోటుతో ఉంది పర్యాటక జట్టు. ఢిల్లీ టెస్టులోనూ భారత జట్టు జోరు చూపిస్తోంది. టాపార్డర్ మెరుపులతో భారీ స్కోర్ చేసిన టీమిండియా అనంతరం వెస్టిండీస్ భరతం పడుతోంది. తొలి ఇన్నింగ్స్‌ను శుభ్‌మన్ గిల్ సేన డిక్లేర్ చేశాక బ్యాటింగ్‌కు దిగిన పర్యాటక జట్టుకు ఓపెనర్లు శుభారంభం ఇవ్వలేకపోయారు. సిరాజ్, బుమ్రా బౌలింగ్‌లో వికెట్ కాపాడుకున్న జాన్ క్యాంప్‌బెల్ (10) స్పిన్నర్ జడేజా ఓవర్లో స్వీప్‌షాట్ ఆడి వికెట్ పారేసుకున్నాడు. సుదర్శన్ చక్కగా అందుకోవడంతో అతడు నిరాశగా పెవిలియన్ చేరాడు. తగ్‌నరైన్ చందర్‌పాల్(34), అలిక్ అథనజే (41)లు కాసేపు ప్రతిఘటించి విండీస్‌ను ఆదుకునేలా కనిపించారు. కానీ, జడ్డూ తన మ్యాజిక్




చూపించగా చందర్‌పాల్‌ను స్లిప్‌లో రాహుల్ చేతికి చిక్కాడు. దాంతో, రెండో వికెట్‌కు 66 పరుగుల భాగస్వామ్యానికి తెరపడగా.. 87 పరుగులకే రెండో వికెట్ పడింది. క్రీజులో కుదురుకున్న అథనెజేను కుల్దీప్ ఔట్ చేయగా.. రోస్టన్ ఛేజ్(0)ను రిటర్న్ క్యాచ్‌తో జడ్డూ డగౌట్ చేర్చాడు. అంతే.. 107కే నాలుగు వికెట్లు పడడంతో మరోసారి ఆలౌట్ ప్రమాదంలో పడింది విండీస్. అయితే..రు షాయ్ హోప్ (31 నాటౌట్), టెవిన్ ఇమ్లేచ్ (14 నాటౌట్) ఆచితూచి ఆడుతూ వికెట్ కాపాడుకున్నారు. దాంతో.. రెండో రోజు ఆట ముగిసే సరికి విండీస్ 4 వికెట్లు కోల్పోయి140 రన్స్ చేసింది. ఈ ఇద్దరిని మూడో రోజు త్వరగా వెనక్కి పంపితే తొలి సెషన్‌లోనే కరీబియన్ జట్టు కుప్పకూలడం ఖాయం.

**గిల్, జురెల్ దంచేయగా**

తొలి రోజు ఓపెనర్లు కేఎల్ రాహుల్(38), యశస్వీ జైస్వాల్(175) శుభారంభంతో గట్టి పునాది వేయగా.. యశస్వీ శతకంతో రెచ్చిపోయాడు. మూడో స్థానంలో కుదురుకున్న సాయి సుదర్శన్ (87) అర్ధ శతకంతో చెలరేగడంతో మొదటి రోజే భారీ స్కోర్ చేసిన భారత్.. రెండో రోజు తొలి సెషన్ మొదలైన కాసేపటికే యశస్వీ వికెట్ కోల్పోయింది. మూడో డబుల్ సెంచరీ కొట్టాలనుకున్న యశస్వీ.. సారథి శుభ్‌మన్ గిల్(129 నాటౌట్)తో సమన్వయం లోపంలో రనౌట్ అయ్యాడు. ఆ తర్వాత నితీశ్ కుమార్ రెడ్డి (43) జతగా తనదైన షాట్లతో అలరించిన గిల్ జట్టు స్కోర్ బోర్డును 400 దాటించాడు. నితీశ్ వెనుదిరిగాక.. ధ్రువ్ జురెల్(44)తో కలిసి కీలక భాగస్వామ్యం నెలకొల్పాడు. గ్రీవ్స్ ఓవర్ల సిక్సర్‌తో దూకుడు పెంచిన గిల్.. కెరీర్లో శతకం సాధించాడు. ఆ తర్వాత మరింత రెచ్చిపోయిన గిల్ సిక్స్, ఫోర్లతో విండీస్ బౌలర్లను వణికించాడు. అయితే.. రోస్టన్ ఛేజ్ ఓవర్లో జురెల్ బౌల్డ్ కావడంతో 518/5 వద్ద టీమిండియా ఇన్నింగ్స్ డిక్లేర్ చేసింది.

### ఇదొక ఊహించని పరిణామం.. తప్పు అతడిదే: కుంబ్లే




టెస్టుల్లో ఇప్పటికే రెండు డబుల్ సెంచరీలు సాధించాడు టీమిండియా ఓపెనర్ యశస్వి జైస్వాల్ వెస్టిండీస్‌తో రెండో టెస్టు సందర్భంగా ముచ్చటగా మూడోది పూర్తి చేస్తాడనుకుంటే ఊహించని రీతిలో రనౌట్ అయ్యాడు. ఢిల్లీలో శనివారం నాటి రెండో రోజు ఆట సందర్భంగా.. అనవసరపు పరుగు కోసం యత్నించి జైసూ మూల్యం చెల్లించాడు. 175 పరుగుల వ్యక్తిగత స్కోరు వద్ద రనౌట్ అయి డబుల్ సెంచరీకి 25 పరుగుల దూరంలో నిలిచిపోయాడు. టీమిండియా తొలి ఇన్నింగ్స్ 92వ ఓవర్లో ఈ ఘటన జరిగింది. జేడన్ సీల్స్ బౌలింగ్‌లో బంతిని మిడాఫ్ దిశగా జైసూ బంతిని బాదగా.. అది నేరుగా ఫీల్డర్ దగ్గరకు వెళ్లింది. అయితే అప్పటికే పరుగు కోసం క్రీజు వీడిన జైస్వాల్.. మరో ఎండ్‌లో ఉన్న కెప్టెన్ శుభ్‌మన్ గిల్‌కు పిలుపునిచ్చాడు. కానీ ఫీల్డర్ చేతికి బంతి చిక్కడంతో జాగ్రత్త పడ్డ గిల్ కాస్త ముందుకు కదిలినా మళ్లీ తన స్థానంలోకి వచ్చేశాడు. ఇంతలో జైసూ వెనక్కి పరిగెత్తగా అప్పటికే జరగాల్సిన నష్టం జరిగిపోయింది. ఈ నేపథ్యంలో జైసూ- గిల్ తీరుపై విమర్శలు వస్తుండగా.. టీమిండియా మాజీ కెప్టెన్ అనిల్ కుంబ్లే మాత్రం గిల్‌కు మద్దతుగా నిలిచాడు. స్వీయ తప్పిదంతోనే జైస్వాల్ వికెట్ పారేసుకున్నాడని అభిప్రాయపడ్డాడు. "ఇదొక ఊహించని పరిణామం. జైస్వాల్ వంటి ప్రతిభావంతమైన ఆటగాడు ఇలా చేస్తాడని ఎవరైనా అనుకుంటారా?.. తన షాట్ బాగానే ఆడానని జైస్వాల్ భావించి ఉంటాడు. ఏదేమైనా పరుగుకోసం వెళ్లాలనేది జైస్వాల్ నిర్ణయం.

**తప్పంతా అతడిదే**

ఇందులో నాన్-స్ట్రైకర్ ఎండ్‌లో ఉన్న ఆటగాడి (గిల్) తప్పేమీ లేదు. ఎందుకంటే జైసూ మిడాఫ్ ఫీల్డర్‌కు నేరుగా బంతిని అందించినట్లయింది. ఆ సమయంలో పరుగుకు తీయడానికి అసలు అవకాశమే లేదు" అని స్టార్ స్పోర్ట్స్ షోలో కుంబ్లే పేర్కొన్నాడు. ఇదిలా ఉంటే.. రెండో రోజు ఐదు వికెట్ల నష్టానికి 518 పరుగుల వద్ద ఉన్న వేళ టీమిండియా తమ తొలి ఇన్నింగ్స్ డిక్లేర్ చేసింది. గిల్ 196 బంతులు ఎదుర్కొని 16 ఫోర్లు, రెండు సిక్సర్ల సాయంతో 129 పరుగులతో అజేయంగా నిలిచాడు.

## క్రీడా వాయిస్

### గిల్‌కు అప్పుడదే చెప్పాం.. కోచ్‌గా ఆ ఓటమిని ఎన్నటికీ మర్చిపోలేను



ఇంటర్నెట్ డెస్క్: భారత జట్టుకు ప్రధాన కోచ్‌గా గౌతమ్ గంభీర్ ఛాంపియన్స్ ట్రోఫీ, ఆసియా కప్‌లను అందించాడు. ఇంగ్లాండ్‌తో ఐదు టెస్టుల సిరీస్‌ను డ్రాగా ముగించాడు. కానీ, కోచ్‌గా బాధ్యతలు చేపట్టిన తొలినాళ్లలో వరుసగా ఓటములను చవిచూశాడు. స్వదేశంలో న్యూజిలాండ్‌తో టెస్టు సిరీస్‌ను కోల్పోవడాన్ని ఎప్పటికీ మరిచిపోలేనని గౌతమ్ గంభీర్ తెలిపాడు. వెస్టిండీస్‌తో రెండో టెస్టు సందర్భంగా మాజీ క్రికెటర్ ఆకాశ్ చోప్రాతో గంభీర్ మాట్లాడాడు. ఆ వీడియోను విండీస్‌తో రెండో టెస్టు రెండో రోజు లంచ్ బ్రేక్ సమయంలో క్రీడా ఛానల్ ప్రసారం చేసింది. "ప్రపంచంలోనే అత్యుత్తమ జట్టుగా మారాలనుకుంటే.. కేవలం స్వదేశంలో గెలిస్తేనే సరిపోదు. విదేశాల్లోనూ సత్తా చాటడం అత్యంత ముఖ్యం. ఇప్పుడీ యువ జట్టు చూపించే తెగువ అదే. ఇంగ్లాండ్ జట్టు మనకు అత్యంత కఠినమైన సవాల్ విసిరే టీమ్. అక్కడికి పెద్దగా అనుభవం లేని జట్టుతో వెళ్లాం. అద్భుతమైన ప్రదర్శనతో తిరిగి వచ్చాం. ఇక్కడ కేవలం రిజల్ట్స్‌ను మాత్రమే చూడకూడదు. ఎలాంటి పోరాటం చేశామనేది అత్యంత కీలకం. డబ్ల్యూటీసీ ఫైనల్‌కు చేరాలంటే కేవలం స్వదేశంలోనే గెలిస్తేనే సరిపోతుందని నేను భావించను. ఇక్కడే విజయాలు సాధిస్తే వరల్డ్ ఛాంపియన్‌షిప్ విజేతగా నిలవలేరు" అని గంభీర్ తెలిపాడు.

**మరిచిపోవడం కష్టమే..**

"నా కోచింగ్ కెరీర్ ముగిసినా సరే.. జీవితాంతం న్యూజిలాండ్‌తో జరిగిన టెస్టు సిరీస్‌ను మరిచిపోలేను. ఇదే విషయాన్ని మా కుర్రాళ్లకూ చెప్పా. దానిని వదిలేసి ముందుకు సాగాల్సిన అవసరం ఉంది. అలాగే గతాన్ని ఎప్పుడూ గుర్తుపెట్టుకోవాలి. అలా చేయకపోతే దేనినైనా తేలికగా తీసుకొనే అవకాశం ఉంటుంది. క్రీడల్లో ఇవన్నీ సహజమే. ప్రతి ఒక్కరూ ఇలాంటి పరిస్థితులను ఎదుర్కొనే ఉంటారు. నేను డ్రెస్సింగ్ రూమ్‌లో కూడా ఆటగాళ్లకు ఎప్పుడూ న్యూజిలాండ్ టెస్టు సిరీస్‌లో ఏం జరిగిందో చెబుతూ ఉంటా. ప్రత్యర్థికి ఏమాత్రం ఛాన్స్ ఇవ్వకూడదనేది నా భావన" అని గంభీర్ వ్యాఖ్యానించాడు.

**మద్దతు ఇస్తూనే ఉంటా**

"యువ కెప్టెన్ శుభ్‌మన్ గిల్‌కు ఎప్పుడూ మద్దతుగా నిలుస్తా. అతడిని 25 ఏళ్ల వయసులోనే టెస్టు సారథిగా చేసినప్పుడు ఒకటే చెప్పాం. 'మేం నిన్ను లోతైన సముద్రంలోకి నెట్టాం. రెండే మార్గాలు ఉంటాయి. పైకి వచ్చి గొప్ప స్విమ్మర్ కావడమా? లేదా మునిగిపోవడమా? సారథిగా తొలి టెస్టు సిరీస్‌లోనే 750o పరుగులు చేయడం కంటే ఆ ఒత్తిడిని తట్టుకొని జట్టును నడిపించిన తీరే నాకు నచ్చింది. అంతకంటే కఠినమైన టెస్టు సిరీస్‌ను తన జీవితంలో ఎదుర్కొని ఉండకపోవచ్చు. సారథిగా పదేళ్లు, 15 ఏళ్లు లేదా రెండేళ్లా అనేది పక్కన పెడితే.. ఇంగ్లాండ్‌తో రెండు నెలలను చాలా చక్కగా హ్యాండిల్ చేశాడు. ఓవల్ టెస్టు తర్వాత అతడితో మాట్లాడుతూ 'నువ్వు కఠినమైన టెస్టులో పాస్ అయ్యావు. ఇక నుంచి అంతా సులువుగానే మారిపోతుంది' అని చెప్పా.






# ఒకే నెలలో మూడు సినిమాలు

## కృతిశెట్టి మళ్లీ ట్రాక్‌పైకి వచ్చేనా?

తొలి సినిమాతోనే తెలుగులో గ్రాండ్ సక్సెస్ అందుకున్న భామల్లో ఒకరు కృతిశెట్టి. ఉప్పెన సినిమాతో టాలీవుడ్‌కు పరిచయమైన ఈ ముద్దుగుమ్మ సూపర్ ఫ్యాన్ బేస్ సంపాదించుకుంది. అద్భుతమైన నటనతో కుర్రకారు మనసు దోచేసిన కృతిశెట్టి ఆ తర్వాత శ్యామ్ సింగరాయ్, బంగార్రాజు సినిమాలతో బ్యాక్ టు బ్యాక్ హిట్స్ అందుకుంది. కానీ ఆ తర్వాత చేసిన సినిమాలు మాత్రం కృతిశెట్టికి నిరాశనే మిగిల్చాయని చెప్పాలి. కృతిశెట్టి హీరోయిన్‌గా నటించిన కస్టడీ, మనమే, ది వారియర్, మాచెర్ల నియోజకవర్గం సినిమాలు బాక్సాఫీస్ వద్ద బోల్తా కొట్టాయి. ఈ వరుస ఫెయిల్యూర్స్ టాలీవుడ్‌లో కృతిశెట్టి ప్రయాణంపై ప్రభావం చూపించాయి. అయితే ఇక చేసేదేమి లేక తమిళంలో తన లక్‌ను పరీక్షించుకోవాలనుకున్నకృతిశెట్టి అక్కడ మూడు సినిమాలకు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. పాపులర్ యాక్టర్లతో సినిమాలు చేసి.. షూటింగ్స్ పూర్తి చేసినా పలు కారణాల వల్ల ఆలస్యమవుతూ వచ్చాయి. తీవ్ర నిరాశలో ఉండిపోయిన కృతిశెట్టి అభిమానుల కోసం వరుసగా ఆ సినిమాలు విడుదలకు రెడీ అయ్యాయి. పై మూడు సినిమాలు ఒకేసారి ఒకే నెలలో విడుదలకు ముస్తాబవుతున్నాయి. ఈ మూడు ప్రాజెక్టులు కూడా డిసెంబర్ నెలలోనే రిలీజ్ కాబోతుండటం విశేషం. కృతిశెట్టి కార్తీతో కలిసి నటిస్తున్న వా వాథియార్, ప్రదీప్ రంగనాథన్ లవ్ ఇన్సూరెన్స్, రవిమోహన్ సినిమాలు డిసెంబర్‌లో ప్రేక్షకుల ముందుకు రాబోతున్నాయి. మరి చాలా కాలంగా సరైన బ్రేక్ ఎదురుచూస్తున్న కృతిశెట్టికి ఈ డిసెంబర్ అయినా కలిసి రావాలని కోరుకుంటున్నారు అభిమానులు, ఫాలోవర్లు.



## ఫన్నీగా 'కె ర్యాంప్' ట్రైలర్

కిరణ్ అబ్బవరం, యుక్తి తరేజా జంటగా నటించిన సినిమా 'కె ర్యాంప్'. దీపావళి కానుకగా ఈ నెల 18న థియేటర్లలోకి మూవీ రానుంది. ఇప్పటికే ప్రమోషన్లలో టీమ్ బిజీగా ఉంది. ఈ క్రమంలోనే తాజాగా ట్రైలర్ రిలీజ్ చేశారు. ఇది ఫన్నీగా ఉంటూనే ఆకట్టుకునేలా ఉంది. టీజర్ విడుదలైనప్పుడు లిప్ కిస్సులు, బూతుల గురించి కాస్త నెగిటివిటీ వచ్చింది. దీంతో ఈసారి ట్రైలర్?లో ఆ డోస్ తగ్గించినట్లే కనిపించారు. రెండు మూడు చోట్ల మాత్రం కిస్సులు, డబుల్ మీనింగ్ బూతులు వినిపించాయి. ట్రైలర్ బట్టి చూస్తే.. కుమార్ అనే కుర్రాడికి తండ్రి మాత్రమే ఉంటాడు. దీంతో అల్లరిచిల్లరగా తిరుగుతూ మందు తాగుతూ బతికేస్తుంటాడు. అయితే చదువుకునేందుకు కేరళలోని కొచ్చి వెళ్తాడు. అక్కడ ఓ అమ్మాయిని చూసి ఇష్టపడతాడు. ఇబ్బంది పెట్టి మరీ ఆమె తనని ప్రేమించేలా చేస్తాడు. కుమారే అనుకుంటే ఆమెకు సైకలాజికల్ ప్రాబమ్స్ ఉంటాయి. దీంతో తిక్కతిక్కగా ప్రవరిస్తుంది. చివరకు ఈ జంట ఒక్కటైందా లేదా అనేది స్టోరీలా అనిపిస్తుంది. చాన్నాళ్లుగా కిరణ్ అబ్బవరం సినిమాలు చేస్తున్నాడు. కానీ గతేడాది దీపావళికి రిలీజైన 'క' చిత్రం మాత్రమే హిట్ అయింది. ఈ ఏడాది మార్చిలో 'దిల్ రుబా' అనే మూవీతో వచ్చాడు. ఇది ఘోరంగా ఫ్లాప్ అయింది. దీంతో యూత్?ని టార్గెట్ చేసి 'కె ర్యాంప్' తీశాడు. మరి ఇది ఎలాంటి ఫలితాన్ని ఇస్తుందో చూడాలి? దీపావళికి దీనితో పాటు మిత్రమండలి, తెలుసు కదా, డ్యూడ్ సినిమాలు కూడా రిలీజ్ కాబోతున్నాయి.

## డార్క్ చాక్లెట్ మూవీ.. పెద్దలకు మాత్రమే



రీసెంట్ టైంలో సినిమాల్లో వైల్డ్‌నెస్ పేరిట బూతుల్ని, బూతు సన్నివేశాల్ని అక్కడక్కడ ఉపయోగిస్తున్నారు. కొన్నింటికి సెన్సార్ కత్తటర వేస్తున్నప్పటికీ మరికొన్నిసార్లు మాత్రం మూవీకి 'ఏ' సర్టిఫికెట్ లాంటివి తెచ్చుకుని రిలీజ్ చేస్తున్నారు. వీటిని యూత్ చూస్తారు. ఫ్యామిలీ అడియెన్స్ కాస్త దూరంగానే ఉంటారు. సరే ఇదంతా పక్కనబెడితే రానా నిర్మాతగా 'డార్క్ చాక్లెట్' అనే మూవీ త్వరలో రాబోతుంది. దీని టీజర్ ఇప్పుడు రిలీజ్ చేశారు. టీజర్ చూస్తుంటే.. యజ్ఞ అనే హీరో, ఓ ముగ్గురు వ్యక్తుల(ఓ మహిళ, ఇద్దరు పురుషులు) మధ్య జరిగే కథే ఈ సినిమా స్టోరీలా అనిపిస్తుంది. అయితే టీజర్ బూతు సన్నివేశాలేం లేవు గానీ బూతు మాటలు మాత్రం కాస్త గట్టిగానే వినిపించాయి. అయితే వీటిని టీజర్ కోసమే పెట్టారా? నిజంగా మూవీలోనూ ఉంచుతారా అనేది చూడాలి? అయితే హీరో రానా నిర్మాతగా ఈ తరహా మూవీ వస్తుందని అస్సలు ఊహించలేదు. '35' సినిమాతో గుర్తింపు తెచ్చుకున్న విశ్వదేవ్ ఇందులో హీరో కాగా బిందుమాధవి హీరోయిన్. మరో ఇద్దరు కూడా తెలుగు నటులే. 'కిడ్స్ పక్కకెళ్లి ఆడుకోండి' ,'పాన్ మసాలా మూవీ', 'జానర్ అడగొద్దు' లాంటి క్యాప్షన్స్ చూస్తుంటే కాస్త ఆసక్తికరంగానే అనిపిస్తుంది. అలానే రిలీజ్ ఎప్పుడనేది కూడా అక్టోబరు 31, నవంబరు 14, డిసెంబరు 5 అని మూడు తేదీలు ప్రకటించి, మనల్నే ఎంచుకోమన్నట్లు చూపించారు. శశాంక్ శ్రీ వాస్తవ్య దర్శకుడు కాగా వివేక్ సాగర్ సంగీతమందించాడు. చూస్తుంటే ఇది పెద్దల కోసం మాత్రమే తీసిన సినిమాలా అనిపిస్తుంది.






# నేషనల్ క్రష్‌గా రష్మిక ఔట్.. ఇంటర్నేషనల్ క్రష్ గా మరో కన్నడ బ్యూటీ..!

కన్నడ చిత్ర పరిశ్రమ నుంచి వచ్చిన మరో స్టార్ హీరోయిన్ ఇప్పుడు తన హవా చాటుతుంది. 'సప్త సాగరదాచె ఎల్లో' సినిమాతో పరిచయమై, 'కాంతార ఛాప్టర్ 1'లో కనకవతి పాత్రలో నటించిన రుక్మిణి వసంత్ ఇప్పుడు నేషనల్ స్థాయిని దాటి ఇంటర్నేషనల్ క్రష్‌గా మారిపోయారు. 'కాంతార ఛాప్టర్ 1' బ్లాక్‌బస్టర్ విజయంతో ఆమె పేరు దేశవ్యాప్తంగా మారుమోగుతోంది. హొంబాలే ఫిల్మ్స్ నిర్మించిన కాంతార చాప్టర్ 1 చిత్రం విడుదలైన వారం రోజుల్లోనే రూ. 500 కోట్లకు పైగా వసూలు చేసి సంచలనం సృష్టించింది. కన్నడ సినిమా రంగంలో ఇదొక అరుదైన రికార్డు. అద్భుతమైన కథ, దృశ్యకావ్యం లాంటి విజువల్స్‌తో పాటు, రుక్మిణి వసంత్ నటనకు ప్రేక్షకుల నుంచి ప్రశంసలు వెల్లువెత్తుతున్నాయి. ఇప్పటి వరకు 'నేషనల్ క్రష్'గా రష్మిక మందన్న పేరు వినిపిస్తుండగా, ఇప్పుడు ఆ స్థానం రుక్మిణికి చెందిందని నెటిజన్లు భావిస్తున్నారు. సోషల్ మీడియాలో ఆమెపై ప్రశంసల వర్షం కురుస్తోంది. ఇక ఆమెను కర్ణాటక క్రష్, కన్నడ క్రష్, ఇంటర్నేషనల్ క్రష్ అంటూ పిలుస్తున్నారు. రష్మిక మందన్నపై ఇటీవల కన్నడ ప్రేక్షకుల్లో కొంత వ్యతిరేకత నెలకొన్న సంగతి తెలిసిందే. అదే సమయంలో రుక్మిణి వసంత్ 'కాంతార 2' విజయంతో వెలుగులోకి రాగా ఆమెను రష్మికకు బదులుగా ప్రొజెక్ట్ చేస్తున్నారు. ఇక రష్మిక, విజయ్ దేవరకొండ ఎంగేజ్‌మెంట్ చేసుకోబోతున్నారన్న వార్తల నడుమ, ఆమె వెనుకబడతుందన్న ఊహాగానాలు ఊపందుకున్నాయి. ప్రస్తుతం రుక్మిణి వసంత్ తమిళ, కన్నడ సినిమాలతో బిజీగా ఉన్నారు. త్వరలోనే తెలుగులోనూ ఎంట్రీ ఇవ్వనున్నట్టు సమాచారం. 'కాంతార 2 ' విజయంతో ఆమె కెరీర్‌లో కొత్త అధ్యాయం మొదలైందనడంలో సందేహమే లేదు. ఇక రష్మిక మందన్న స్థాయిని రుక్మిణి వసంత్ చేరతారా? లేక ఈ క్రేజ్ తాత్కాలికమా? అన్నది తెలియాలంటే మరికొన్ని రోజులు ఆగాల్సిందే. కాగా రష్మిక మందన్నా క్రేజ్ ఇప్పుడు ఏమి తగ్గలేదు. ఆమెకి వరుస ఆఫర్లు వెల్లువెత్తుతున్నాయి. చేసిన ప్రతి సినిమా కూడా మంచి విజయం సాధిస్తూనే ఉంది. మరి రష్మిక, రుక్మిణి ఫైట్‌లో గెలుపెవరిదో చూడాలి.

# పాజిటివ్ టాక్‌తో దూసుకెళ్తున్న అరి

'పేపర్ బాయ్' లాంటి సున్నితమైన ప్రేమ కథతో అందరినీ మెప్పించిన దర్శకుడు 'అరి' అంటూ ఈ వారం ఆడియెన్స్ ముందుకు వచ్చాడు. నిన్న (అక్టోబర్ 10) విడుదలైన ఈ చిత్రానికి మంచి స్పందన లభిస్తోంది. మీడియా నుంచి సోషల్ మీడియా వరకు ఆడియెన్స్ నుంచి మౌత్ టాక్ ఇలా అన్నీ కూడా పాజిటివ్‌గానే ఉన్నాయి. ఈ వారం వచ్చిన చిత్రాలన్నింట్లోనూ అరి కాస్త ముందు వరుసలో ఉందని చెప్పుకోవచ్చు. అరికి మంచి ప్రశంసలు లభించడం, ఆదరణ దక్కుతుండటంతో టీంలో కొత్త ఉత్తేజం వచ్చినట్టుగా కనిపిస్తోంది. ఇక 'అరి' సక్సెస్ సాధించడంతో కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి సైతం దర్శకుడు జయశంకర్‌ను అభినందించారు. ఏడేళ్ల శ్రమకు తగ్గ ప్రతిఫలం దక్కిందని కొనియాడారు. అరి విజయం సాధించినందుకు అభినందనలు తెలిపారు. ప్రస్తుతం అరి చిత్రం రెండు తెలుగు రాష్ట్రాల్లోని ప్రజల్ని ఆకట్టుకుంటోంది. ఇక అరి చిత్రంలోని కథ, కథనం, ఇచ్చిన సందేశం ఆడియెన్స్‌ను మెప్పిస్తోంది. 'అరి' చిత్రానికి అనూప్ రూబెన్ సంగీతం ప్రధాన ఆకర్షణగా నిలిచింది. విజువల్స్ పరంగానూ మంచి పేరు వచ్చింది. మొత్తానికి అరితో దర్శకుడు జయశంకర్ ద్వితీయ విఘ్నం దాటినట్టుగా చెప్పుకోవచ్చు. అరి సినిమాలోని మాటలు, పాటలు అందరినీ ఆకట్టుకుంటున్నాయి. సినిమా ప్రారంభం నుండి ముగింపు వరకూ ఓ ట్రాన్స్ లో డైరెక్టర్ జయశంకర్ సీన్ టు సీన్ తీసుకుంటూ వెళ్ళిపోయారని చూసిన ఆడియెన్స్ మెచ్చుకుంటున్నారు. ఈ చిత్రంలో వినోద్ వర్మ, అనసూయ భరద్వాజ్, సాయి కుమార్, శ్రీకాంత్ అయ్యంగార్ పాత్రలకు అందరూ కనెక్ట్ అవుతున్నారు.

VISWAM VOICE Telugu Daily: Edited, Printed, Published and Owned by KHANDAVELLI SUNIL KUMAR, H.No:3-168, Pedda Brahmamgariveedi, Rayavaram, Rayavaram (M), East Godavari District, Andhra Pradesh. Pin:533346. Ph:092460 33999, 9238823333, 8099966647, Printed at Kumar Publication, H.No.9-125, Indiramma Colony, Rayavaram, Rayavaram(M), East Godavari District, Andhra Pradesh. Pin:533346, Editor: KHANDAVELLI SUNIL KUMAR. RNI No: APTEL 2017/73603, viswamvoice@gmail.com